www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 30-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 324 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి ఉ.11:09 తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఆర్ద్ర తె.3:27 తదుపరి పునర్వసు, వర్జ్యం: మ.1:10-2:38, దుర్ముహూర్తం: ఉ.9:06-9:51, మ.12:50-1:35, అమృతఘడియలు: రా.6:17-7:45, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 6:05 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'ద్రవ్యోల్బణ' అంచనాకు కొత్త లెక్కలు

ఈ నెల నుంచే అమలు

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాల ప్రమాణాలు మారిపోతున్నాయి. ఈ నెల నుంచే ఇది అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు సీపీఐ కోసం 2012 నాటి ధరల ఆధారంగా 299 వస్తువుల ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకునే వారు. ఇక నుంచి 2024 నాటి ధరల ఆధారంగా 358 వస్తువుల ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. ఈ కొత్త ప్రామాణికాలతో లెక్కించే జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణ వివరాలను కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ వచ్చే నెల 12న వెల్లడించనుంది. రిటైల్ ద్రవ్యోల్బణ అంచనా కోసం కొత్తగా విమాన చార్జీలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో అమ్మే వస్తువుల ధరలు, అమెజాన్ ప్రైమ్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ చందాల వివరాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీంతో సీపీఐ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ వివరాలు మరింత వాస్తవికంగా ఉంటాయని భావిస్తున్నారు.

మూడో రోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. ప్రారంభంలో సూచీలు భారీ నష్టాలు చవి చూసినా ఆర్థిక సర్వే ప్రకటించిన ఆశావహ వైఖరితో సూచీలు లాభాల్లోకి అడుగు పెట్టాయి. ప్రారంభంలో 637 పాయింట్ల మేరకు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 221.69 పాయింట్ల లాభంతో 82,566.37 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 76.15 పాయింట్ల లాభంతో 25,418.90 వద్ద క్లోజయింది.

సరికొత్త గరిష్ఠానికి బంగారం

- ఒక్కరోజే రూ.12,000 పెరిగిన ధర

ఢిల్లీ మార్కెట్లో గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.83 లక్షలు పలికింది. బుధవారంతో పోల్చితే ధర ఒక్క రోజే రూ.12,000 పెరిగింది. మంగళవారం బంగారం ధర రూ.1.71 లక్షల వద్ద ముగిసింది. బంగారం ధరలో ఇది కొత్త రికార్డు. కిలో వెండి ధర సైతం బుధవారంతో పోల్చితే రూ.19,500 పెరిగి రూ.4,04,500 పలికింది. 3 వరుస సెషన్లలో వెండి ధర రూ.67,500 పెరిగింది. ఈ జనవరిలో ఇప్పటివరకు వెండి ధర రూ.1,65,500 పెరిగింది. డిసెంబరు చివరిలో కిలో వెండి ధర 2.39 లక్షలతో పోల్చితే ఈ 29 రోజుల్లో ధర 69.2% దూసుకుపోయింది. ఇది శతాబ్దికి ఒక్కసారి మాత్రమే వచ్చే అవకాశమని, అందుకే ధరలు ఇలా దూసుకుపోతున్నాయని పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,78,850 ▲	1,63,950 ▲	4,20,000 ▲
విజయవాడ	1,85,000 ▲	1,73,000 ▲	4,05,000 ▲
విశాఖపట్నం	1,84,503 ▲	1,63,950 ▲	4,25,000 ▲
రాజమండ్రి	1,78,850 ▲	1,63,150 ▲	3,86,000 ▲
ప్రొద్దుటూరు	1,85,000 ▲	1,70,200 ▲	4,00,000 ▲
ముంబై	1,75,340 ▲	1,60,611 ▲	3,79,988 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	135	విజయవాడ	143
వరంగల్	135	గుంటూరు	143
కరీంనగర్	135	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	126
కర్నూలు	135	నెల్లూరు	131
విశాఖపట్నం	135	అనంతపురం	131
గోదావరి	143		

2026-27లో వృద్ధి రేటు 6.8-7.2 శాతం

ఆర్థిక సర్వే నివేదిక అంచనా

- అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి పెంపుపై దృష్టి పెట్టాలి..
- ధరల సూచీ మళ్లీ కాస్త పెరగవచ్చు..
- ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నా అంతర్జాతీయ ప్రతికూలతలతో ఇబ్బందులు
- విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వల్లే రూపాయి భారీగా క్షీణించింది..
- రూపాయి ప్రస్తుత విలువ మన ఆర్థిక బలాన్ని ప్రతిబింబించట్లేదు..
- బలమైన, స్థిరమైన కరెన్సీతోనే వికసిత భారత్ లక్ష్యాలను సాధించగలం



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో జీడీపీ వృద్ధి రేటు 6.8-7.2 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని ఆర్థిక సర్వే నివేదిక అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి అంచనాతో పోలిస్తే కాస్త తగ్గనున్నప్పటికీ, ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగనుందని రిపోర్టు పేర్కొంది. గడిచిన కొన్నేళ్లలో ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణలు వార్షిక వృద్ధి సామర్థ్యాన్ని 6.5-6.8 శాతం శ్రేణి నుంచి 7 శాతానికి పెంచాయంది. "అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ స్థిర వృద్ధికి అవకాశం ఉంది. దీనికి జాగ్రత్త అవసరం. కానీ నిరాశావాదం కాదు" అని రిపోర్టు అభిప్రాయపడింది. ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ పర్యవేక్షణలో రూపొందించిన ఈ ఆర్థిక సర్వే నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఇందులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- అంతర్జాతీయ అనిశ్చితి వాతావరణంలో దేశీయ వృద్ధిపై దృష్టి సారించాలి. ఇందుకు నిల్వల పెంపు, ద్రవ్య లభ్యతకు ప్రాధాన్యమివ్వాలి. ఇతర దేశాలతో పోలిస్తే భారత ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో నమోదైన ఆర్థిక వ్యవస్థ పనితీరు మన ఆర్థిక స్థిరత్వంతోపాటు అంతర్జాతీయ ఒడుదుడుకుల్లోనూ నిలకడగా వృద్ధి సాధనను ప్రదర్శిస్తోంది.
- కీలక ఉత్పత్తుల ధరలకు కళ్లెం పడటంతో ద్రవ్యోల్బణం (ధరల వార్షిక పెరుగుదల రేటు) అదుపులోకి వచ్చింది. వ్యవస్థలో వస్తు సరఫరా మెరుగైందనడానికిది సంకేతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026-27లో ద్రవ్యోల్బణం మళ్లీ కాస్త పెరిగే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

భవిష్యత్‌లో రాగి కొరత!

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సేవల కోసం డేటా సెంటర్లు పెరిగిపోతుండటంతో ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని, దాంతో రాగి కొరత ఏర్పడవచ్చని సర్వే అంచనా వేసింది. ప్రపంచంలో ఇంధన పరివర్తనం ఇకపై సాంకేతికత ద్వారానే నిర్ణయింపబడదని, కీలక ఖనిజాలను ఎవరు నియంత్రిస్తున్నారనే దానిపై ఆధారపడి ఉంటుందని నివేదిక పేర్కొంది. లిథియం, కోబాల్ట్, నికెల్, కాపర్‌తో పాటు అరుదైన ఖనిజాలు వ్యూహాత్మక అవరోధాలుగా మారాయంది.

- ఆర్థిక వ్యవస్థలో వైరుధ్య పరిస్థితి నెలకొంది. మన ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయి. దాంతో మన కరెన్సీ తీవ్ర ఒత్తిడినెదుర్కొంటోంది.
- రూపాయి పనితీరు గత ఏడాది పేలవంగా ఉంది. రూపాయి ప్రస్తుత విలువ మన పటిష్ఠ ఆర్థిక మూలాలను ప్రతిబింబజేయట్లేదు. అయితే, రూపాయి క్షీణత అమెరికా అధిక సుంకాల ప్రభావాన్ని కొంత మేర తగ్గించగలుగుతోంది.
- బలమైన, స్థిరమైన కరెన్సీతోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగలగడంతోపాటు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలం.
- యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన తయారీ పోటీతత్వం, ఎగుమతి వాణిజ్యం, వ్యూహాత్మ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది. వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో అందిపుచ్చుకునేందుకు మిగతా దేశాల కంటే చౌకగా తయారు చేయాల్సిన అవసరం ఉంది.
- జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణతో పాటు ఇతర సంస్కరణలు అంతర్జాతీయ అనిశ్చితులను అవకాశాలుగా మలిచాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ మార్పులను సర్దుబాటు చేసుకోనుంది.
- భౌగోళిక రాజకీయ మార్పులతో ప్రపంచ ఆర్థిక పరిస్థితులు కూడా మారాయి. పెట్టుబడులు, సరఫరా వ్యవస్థ, వృద్ధి అవకాశాలపై అవి ప్రభావం చూపుతున్నాయి.
- భవిష్యత్‌లో సంభవించే అంతర్జాతీయ సంక్షోభాలు భారత్‌కు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే అవకాశాన్ని పంచనున్నాయి.
- ప్రభుత్వం ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.4 శాతానికి కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో లోటు బడ్జెట్ అంచనాల కంటే తగ్గి 4.8 శాతానికి పరిమితమైంది.
- భారత విమానయాన రంగం సుస్థిర వృద్ధి పథంలో సాగుతోంది. ప్రభుత్వ సానుకూల విధానాలు, మౌలిక వసతుల విస్తరణ ఇందుకు తోడ్పడుతున్నాయి. భారత్ మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఎదిగింది. 2014లో దేశంలో 74 ఎయిర్‌పోర్టులు ఉండగా.. 2025 నాటికి వాటి సంఖ్య 164కు పెరిగింది.
- కృత్రిమ మేధ (ఏఐ) బూమ్ ఆశించిన ఉత్పాదక ప్రయోజనాలను అందించడంలో విఫలమైనట్లైతే అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభాన్ని చవిచూడాల్సి రావచ్చు. దాంతో ఈక్విటీలు సహా ఆశావహ అసెట్ క్లాస్‌ల విలువలు భారీగా క్షీణించే ప్రమాదం ఉంది.
- పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పనకు కీలకమైన ఉక్కు రంగం సవాళ్లు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ లోహం ధరలో వ్యత్యాసం, ముడి సరుకు లభ్యత ఇందుకు కారణమవుతున్నాయి.
- భారత్‌లో తయారైన కార్లకు ప్రపంచ మార్కెట్లో ఆమోదం పెరుగుతున్నదనడానికి గడిచిన కొన్నేళ్లలో దేశీయ వాహన కంపెనీల ఎగుమతులు భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనం. గత ఆర్థిక సంవత్సరంలో మన ఆటోమొబైల్ కంపెనీలు 53 లక్షల యూనిట్ల వాహనాలను (అన్ని రకాలు కలిపి) ఎగుమతి చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం ఎగుమతుల్లో రెండంకెల వృద్ధి నమోదైంది.



భారత్ తయారీ, ఎగుమతుల పెంపు, సంస్కరణలకు ప్రాధాన్యమిస్తే మరికొన్నేళ్లలో వార్షిక వృద్ధి రేటు సామర్థ్యం 7.5 శాతానికి పెరిగే అవకాశం ఉంటుంది. మధ్యకాలిక వృద్ధికి అనుకూలంగా గడిచిన మూడేళ్లలో పలు అంశాల్లో సంస్కరణల జోరును పెంచింది. తయారీకి ప్రోత్సాహక పథకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనల సడలింపు, రవాణా వ్యవస్థ సంస్కరణలు సామర్థ్యాన్ని సృష్టించేందుకు తోడ్పడ్డాయి.

- వీ అనంత నాగేశ్వరన్, సీఈఏ

స్వదేశీ అనివార్యం

ఎగుమతులపై నియంత్రణ పెరగడంతో పాటు అభివృద్ధి చెందిన దేశాల సాంకేతిక నిరాకరణ, కర్బన పన్నుల విధానాలతో ప్రపంచీకరణ ప్రక్రియకు తెరపడినట్లేనని.. ఈ నేపథ్యంలో భారత్ స్వదేశీపై దృష్టిపెట్టడం అనివార్యం, తప్పనిసరని ఆర్థిక సర్వే నివేదిక అభిప్రాయపడింది. దిగుమతుల ప్రత్యామ్నాయాలు, వ్యూహాత్మక స్థితిస్థాపకత, ఆవశ్యకతపై స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక విధానాలను ఏకకాలంలో చేపట్టాల్సి ఉందని సూచించింది. ఎందుకంటే, ప్రస్తుతం మన దేశం సాంకేతికత, మార్కెట్లు, ముడిసరుకులు సునాయసంగా, శాశ్వతంగా అందుబాటులో ఉంటాయన్న నమ్మకం లేని పరిస్థితుల్లో ఉన్నామని.. ఈ పరిస్థితుల్లో స్వదేశీ మంత్రమే మనకు రక్షణాత్మక, పోరాట సాధనమని పేర్కొంది. దక్షత, ఆవిష్కరణ, ప్రపంచ ఏకీకరణకు భంగం కలగకుండా స్వదేశీ విధానాలను అనుసరించాలంది. స్వదేశీ సాధారణ సిద్ధాంతంలా కాకుండా క్రమశిక్షణతో కూడిన వ్యూహమై ఉండాలని సర్వే నివేదిక సూచించింది. దిగుమతులను వీలైనంతగా తగ్గించుకుని, అవకాశమున్న ప్రతి వస్తువును దేశీయంగానే ఉత్పత్తి చేసుకోవాలంది. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ క్రమశిక్షణ, విదేశీ ధోరణి, విశ్వసనీయ నిష్క్రమణతో కూడిన తెలివైన స్వదేశీకరణను అనుసరించాలని సర్వే నివేదిక సూచించింది.

బంగారం, వెండి ఆకాశంలోనే..

అంతర్జాతీయ అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కారణంగా బంగారం, వెండి ధరలు రికార్డు గరిష్ఠాల వద్దే కొనసాగవచ్చని సర్వే నివేదిక పేర్కొంది. భౌగోళిక, వాణిజ్య యుద్ధాలకు తెరపడి, శాంతి నెలకొంటే తప్ప ధరలు దిగివచ్చే అవకాశాలు కన్పించడం లేదని అంటోంది.

మూడో అతిపెద్ద విమాన మార్కెట్‌గా భారత్

ఎయిర్‌బస్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత పౌర విమానయాన మార్కెట్ భవిష్యత్‌పై విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ అత్యంత ఆశాభావంతో ఉంది. మరో పదేళ్లలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద పౌర విమానయాన మార్కెట్‌గా ఎదగనుందని ఎయిర్‌బస్ ఇండియా అండ్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్, ఎండీ జర్గన్ వెస్టర్‌మీయర్ చెప్పారు. గురువారం నాడిక్కడ వింగ్స్ ఇండియా 2026లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత విమానయాన సంస్థలు వంద కంటే ఎక్కువ సీట్లు ఉన్న 850 వాణిజ్య విమానాలను నడుపుతున్నాయని, 2035 నాటికి ఈ సంఖ్య 2,250కి చేరనుందని చెప్పారు. ఇదే సమయంలో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 2035 నాటికి ప్రస్తుత 150 నుంచి 200కు చేరే అవకాశం ఉందన్నారు. ఈ అభివృద్ధితో వచ్చే పదేళ్లలో భారత విమానయాన రంగంలో ఉద్యోగ అవకాశాలు భారీగా పెరుగుతాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం 12,000గా ఉన్న పైలెట్ల సంఖ్య 35,000కు, సాంకేతిక సిబ్బంది సంఖ్య 11,000 నుంచి 34,000కు చేరనుందన్నారు.

యూఏసీతో ఫ్లెమింగో ఏరోస్పేస్ ఒప్పందం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఫ్లెమింగో ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్.. రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా యూఏసీ నుంచి ఆరు 68 సీట్ల ఐఎల్-114-300 ప్రాంతీయ విమానాలను కొనుగోలు చేయనుంది. తొలుత విమానాలను కొనుగోలు చేసినప్పటికీ తదనంతరం భారత్‌లోనే ఈ విమానాల తయారీకి ఈ భాగస్వామ్యం దోహదపడనుందని ఫ్లెమింగో ఏరోస్పేస్ సీఈఓ సుభాకర్ పప్పుల తెలిపారు. ఇందుకు సంబంధించి టెక్నాలజీ బదిలీని యూఏసీ చేపడుతుందని ఆయన చెప్పారు. 2027 చివరి నాటికి యూఏసీ నుంచి తొలి విమానం అందుకుంటామని, మిగిలిన విమానాలను విమానయాన కంపెనీలకు అనుగుణంగా భారత్‌లోనే సిద్ధం చేసి ఇవ్వనున్నట్లు సుభాకర్ తెలిపారు. ఆ తర్వాత భారత్‌లోనే విమానాల తయారీకి ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.5,254 కోట్లు

క్యూ3లో లాభంలో 25 శాతం వృద్ధి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,254 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 25 శాతం (రూ.4,214 కోట్లు) వృద్ధి చెందింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.4,104 కోట్ల నుంచి రూ.5,155 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ పేర్కొంది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా కెనరా బ్యాంక్ ఇన్‌చార్జ్ సీఈఓ, ఎండీ హర్‌దీప్ సింగ్ అహ్లువాలియా మాట్లాడుతూ..సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 1.13 శాతం వృద్ధితో రూ.4,104 కోట్లుగా నమోదైందని తెలిపారు. ఈ కాలంలో బ్యాంక్ మొత్తం గ్లోబల్ వ్యాపారం 13.23 శాతం పెరిగి రూ.27,13,594 కోట్లకు చేరుకుందన్నారు. ఈ కాలంలో గ్లోబల్ డిపాజిట్లు 12.95 శాతం పెరుగుదలతో రూ.15,21,268 కోట్లుగా ఉండగా దేశీయ డిపాజిట్లు 11.10 శాతం వృద్ధితో రూ.13,97,045 కోట్లుగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రిటైల్ రుణ పోర్టుఫోలియో 31.37 శాతం పెరిగి రూ.2,73,395 కోట్లకు చేరుకోగా హౌసింగ్ రుణ విభాగం 17.58 శాతం వృద్ధి చెంది రూ.1,21,172 కోట్లకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.35 శాతం నుంచి 2.08 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 0.54 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది. డిసెంబరు ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం శాఖల సంఖ్య 10,066 గా ఉండగా ఏటీఎంల సంఖ్య 7,048గా ఉంది. లండన్, న్యూయార్క్, దుబాయ్ సహా గుజరాత్ ఐబీయూ గిఫ్ట్ సిటీలో 4 విదేశీ శాఖలను బ్యాంక్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు భవేంద్రకుమార్, సునీల్ కుమార్ ఛగ్, ఎస్‌కే మజుందార్ పాల్గొన్నారు.

పసిడి డిమాండ్‌కు ధరల సెగ

ఈ ఏడాది డిమాండ్ 700 టన్నుల లోపే: డబ్ల్యూజీసీ

న్యూఢిల్లీ: దేశీయ, విదేశీ మార్కెట్లలో బంగారం ధరలు ఒక హద్దు అనేది లేకుండా దూసుకుపోతున్న ప్రభావం డిమాండ్‌పై పడింది. వివాహాల సీజన్‌లో కూడా బంగారం కొనుగోళ్లు గత ఏడాదితో పోల్చితే తగ్గడమే ఇందుకు నిదర్శనం. 2025లో బంగారం డిమాండ్ అంతకు ముందు ఏడాదితో పోల్చితే 11% క్షీణించి 802.8 టన్నుల నుంచి 710.9 టన్నులకు పరిమితమైంది. ఈ ఏడాది డిమాండ్ 600-700 టన్నులకే పరిమితం కావచ్చని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. దేశంలోను, ప్రపంచ స్థాయిలోనూ బంగారం ధరల తీరుతెన్నులపై డబ్ల్యూజీసీ ఒక నివేదిక విడుదల చేసింది. వివాహాల సీజన్‌లో సైతం బంగారం డిమాండ్ 23% క్షీణించి 145.3 టన్నులకు పరిమితమైనట్టు సంస్థ ప్రాంతీయ సీఈఓ సచిన్ జైన్ అన్నారు. ఇక అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో (క్యూ4) డిమాండ్ 9% పడిపోయి 241.3 టన్నులకు పరిమితమైంది. 2024తో పోల్చితే ఆభరణాల డిమాండ్ సైతం 24% తగ్గి 563.4 టన్నుల నుంచి 430.5 టన్నులకు పడిపోయింది. విలువపరంగా మాత్రం డిమాండు రూ.4,04,510 కోట్ల నుంచి రూ.4,54,390 కోట్లకు పెరిగింది.

విలువలో ఘనమే: బంగారం డిమాండ్ పరిమాణంపరంగా తగ్గినా విలువపరంగా మాత్రం దూసుకుపోయింది. 2024లో బంగారం కొనుగోళ్ల విలువ రూ.5,75,930 కోట్లుండగా గత ఏడాది రూ.7,51,490 కోట్లకు దూసుకుపోయింది. సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటే 2024 జనవరిలో ఇది రూ.70,754 ఉండగా 2025 జనవరి నాటికి 67% పెరిగి రూ.1,01,572కి చేరింది.

ప్రపంచ డిమాండ్ 5000 టన్నులు: ప్రపంచంలో బంగారం డిమాండ్ 2025లో 5,000 టన్నుల మైలురాయిని దాటింది. 2024లో డిమాండ్ 4,961.9 టన్నులుండగా 2025లో అది 5,002 టన్నులకు చేరిందని డబ్ల్యూజీసీ తెలిపింది. ఇదే కాలంలో ప్రధానంగా పెట్టుబడి డిమాండ్ 1,185.4 టన్నుల నుంచి 2,175 టన్నులకు దూసుకుపోయింది. ధరల్లో ఎప్పటికప్పుడు భారీ వృద్ధి చోసుకుంటున్న తరుణంలో సురక్షితమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి ప్రాధాన్యత పెరగడమే ఇందుకు కారణం.

స్పోర్ట్స్

ఫైనల్లో సబలెంక X రిబకినా

ఆస్ట్రేలియన్ ఓపెన్ | **పెగులా, స్విటోలినా ఓటమి**



రిబకినా



సబలెంక

మెల్‌బోర్న్: టాప్‌సీడ్ అర్యాన సబలెంక, ఐదోసీడ్ ఎలీనా రిబకినా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. గురువారం జరిగిన సెమీఫైనల్లో బెలారస్ భామ సబలెంక 6-2, 6-3తో 12వ సీడ్ ఉక్రెయిన్ స్టార్ స్విటోలినాను చిత్తు చేసింది. వరల్డ్ నెం.1 సబలెంకకు మెల్‌బోర్న్ పార్క్‌లో ఇది వరుసగా ఐదో ఫైనల్ కావడం విశేషం. మరో సెమీస్‌లో కజకిస్థాన్‌కు చెందిన వింబుల్డన్ మాజీ విజేత రిబకినా 6-3, 7-6 (7)తో ఆరో సీడ్ జెస్సిక పెగులా (అమెరికా)పై గెలిచింది. తుదిపోరు శనివారం జరుగనుంది. మరి.. 2023 ఫైనల్లో ఇక్కడ సబలెంక చేతిలో ఓటమికి రిబకినా బదులు తీర్చుకుంటుందేమో చూడాలి.

సబలెంకకు పెనాల్టీ: మొదటి సెట్ నాలుగో గేమ్‌లో బంతిని కొడుతున్న సమయంలో సబలెంక బిగ్గరగా అరుస్తుండడంతో చైర్ అంపైర్ ఆమెకు ఒక పాయింట్ పెనాల్టీగా విధించింది. అయితే అంపైర్ నిర్ణయంతో విభేదించిన సబలెంక వీడియోను పరిశీలించి నిర్ణయంపై సమీక్ష చేయాలని కోరింది. వీడియో తిలకించిన చైర్ అంపైర్ సబలెంక నోటినుంచి పెద్దగా శబ్దం వస్తున్నదని నిర్ధారించుకొని స్విటోలినాకు పాయింట్ కేటాయించింది. దీనిపై సబలెంక అసంతృప్తి ప్రకటించింది. కాగా..మ్యాచ్ అనంతరం సబలెంక, స్విటోలినా షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకపోవడం గమనార్హం.

పురుషుల సెమీస్ నేడు

పురుషుల సెమీఫైనల్స్‌లో భాగంగా శుక్రవారం జరిగే పోరులో టాప్ సీడ్ అల్కారజ్.. మూడో సీడ్ జ్వెరెవ్‌తో తలపడనున్నాడు. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్, రెండో సీడ్ సినర్- నాలుగో సీడ్ జొకోవిచ్‌ను ఢీకొంటాడు. కెరీర్ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న అల్కారజ్, నిరుటి రన్నరప్ జ్వెరెవ్‌ను దాటతాడా..? పదిసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన 38 ఏళ్ల జొకోవిచ్.. గత రెండు సార్లుగా మెల్‌బోర్న్ పార్క్ విజేతగా నిలిచిన 24 ఏళ్ల సినర్‌ను నిలువరించగలడా? నేడు తేలనుంది.

చేతన్ అజేయ శతకం

● నాగాలాండ్ 322/6 ● ఆంధ్రతో రంజీ

సోవిమా (నాగాలాండ్): చేతన్ బిస్త్ (160 బ్యాటింగ్) అజేయ శతకంతో చెలరేగడంతో.. ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో నాగాలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 322/6 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ఆఖరుకు బిస్త్‌తోపాటు నగాహో చిషి (37 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నిశ్చల్ (74) హాఫ్ సెంచరీ చేశాడు. సాయి తేజ, సత్యనారాయణ రాజు చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

దిగొచ్చిన పీసీబీ!

2న పాక్ జట్టు శ్రీలంక పయనం

కరాచీ: టీ20 వరల్డ్‌కప్‌ను బాయ్‌కాట్ చేస్తామంటూ బీరాలు పలికిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) దారిలో కొచ్చినట్టుంది. తాజాగా తాము ఆడే మ్యాచ్‌ల కోసం శ్రీలంక వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈక్రమంలో వచ్చే నెల 2న ఆటగాళ్లంతా కొలంబో వెళ్లేందుకు విమాన టిక్కెట్లు కూడా బుక్ చేసుకున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మద్దతుగా తాము కూడా టోర్నీ నుంచి వైదొలిగేందుకు ఆలోచిస్తామని, లేక భారత్‌తో మ్యాచ్‌నైనా బాయ్‌కాట్ చేస్తామని పీసీబీ నుంచి వార్తలు వినిపించాయి. అటు పాక్ రాకపోతే ఆ స్థానంలో బంగ్లాను ఆడిస్తామని ఐసీసీ చెప్పడంతో పీసీబీ దెబ్బకు దిగొచ్చినట్టయ్యింది. ఏ విషయమన్నది అధికారికంగా శుక్రవారం తేలనుంది. పాక్ ప్రధాని షహబాజ్‌తో పీసీబీ చీఫ్ నఖ్వీ ఇప్పటికే ఈ అంశంపై చర్చించినట్టు సమాచారం. బాయ్‌కాట్ చేస్తే భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున టోర్నీలో ఆడాలంటూ ప్రధాని సూచించినట్టు పీసీబీ వర్గాలు తెలిపాయి.

పాక్‌ను ఆడేసుకున్న ఐస్‌లాండ్

పాకిస్థాన్ బహిష్కరణ ప్రేలాపనలను ఆఖరికి ఐస్‌లాండ్ క్రికెట్ కూడా ఎద్దేవా చేసింది. పాక్ కనుక టోర్నీ నుంచి వైదొలగితే తాము ఆ జట్టు స్థానంలో ఆడేందుకు సిద్ధమని ప్రకటించింది. ఈమేరకు తమ దేశం నుంచి కొలంబో ప్రయాణ షెడ్యూల్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేసి పాకిస్థాన్‌ను మరింత పరిహసించింది.

భళా.. బెంగళూరు

ఫైనల్ చేరిన ఆర్‌సీబీ

చెలరేగిన హ్యారిస్, మంధాన • యూపీపై విజయం



గ్రేస్ హ్యారిస్

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ X ముంబై (రా. 7.30)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం యూపీ వారియర్స్‌తో జరిగిన తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో అత్యధికంగా 12 పాయింట్లతో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గ్రేస్ హ్యారిస్ (2/22; 37 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 75) ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకోగా.. కెప్టెన్ స్మృతి మంధాన (27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 54 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వారియర్స్ 20 ఓవర్లలో 143/8 స్కోరు సాధించింది. ఓపెనర్లు దీప్తి శర్మ (55), లానింగ్ (41) మాత్రమే రాణించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 74 పరుగులు అందించాక.. ఆర్‌సీబీ బౌలర్ల ధాటికి బ్యాటింగ్ ఆర్డర్ తడబడింది. డిక్లెర్క్ నాలుగు వికెట్లతో దెబ్బతీసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హ్యారిస్ నిలిచింది.

హ్యారిస్ దూకుడు: ఓ మాదిరి ఛేదనను ఆర్‌సీబీ 13.1 ఓవర్లలోనే 147/2 స్కోరుతో పూర్తి చేసింది. ఓపెనర్ హ్యారిస్ తొలి రెండు బంతులనే ఫోర్లుగా మలిచి ఎదురుదాడి ఆరంభించింది. అలాగే మూడో ఓవర్‌లో ఏకంగా ఐదు ఫోర్లతో 20 రన్స్ రాబట్టింది. ఈ ధాటికి పవర్‌ప్లేలో జట్టు 63 రన్స్ సాధించగా.. హ్యారిస్ ఓ సిక్సర్‌తో 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసింది. మరో ఎండ్‌లో మంధాన హ్యాట్రిక్ ఫోర్లతో జట్టు స్కోరు 9వ ఓవర్‌లోనే వంద దాటింది. తర్వాతి ఓవర్‌లోనే హ్యారిస్ వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 108 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత 26 బంతుల్లో అర్ధసెంచరీ బాదిన మంధాన మరో 41 బంతులుండగానే ఓ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించింది. కాగా.. ఎలిమినేటర్ విజేతతో ఫిబ్రవరి 5న ఫైనల్‌లో తలపడనుంది.

సంక్షిప్త స్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 143/8 (దీప్తి 55, లానింగ్ 41; డిక్లెర్ 4/22, హ్యారిస్ 2/22).
బెంగళూరు: 13.1 ఓవర్లలో 147/2 (హ్యారిస్ 75, మంధాన 54 నాటౌట్; ఆశ 1/24).

సరైన మద్దతు, గౌరవం లేకనే..

రిటైర్మెంట్‌పై యువరాజ్

న్యూఢిల్లీ: ఆటను ఆస్వాదించలేకపోవడంతో పాటు మద్దతు, గౌరవం లభించకపోవడం వల్లే క్రికెట్‌కు వీడ్కోలు పలికానని భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తెలిపాడు. 2019 వన్డే వరల్డ్‌కప్ కోసం ప్రకటించిన జట్టులో తన పేరు లేకపోవడంతో యువీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 'నా ఆటను ఆస్వాదించలేకపోయా. నేనే సంతృప్తిగా లేనప్పుడు ఇక క్రికెట్ ఆడి ఏం ప్రయోజనం? అలాగే నాకు సరైన మద్దతు, గౌరవం దక్కడం లేదని తెలిశాక కూడా ఆటలో కొనసాగడం సరికాదనిపించింది. అయినా నేనింకా ఏం నిరూపించుకోవాలి? మానసికంగా, శారీరకంగానూ అంతకుమించి ఆటకు ఎక్కువ ఇవ్వలేనని భావించా' అని తన రిటైర్మెంట్‌పై ఓ పాడ్‌కాస్ట్‌లో యువరాజ్ వివరించాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 30-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

APPSC

గ్రూప్-1 ఫలితాలు సిద్ధం

నేడు విడుదల చేసే అవకాశం 11

కల్తీ కోసమే కుట్ర!

నిబంధనల సడలింపే అసలు కారణం.. కల్తీ నెయ్యిపై 'సిట్' తేల్చిన నిజమిది

నేతి బీరలో... నెయ్యి ఉంటుందా? ఉండనే ఉండదు! పేరులో మాత్రమే 'నెయ్యి' ఉంటుంది. అలాగే... వైసీపీ హయాంలో తిరుమల శ్రీవారి ప్రసాదాల లడ్డూల కోసం సరఫరా చేసిన 'నెయ్యి'లోనూ నెయ్యి లేదు. అది నెయ్యి కానే కాదు. వందశాతం రసాయనాల మిశ్రమం! ఈ విషయం తేల్చింది ఎవరో కాదు! సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, రాష్ట్ర పోలీసులతో ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం! తిరుమలకు వెళ్లి అత్యంత పవిత్రంగా తెచ్చుకుని... ఇంట్లో పూజ చేసిన తర్వాత కళ్లకద్దుకుని తీసుకునే ప్రసాదాన్ని ఇంత ఘోరంగా కల్తీ చేసిన పాపం మూటగట్టుకున్నారు. కాసుల కోసం కక్కుర్తి పడి కల్తీ సరుకులు వాడే హోటళ్లు, దాబాల తరహాలో... నీచంగా, దారుణంగా శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యిని సరఫరా చేశారు. నాటి టీటీడీ పెద్దలు నెయ్యి సరఫరా టెండరు నిబంధనలు సడలించి 'కల్తీ'కి తలుపులు బార్లా తెరిచారు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' ఎప్పుడో చెప్పింది. ఇప్పుడు... 'సిట్' కూడా నిర్ధారించింది.

- ఏడాదిన్నర కిందటే 'ఆంధ్రజ్యోతి' చెప్పింది
- టీడీపీ హయాంలో కఠినమైన నిబంధనలు
- వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సడలింపులు
- చుక్క పాలు కొనని కంపెనీలకూ 'ఆహ్వానం'
- అనుభవం, అర్హతలకు పాలకమండలి పాతర
- పాత్రధారులు సరే... సూత్రధారులు ఎవరు?
- అంతిమ లబ్ధిదారుల గుట్టు రట్టు చేస్తారా?




(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇది కాసుల కోసం కక్కుర్తి! పక్కాగా, ముందస్తు ప్రణాళిక రచించి, అమలు చేసిన కుట్ర! ఒకటీ రెండూ కాదు... ఏకంగా 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని టీటీడీకి అంటగట్టారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. సుప్రీంకోర్టు నియమించిన 'సిట్' స్వయంగా ఈ విషయం తేల్చింది. 'మంచిది మాకు అక్కర్లేదు. రంగూ, వాసన ఉంటే చాలు... కల్తీ నెయ్యే కావాలి' అనేలా జగన్ సర్కారు హయాంలో వ్యవహరించారు. 2020లోనే దీనికి స్కెచ్ వేశారని 'సిట్' తేల్చింది. అంతకుముందుదాకా ఉన్న కఠినమైన నిబంధనలను వ్యూహాత్మకంగా సడలించేశారు. అప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నది వైవీ సుబ్బారెడ్డి. టీటీడీ కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా పనిచేసింది, ఇప్పుడూ అదే పదవిలో ఉన్న అనిల్ కుమార్ సింఘాల్! నిబంధనల సడలింపు ఫలితంగా... నాణ్యతా ప్రమాణాలకు రక్షణ కవచంలా ఉన్న అర్హతలు చెరిగిపోయాయి. దిక్కుమాలిన, ఊరూపేరులేని, ఒక్క ఆవు లేని, చుక్క పాలూ సేకరించని ఉత్తుత్తి కంపెనీలు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్నాయి. తిరుమలకు

మిగతా 12వ పేజీలో...

కల్తీ నెయ్యి కథ ఇదీ — 2019 వైసీపీ సర్కారులో బీజం నుంచి సీబీఐ సిట్ చార్జిషీట్ దాకా..


'సిట్' చెప్పిందిలా...



"నిబంధనలను ప్రైవేటు డెయిరీలకు అనుకూలంగా మార్చారు. సహకార డెయిరీలు టెండర్లలో పాల్గొనలేకపోయాయి. కనీసం చుక్కపాలు కూడా కొనుగోలు చేయని కంపెనీలు, ఈ రంగంలో అనుభవం లేని కంపెనీలకు టెండర్లలో పాల్గొనే వెసులుబాటు కల్పించారు. లడ్డూ ప్రసాదంకోసం ఉపయోగించే నెయ్యి నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడ్డారు!"

'కేజ్రీవాల్' సూత్రం వర్తించదా?

'పాలసీ'ని మార్చడం వల్లే లిక్కర్ కుంభకోణం జరిగిందంటూ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉండగానే అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. నాటి ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియానూ సీబీఐ అరెస్టు చేసింది. కల్తీ నెయ్యికీ మూలం 'పాలసీ'లో చేసిన మార్పులే. టెండరు నిబంధనలు, అర్హతలను సడలించడమే ఈ స్కామ్‌కు మూలం! ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఏకంగా సీఎం, డిప్యూటీ సీఎం పదవుల్లో ఉన్నవారినే సీబీఐ అరెస్టు చేసింది. కల్తీ నెయ్యి కుట్ర మొత్తం ఛేదించిన సీబీఐ... అసలు సూత్రధారులను, అంటే 'పాలసీ' మార్చిన నాటి పెద్దల జోలికి ఎందుకు వెళ్లడంలేదు?



ఆర్థిక సర్వేను విడుదల చేస్తున్న ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, అధికారులు

ఏఐతో దేశంలో ఉద్యోగాలకు పెను ముప్పు

- వైట్ కాలర్ కొలువుల్లో భారీగా కోతలు

- ఏఐ రంగంలో అమెరికా అలవిమాలిన పెట్టుబడులు
- 2008 తరహా సంక్షోభానికి 20% వరకు అవకాశం
- జాతీయ ఆర్థిక సర్వే అంచనాలు
- అనిశ్చితిలోనూ 7.4% జీడీపీ వృద్ధి రేటుకు అవకాశం
- ఊబకాయం, డిజిటల్ అడిక్షన్ అతిపెద్ద ఆరోగ్య ముప్పు
- ఉప్పు, తీపి, నూనె పదార్థాలపై చట్టబద్ధ హెచ్చరికలు
- రూ.64.5 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు
- కావాలంటే దాంతో విదేశీ అప్పు మొత్తం తీర్చొచ్చు

న్యూఢిల్లీ, జనవరి 29: మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు పెను ముప్పులు పొంచివున్న నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిందని జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో

మిగతా 2వ పేజీలో...

అమరావతి.. అవకాశాల గని

- టాప్-10 జీవనయోగ్య నగరాల్లో బెజవాడ, తిరుపతి.. తాజా ఆర్థిక సర్వే వెల్లడి
- ఆర్థికపరంగా ప్రమాదకర స్థాయిలో ఏపీ.. ఆరేళ్ల నుంచీ రెవెన్యూ లోటే!
- ద్రవ్యోల్బణం తగ్గుముఖం.. వ్యాపార వాతావరణం మెరుగు.. బిజినెస్ రిఫార్మ్ ప్లాన్ అమలు
- రిజిస్ట్రేషన్, భూకేటాయింపులు, వేగంగా పర్యావరణ అనుమతులు 10
- విదేశీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ భేష్.. అకాల వర్షాలు, విపత్తులతో తగ్గిన వరి దిగుబడి


గుట్కా మాఫియా.. చీకటి దందా

- పన్నులు ఎగవేస్తూ బ్లాకులో విక్రయం.. పాన్ మసాలాల పేరిట దోపిడీ
- బిల్లులో బ్యాగ్ ధర 10 వేలు.. మార్కెట్లో 25 వేలు 3
- ఒడిశా, కర్ణాటక నుంచి ఒకే బిల్లుతో రెండు, మూడు ట్రిప్పులు
- గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, అనంతలో కోట్లలో చీకటి వ్యాపారం
- సామాన్యులకు రోగాలు.. ఖజానాకు చిల్లు



అమెరికా రహస్య ఫైళ్లను బహిర్గతపరిచిన 'సైబర్ చీఫ్'

- చాట్ జీపీటీలో అప్‌లోడ్ చేసిన సీఐఎస్‌ఏ తాత్కాలిక డైరెక్టర్ మధు గొట్టుముక్కల 2
- అమెరికాలో కలకలం.. ఘటనపై విచారణ
- మధు ఏయూ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి



ప్రపంచానికి భారత్ ఆశాకిరణం!


- ఈయూతో ఒప్పందం ఉత్పత్తిదారులకు భలే చాన్సు 2
- సంస్కరణల రథంపై ఇండియా పరుగులు
- పార్లమెంటు స్తంభన కాదు.. పరిష్కారాలకిది సమయం: మోదీ



11

సీఎం పదవికి జగన్ అనర్హుడు!

- అధికారం ఇస్తే ఒక్కరోజూ బయటకు రాలేదు
- పాదయాత్ర ప్రజల కోసం కాదు.. పదవి కోసమే
- ఎప్పుడో చేసే పాదయాత్రకు ఇప్పటి నుంచే ప్రచారమా?.. వైఎస్ షర్మిల ధ్వజం



12

రాజ్ కసిరెడ్డికి గట్టి షాక్

- మద్యం స్కామ్‌లో బెయిల్ పిటిషన్ తిరస్కృతి
- ఆర్థిక నేరాల్లో నిందితుల పట్ల కఠిన వైఖరి అవసరం: హైకోర్టు
- స్కామ్‌లో కసిరెడ్డి పాత్రపై ప్రాథమిక ఆధారాలు
- ముడుపులిచ్చిన బ్రాండ్‌లకే సరఫరా ఆర్డర్లు
- షెల్ కంపెనీల నుంచి రూ.135 కోట్ల బదిలీ
- వీటన్నింటికీ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు
- బెయిలిస్తే దర్యాప్తునకు ఆటంకమని వ్యాఖ్య

జైలు నుంచి చెవిరెడ్డి విడుదల

- మద్యం స్కామ్‌లో కఠిన షరతులతో బెయిల్
- సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడికి కూడా..

లీకు వీరుడు



విజయనగరంలోని హోంగార్డు శ్రీనివాసరావు ఇంట్లో లభ్యమైన అక్రమాస్తుల పత్రాలు, బంగారం, వెండి వస్తువులు. చిత్రంలో శ్రీనివాసరావు

చేసేది హోంగార్డు ఉద్యోగం.. అక్రమాస్తులు 20 కోట్లు

- 15 ఏళ్లుగా ఏసీబీలో విధులు.. శాఖకు అందే 'అవినీతి' సమాచారమే ఆదాయ వనరు
- అవినీతి అధికారుల నుంచి భారీగా లబ్ధి.. దాడుల్లో భారీగా అక్రమాస్తులు వెలుగులోకి

విజయనగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో హోంగార్డు ఉద్యోగం.. నెలకు రూ.24వేలకు మించని జీతం.. కీలకమైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో విధులు.. అయితే అక్కడ అవినీతికి వ్యతిరేకంగా పనిచేయాల్సిన ఆ చిరుద్యోగి అక్రమార్జనకు తెరతీశాడు. ఏసీబీ అధికారులకు అందే సమాచారాన్ని.. అక్రమార్కులకు ముందుగానే చేరవేసి వారివద్ద నుంచి భారీగా

మిగతా 11వ పేజీలో...

ఆఫీస్ సబార్డినేట్‌కు 50 కోట్ల ఆస్తులు!

- రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఇళ్లలో ఏసీబీ సోదాలు
- అక్రమాస్తుల కేసులో ఇప్పటికే సస్పెన్షన్

గోల్డ్ 'రష్'!

బంగారం, వెండి కొనుగోలుకు జనం పరుగు

ప్రొద్దుటూరులో గురువారం పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,85,500. అయితే... గురువారం ఈ ధరకు గోల్డ్ బిస్కెట్ దొరకలేదు. ధర మరింత పెరుగుతుందనే 'బలమైన నమ్మకం'తో గురువారం రాత్రి తులం బంగారం కోసం రూ.2 లక్షల నుంచి 2.10 లక్షలిచ్చి 'బుకింగ్' చేసుకున్నట్లు తెలిసింది.

జనవరి 1న 10 గ్రాముల బంగారం 1.37 లక్షలు. నెల తిరగక ముందే అది రూ.1.85 లక్షలకు చేరింది.

ప్రొద్దుటూరులో బంగారు నగల కొనుగోలు పడిపోయింది. సగటున జరిగే లావాదేవీల్లో ఇప్పుడు పదిశాతం కూడా జరగడంలేదని... అందరూ గోల్డ్ బిస్కెట్ కొనుగోలు వైపే మొగ్గు చూపుతున్నారని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బంగారు నగలు చేసే కార్మికులకు పనిలేకుండా పోయింది.

బంగారంతో పోల్చితే వెండి ధర పట్టపగ్గాల్లేకుండా పరుగులు తీస్తోంది. దీంతో... పుత్తడి కంటే వెండి కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు.

'ఇప్పటికి వచ్చిన లాభం చాలు' అని బంగారు, వెండి విక్రయించే వారూ ఉన్నారు. అయితే... కొత్తగా కొంటున్న వారితో పోల్చితే, అమ్మే వారి సంఖ్య చాలా తక్కువ.

హైదరాబాద్ బేగంబజార్, పంజాగుట్ట, సికింద్రాబాద్, అమీర్‌పేటలోని బంగారు దుకాణాలు ఇటీవల కిటకిటలాడుతున్నాయి. బేగంబజార్‌లోని ఓ దుకాణం ముందు ఉదయం 6 నుంచి జనం బారులు తీరుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



హైదరాబాద్ బేగంబజార్‌లోని ఓ బంగారు దుకాణం ముందు వేచి ఉన్న జనం

- ఏదోలా ఇప్పుడే కొని 'లాభపడదాం'!
- ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలు
- షాపుల ముందు క్యూ కట్టి మరీ కొనుగోళ్లు
- నగల కంటే బిస్కెట్లు, బార్ల కొనుగోలుకే మొగ్గు
- పాత బంగారం తాకట్టు పెట్టి మరీ 'పెట్టుబడులు'
- రియల్ ఎస్టేట్ కోసం దాచిన సొమ్మూ మళ్లింపు
- ప్రొద్దుటూరులో 'మార్కెట్' ధరకు మించి బుకింగ్

శ్రీవారి డాలర్లకు భలే డిమాండ్!

- రోజూ ధర మారుతున్న బంగారం, వెండి
- కొండపైన వారానికి ఒకసారే రేటు మార్పు

(ప్రొద్దుటూరు/హైదరాబాద్ సిటీ - ఆంధ్రజ్యోతి)

'ఇప్పటికే ఆలస్యం చేశాం! ఇప్పటికైనా కొనకపోతే నష్టపోతాం! మంచి తరుణం... మించిన దొరకదు! కొంత బంగారం, ఇంకొంత వెండీ కొనేద్దాం!'.... ఇదీ ఇప్పుడు మార్కెట్ ట్రెండ్! సామాన్య, మధ్య తరగతిని పక్కనపెడితే... ఎప్పటికప్పుడు 'పెట్టుబడి సాధనాల'పై కన్నేసి ఉంచే వారంతా బంగారం

మిగతా 2వ పేజీలో...

బెంగళూరు-విజయవాడ కారిడార్ 2027కల్లా పూర్తికావాలి

- ఖరగ్‌పూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు త్వరగా డీపీఆర్: సీఎం
- 2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల విలువైన జాతీయ హైవేల పనులు పూర్తే లక్ష్యం
- పోర్టులను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం
- ప్రస్తుతం పురోగతిలో ఉన్న రూ.42,194 కోట్ల రోడ్ల పనులు వేగంగా పూర్తవ్వాలి
- రహదారుల పూర్తిలో మన రాష్ట్రమే బెంచ్ మార్క్‌గా ఉండాలి.. సమీక్షలో చంద్రబాబు



జాతీయ రహదారులపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి జనార్దన్ రెడ్డి, అధికారులు

అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు 2027కల్లా పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఖరగ్‌పూర్- అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు కూడా త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయితే ప్రజలకు తక్షణం ప్రయోజనం

మిగతా 11వ పేజీలో...




2

మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా?

- యూజీసీ కొత్త నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయి
- మేం కల్పించుకోకపోతే తీవ్ర పరిణామాలు వస్తాయ్
- నూతన విధివిధానాల్లో భాష సరిగా లేదు: సుప్రీం
- యూజీసీ కొత్త నిబంధనలపై స్టే ఇచ్చిన ధర్మాసనం

కృత్రిమ మేధలో.. తెలుగు యోధ

- దిగ్గజ ఏఐ సంస్థలు ఉపయోగిస్తున్న 'పైటార్చ్'
- అభివృద్ధిలో సౌమిత్ చింతల కీలక పాత్ర
- ఏఐలో రిసెర్చ్‌తో మెటాలో ఉపాధ్యక్షుడి స్థాయికి..
- ఇప్పుడు సంస్థ నుంచి బయటకు
- మెషీన్ థింకింగ్ ల్యాబ్స్ స్టార్టప్ సంస్థలో ప్రధాన సాంకేతిక అధికారిగా కొత్త ప్రస్థానం



అద్భుతం జరిగేటప్పుడు ఎవరూ గుర్తించరు! జరిగిపోయాక గుర్తించాల్సిన అవసరం లేదు.. అని ఒక సినిమా డైలాగ్ ఉంది! అలాంటి అద్భుతం ఒకటి అమెరికాలో జరిగింది. ఆ అద్భుతం వెనుక ఉన్న వ్యక్తి పేరు.. సౌమిత్ చింతల (37)! ఐటీ రంగంలో మన తెలుగువాళ్లు చాలా మంది.. పెద్ద పెద్ద కంపెనీల్లో సీఈవోలుగా, సీటీవోలుగా.. ఇలా కీలకస్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే! కానీ.. ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న కృత్రిమ మేధ రంగంలో సత్తా చాటుతున్న తెలుగు తేజం.. సౌమిత్ చింతల. కంప్యూటర్‌లో ఏదైనా డాక్యుమెంట్ తయారుచేయడానికి 'మైక్రోసాఫ్ట్ వర్డ్' ఎంత కీలకమో.. డిజైనర్లకు ఫొటోషాప్ ఎంత ముఖ్యమో.. అలా కృత్రిమమేధ అభివృద్ధికి 'మెషీన్ లెర్నింగ్' అంత ముఖ్యం. ఆ మెషీన్‌లెర్నింగ్‌కు సంబంధించి అత్యంతకీలకమైన టూల్.. 'పైటార్చ్'. దాన్ని అభివృద్ధి చేసిన బృందానికి నేతృత్వం వహించిన వ్యక్తి సౌమిత్ చింతల! 'మెటా'లో దాదాపు 11 సంవత్సరాలపాటు పలు స్థాయుల్లో పనిచేసి.. ఆ సంస్థ ఏఐ రిసెర్చ్‌లో కీలకంగా వ్యవహరించిన సౌమిత్ గత ఏడాది నవంబరులో హఠాత్తుగా 'థింకింగ్ మెషీన్స్ ల్యాబ్' అనే స్టార్టప్‌లో చేరినప్పుడు యూఎస్‌లోని దిగ్గజ కంపెనీలు సైతం ఒక్కసారి ఆసక్తిగా ఈ పరిణామాన్ని గమనించాయి!

ఆ కథేంటంటే..

ఏఐ అనగానే మనందరికీ గుర్తొచ్చే పేరు.. చాట్‌జీపీటీ. దాన్ని అభివృద్ధి చేసిన సంస్థ 'ఓపెన్ ఏఐ'. ఆ సంస్థ నుంచి బయటకు వచ్చిన నలుగురు కీలక వ్యక్తులు దానికి పోటీగా కొన్నాళ్ల క్రితం 'థింకింగ్ మెషీన్స్ ల్యాబ్' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు. కానీ.. కొద్దికాలంలోనే ఆ నలుగురిలోంచి ఇద్దరు (సీనియర్ ఏఐ సైంటిస్ట్ ల్యూక్‌మెట్జ్, రిసెర్చ్ సైంటిస్ట్ శాం షోన్‌హోల్జ్) మళ్లీ ఓపెన్‌ఏఐకి వెళ్లిపోయారు. వారి తర్వాత.. సంస్థకు ఆయువుపట్టులాంటి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ బారెట్ జోఫ్ కూడా ఓపెన్ ఏఐకి వెళ్లిపోయారు. ఆ సమయంలో.. బారెట్ జోఫ్ స్థానంలో సీటీవో బాధ్యతలను అత్యంత సమర్థంగా నిర్వహించగలిగే సత్తా ఉన్న ఏకైక వ్యక్తి మన సౌమితేనని ఆమె భావించి, ఆయనను ఆ పోస్టులో నియమించారు. నిజానికి 'ఓపెన్ ఏఐ'కి పోటీగా మిరా మురాటీ థింకింగ్ మెషీన్స్ ల్యాబ్‌ను ప్రారంభించాక.. దాని అభివృద్ధి చూసి, ఆ స్టార్టప్‌ను బిలియన్ డాలర్లపెట్టి కొనేయాలని మెటా చీఫ్ మార్క్ జుకెర్‌బర్గ్ విశ్వప్రయత్నం చేశారు. ఆ సంస్థ నుంచి ఉద్యోగులను తన సంస్థలోకి లాగేసే ప్రయత్నాలూ చేశారు. అవేవీ ఫలించలేదు. కానీ.. మిరా మురాటీ మెటాలో కృత్రిమ మేధకు అభివృద్ధికి సంబంధించి కీలకస్థానంలో ఉన్న సౌమిత్ చింతలనే తన కంపెనీలోకి తెచ్చుకోగలిగారు.

లెక్కల్లో వీక్.. కానీ..

అమెరికాలోని టెక్ సర్కిల్స్‌లో కీలకవ్యక్తిగా మారిన సౌమిత్ చింతల.. పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. చదువుకున్నది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో. చిన్నప్పటి నుంచీ లెక్కలంటే ఆయనకు చాలా భయం. ఇక్కడ స్కూలింగ్ పూర్తయ్యాక.. వెల్లూరు(తమిళనాడు)లోని వీఐటీలో బీటెక్ చేశారు. అనంతరం ఆయన అమెరికాలో మాస్టర్స్ చేయాలని భావించి 12 యూనివర్సిటీలకు దరఖాస్తు చేశారు. జీఆర్ఈలో మంచి స్కోరే వచ్చినా.. సౌమిత్‌కు ఆ 12 యూనివర్సిటీల్లో ఒక్కదాంట్లో కూడా ప్రవేశం దొరకలేదు. అయినా సౌమిత్ పట్టువదలకుండా ప్రయత్నించి జే-1 వీసాపై కార్నెగీమెలన్ యూనివర్సిటీలో చేరారు. అక్కడికి వెళ్లాక మరోసారి 15 యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేస్తే.. యూనివర్సిటీ ఆఫ్ సౌత్‌కాలిఫోర్నియాలో, న్యూయార్క్ యూనివర్సిటీలో అడ్మిషన్లు దొరికాయి. చివరికి 2010లో న్యూయార్క్ వర్సిటీలో చేరారు. మాస్టర్స్ పూర్తిచేశాక కూడా సౌమిత్ ప్రస్థానం అంత సులువుగా ఏమీ సాగలేదు. ఉద్యోగం కోసం చేసిన ప్రతి దరఖాస్తూ బుట్టదాఖలైంది. గూగుల్ డీప్‌మైండ్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేస్తే.. మూడుసార్లు తిరస్కారానికి గురైంది. ఈ క్రమంలోనే ఆయన.. 2011-2012 నడుమ మొబైల్ పరికరాల కోసం.. అత్యంత వేగంగా పనిచేసే ఏఐ ఇన్‌ఫరెన్స్ ఇంజన్స్‌ను సౌమిత్ అభివృద్ధి చేశారు. అంటే.. అప్పటికే అందుబాటులో ఉన్న ఏఐ టెక్నాలజీని (ట్రెయిన్డ్ మోడల్‌ని) మొబైల్‌ఫోన్ స్థాయి పరికరాల్లో పనిచేసేలా చేయగలిగారు. అది అప్పటి మెటా చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్‌లెకున్ (ఈయన కూడా ఇటీవలే మెటా నుంచి బయటికి వచ్చేశారు) దృష్టిని ఆకర్షించింది. ఆయన ద్వారా 2014 ఫేస్‌బుక్‌లో చేరి ఏఐ రిసెర్చ్ చేరిన సౌమిత్.. అక్కడ నెగ్గుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. అక్కడి సీనియర్ ఇంజనీర్లు కూడా పరిష్కరించలేకపోయిన అత్యంత క్లిష్టమైన సమస్యను పరిష్కరించడం ద్వారా ఆయన అక్కడ తన సత్తా గట్టిగా చాటారు. వెంటనే ఫేస్‌బుక్ ఆయన్ను ముగ్గురు సభ్యుల టీమ్‌కు లీడర్‌ని చేసింది. అప్పటికి ఫేస్‌బుక్ సంస్థ టార్చ్7 అనే మెషీన్ లాంగ్వేజ్ ఫ్రేమ్‌వర్క్‌పై పనిచేస్తోంది. ఆ టూల్‌ని 'లువా' అనే ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌తో రూపొందించారు. కానీ, సౌమిత్ తన టీమ్‌లోని మిగతా ముగ్గురితో కలిసి.. పైథాన్ (ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్)లో దాన్ని మెరుగుపరిచి 'పైటార్చ్' (పైథాన్+టార్చ్)ను సృష్టించారు. 2016లో అది అందరికీ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ,గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు సైతం చేస్తున్న అత్యంత అధునాతన ఏఐ పరిశోధనలకు అది వెన్నెముక. మెటా వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలో ఉండి ఇన్ని అద్భుతాలు సాధించి, ఆ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ స్థాయికి చేరిన సౌమిత్.. థింకింగ్ మెషీన్స్‌ల్యాబ్ వంటి స్టార్టప్‌లో చేరడమేంటని చాలా మంది అనుకోవచ్చు! దీనికి సౌమిత్ ఏమంటారో తెలుసా?.. "ఏఐ పరిశ్రమలో అత్యంత ప్రభావవంతమైన స్థానాన్ని సంపాదించడం సులభం కాదు. కానీ.. మెటాను వదిలి బయటకు వచ్చి మరే ప్రయత్నమూ చేయలేదన్న పశ్చాత్తాపంతో జీవించకూడదు. అందుకే మెటాను వదిలిపెడుతున్నా" అని సౌమిత్ పేర్కొన్నారు! ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొనే ఆ మనస్తత్వమే ఆయన్ను ఆ స్థానానికి చేర్చిందంటే అతిశయోక్తి కాదు!!




అజిత్ పవార్ చితి వద్ద కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోకేశ్ నివాళి

అజిత్ పవార్ అంత్యక్రియలు పూర్తి

బారామతి, జనవరి 29: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. "అజిత్ దాదా.. అమర్ రహే" అంటూ అభిమానులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు వేలాది మంది ఎన్సీపీ కార్యకర్తలు అజిత్ పవార్ అంత్యక్రియలకు తరలివచ్చారు. గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ కాలేజీ మైదానంలో అధికారిక లాంఛనాలతో అజిత్ పవార్ అంత్యక్రియలను నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

అజిత్ పవార్ అంత్యక్రియలకు హాజరైన లోకేశ్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అజిత్ పవార్ భౌతికకాయానికి మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. అజిత్ పవార్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గురువారం లోకేశ్ బారామతి వెళ్లారు. ఆయన వెంట రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

పని మనుషులకు చట్టబద్ధత కల్పించలేం: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 29: పని మనుషులకు కనీస భత్యం కల్పించేలా సమగ్ర చట్టం తీసుకు రావాలంటూ దాఖలైన పిల్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీనికోసం ప్రస్తుతం ఉన్న చట్టంలో మార్పులు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించలేమని స్పష్టం చేసింది. లక్షల్లో ఉన్న పని మనుషుల దుస్థితిని సుప్రీంకోర్టు గుర్తించింది. అయితే, వారికి చట్టబద్ధత కల్పించేలా శాసన వ్యవహారాల్లో జోక్యం కలగజేసుకోలేమని స్పష్టం చేసింది.

గోల్డ్ 'రష్'!

(మొదటి పేజీ తరువాయి)

వెంటపడుతున్నారు. ఎంతగా అంటే... దుకాణాల ముందు క్యూల్లో నిలబడి, రెండుమూడు గంటలు వెయిట్ చేసేంత! ఇంట్లో అప్పటికే ఉన్న పాతబంగారాన్ని బ్యాంకులో కుదువ పెట్టి, ఆ డబ్బుతో కొత్తగా బంగారం కొనేంత! బులియన్ మార్కెట్‌లో 'సెకండ్ బాంబే'గా పేరుపొందిన కడప జిల్లా ప్రొద్దుటూరులో, హైదరాబాద్‌లో, మరిన్ని నగరాల్లో ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తోంది.

మిస్స్ కావొద్దని...: రెండు మూడు నెలలుగా బంగారు, వెండి ధరలు పరుగులు తీస్తున్నాయి. 'ఇంతకంటే పెరగదు' అనుకున్న ప్రతి రోజూ మరింత పైకి ఎగబాకుతున్నాయి. దీంతో... 'అప్పుడే కొని ఉంటే బాగుండేది' అని అనుకునేవాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత పది రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర రూ.32 వేలకుపైగా పెరిగింది. కిలో వెండి ధర రూ.96వేలకుపైగా పెరిగింది. తులం బంగారం రూ.2.50 లక్షలు, కిలో వెండి రూ.5 లక్షలు దాటుతుందనే ఊహాగానాలు కొనసాగుతున్నాయి. దీంతో... ఈ ట్రెండ్‌ను ఇప్పుడైనా 'క్యాష్' చేసుకుందాం అనే 'గోల్డ్ రష్' విపరీతంగా పెరిగింది. చేతిలో డబ్బు లేకుంటే ఇంట్లో ఉన్న నగలను బ్యాంకుల్లో తనఖా పెట్టి వచ్చిన డబ్బుతో బంగారం, వెండి కొనేస్తున్నారు. మూడు వారాలుగా బ్యాంకుల్లో గోల్డ్ లోన్స్ సంఖ్య పెరిగాయని ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి ఒకరు చెప్పారు. ప్రొద్దుటూరులో గురువారం పలు బ్యాంకు శాఖలు భారీ స్థాయిలో 'గోల్డ్ లోన్'లు మంజూరు చేశాయి. గతంలో రియల్ రంగంలో పెట్టుబడి పెట్టేవారు ప్రస్తుతం బంగారం, వెండివైపు మారిపోయారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రియల్ ఎస్టేట్‌లో స్తబ్ధత నెలకొంది. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి కోసం దాచుకున్న నగదునూ బంగారు, వెండి కొనుగోలుకు వాడే వారి సంఖ్య పెరిగింది.

శ్రీవారి డాలర్ల కోసం ఒత్తిళ్లు!

- రోజూ ధర మారుతున్న బంగారం, వెండి
- కొండపైన వారానికి ఒకసారే రేటు మార్పు

తిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బంగారు, వెండి డాలర్ల విక్రయాల్లో టీటీడీకి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. బయటి మార్కెట్‌లో ఏరోజుకారోజు బంగారం ధరలు పెరిగిపోతుంటే తిరుమలలో వారానికి ఒక్కసారే ధర మార్పు నిర్ణయం అమలు చేస్తున్నారు. దీంతో టీటీడీ నష్టపోవడంతో పాటు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. టీటీడీ కొన్నేళ్లుగా 10, 5, 2 గ్రాముల బంగారు, 50, 10, 5 గ్రాముల వెండి డాలర్లను విక్రయిస్తోంది. స్వామి, అమ్మవార్ల చిత్రాలు ఉండే ఈ డాలర్లను శ్రీవారి సన్నిధిలో కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ప్రతినెలా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ విక్రయాలు జరుగుతుంటాయి. ప్రతి మంగళవారం అర్ధరాత్రి నుంచి అప్పటి మార్కెట్ ధరల ప్రకారం వారం రోజుల పాటు డాలర్లను టీటీడీ విక్రయాలకు ఉంచుతుంది. గతంలో బంగారం, వెండి ధరలు ఎప్పుడో ఒకసారి పెరిగేవి కాబట్టి పెద్దగా ఇబ్బంది ఉండేది కావు. అయితే ప్రస్తుతం వీటి ధరలు నిత్యం పెరుగుతున్నాయి. కొండపైన వారానికోసారి మాత్రమే ధరల్లో మార్పులు తీసుకొస్తున్న క్రమంలో బయటి మార్కెట్‌కు, టీటీడీకి వ్యత్యాసం కనిపిస్తోంది. గత మంగళవారం టీటీడీ నిర్ధారించిన ధరను పరిశీలిస్తే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1.55,855 కాగా, బయటి మార్కెట్‌లో 1,58,000 ఉంది. అంటే టీటీడీ రూ.2,145 తక్కువకు విక్రయిస్తోంది. బయటి మార్కెట్ ధరలు ఇంకా పెరిగినప్పటికీ టీటీడీ నిర్ణయించిన ధర మాత్రం ఫిబ్రవరి 3 వరకూ కొనసాగనుంది. దీంతో దేవస్థానానికి నష్టం వాటిల్లుతోంది. సాధారణంగా ఒక భక్తుడికి ఒకటి, రెండు డాలర్లు మాత్రమే విక్రయిస్తున్నారు. అయితే ఇటీవల బయటి మార్కెట్‌లో పెరుగుతున్న ధరల నేపథ్యంలో తమకు 5 నుంచి 10 డాలర్లు కావాలని తిరుమలలో ఉన్న డాలర్ల విక్రయ కౌంటర్‌పై కొందరు ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కౌంటర్ వద్ద వీటిని కొనుగోలు చేసి సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా వారానికోసారి కాకుండా బులియన్ ప్రకారం ఏరోజుకారోజు ధరలు మార్చడంతో పాటు నిజమైన భక్తులకే డాలర్లు విక్రయించేలా టీటీడీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా?

యూజీసీ కొత్త నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయి.. మేం కల్పించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయ్

- నూతన విధివిధానాల్లో భాష సరిగా లేదు
- యూజీసీ కొత్త నిబంధనలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, జనవరి 29: యూజీసీ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకంటూ యూజీసీ తెచ్చిన నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. యూజీసీ విధివిధానాలు అస్పష్టంగా ఉన్నాయని, వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. కొత్త నిబంధనల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. "స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత దేశంలో కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం? ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటివారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండడం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్య భారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యా సంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ఈ విషయంలో మేం జోక్యం చేసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. సమాజాన్ని విభజిస్తుంది. కొత్త విధివిధానాల్లో భాషే అస్పష్టంగా ఉంది. నిపుణులు పరిశీలించి, దాన్ని సరిచేయాలి" అని పేర్కొంది.



యూజీసీ కొత్త విధివిధానాలకు వ్యతిరేకంగా లఖ్‌నవూలో నిరసన

ఇదీ విషయం..

ప్రతి ఉన్నత విద్యాసంస్థలోనూ 'సమానత్వ (ఈక్విటీ) కమిటీ'ల ఏర్పాటును యూజీసీ ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆదేశించింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 'ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహ నిబంధనలు-2012' స్థానంలో యూజీసీ కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. వీటిలో కులవివక్ష నిర్వచనాన్ని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుల ఆధారిత వివక్ష కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా మాత్రమే జరుగుతుందన్న భావన ఆధారంగా ఈ ఉత్తర్వులను యూజీసీ రూపొందించినట్లు ఉందని అందులో పేర్కొన్నారు. కులం ఆధారంగా జనరల్ లేదా నాన్ రిజర్వ్‌డ్ విభాగాల విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కులానికి తావివ్వని రీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో పిటిషనర్ కోరారు. తదుపరి నోటీసులు ఇచ్చే వరకు యూజీసీ నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ప్రపంచానికి భారత్ ఆశాకిరణం!

- ఈయూతో డీల్ ఉత్పత్తిదారులకు భలే చాన్సు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 29: భారతదేశం ప్రపంచానికి ఆశాకిరణంగా ఆవిర్భవించిందని ప్రధాని మోదీ అన్నారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ).. అన్ని ఒప్పందాలకూ తల్లి వంటిదని.. తమ సామర్థ్యాలు పెంచుకోవడానికి దేశానికి, ఉత్పత్తిదారులకు కూడా మంచి అవకాశం లభించిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంస్కరణల రథంపై దేశం పరుగులుపెడుతోంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం. ఇది పార్లమెంటు కార్యకలాపాల స్తంభనకు సమయం కాదు..పరిష్కారాలకు సమయం' అని చెప్పారు. బుధవారం ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 140 కోట్ల మంది వ్యక్తీకరించిన అభిప్రాయంగా అభివర్ణించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 9 బడ్జెట్లు ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే గర్వించదగిన విషయమని, ఈ ఘనత సాధించిన తొలి మహిళా ఆర్థిక మంత్రిగా పేరు సంపాదించారని ప్రధాని పేర్కొన్నారు. ఆమె తన 9వ బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టనున్నారు. మొరార్జీ దేశాయ్ 10 సార్లు, పి.చిదంబరం 9 సార్లు బడ్జెట్ పెట్టినా.. వరుసగా కాకుండా అప్పుడప్పుడూ ప్రవేశపెట్టారు. కాగా, బడ్జెట్ సమావేశాల ముంగిట మోదీ సందేశం.. ఎప్పటిలాగే కపటత్వంతో కూడుకుని ఉందని కాంగ్రెస్ ఆరోపించింది.



మేడారంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు

సల్లంగ చూసేందుకు సమ్మక్క వచ్చె!

- చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి చేరుకున్న వనదేవత

మేడారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తన భక్తుల మీద వరములు చిలకరించేందుకు చిలుకలగుట్ట నుంచి కదిలివచ్చింది సమ్మక్క తల్లి! తనను నమ్ముకున్న భక్తులను సల్లంగ చూసేందుకు చల్లని పున్నమి వెన్నెల కాంతుల నడుమ మేడారం గద్దెపై ఆసీనురాలైంది. ఈ అపూర్వ ఘట్టాన్ని వీక్షించిన భక్త జనులు ఆనందపారవశ్యంతో 'జై సమ్మక్క.. జైజై సమ్మక్క' అంటూ జయజయధ్వానాలు చేశారు. గురువారం మేడారంలో అత్యంత కీలక ఘట్టం పూర్తవ్వడంతో మహాజాతర పతాకస్థాయికి చేరింది. డోలూ సన్నాయి వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ సరిగ్గా రాత్రి 9:47 గంటలకు సమ్మక్క గద్దెపైకి చేరుకుంది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారమే గద్దెలపైకి చేరుకున్నారు. సమ్మక్క రాకతో నలుగురు దేవతలు ప్రభుత్వం ఆధునికీకరించిన గద్దెలపై కొలువుదీరడంతో జాతర పరిపూర్ణతను సంతరించుకుంది.

సాయం పేరుతో మంత్రి సత్యకుమార్‌కు బురిడీ

ధర్మవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మంత్రి సత్యకుమార్‌కు పత్రికా విలేకరి పేరిట బుధవారం ఓ వ్యక్తి ఫోన్ చేశారు. 'సర్... మీ నియోజకవర్గానికి చెందిన ఓ కుటుంబం పూరీ క్షేత్రానికి వచ్చింది. లగేజీ పోగొట్టుకుంది. తిరుగు ప్రయాణానికి డబ్బులు లేక రెండు రోజులుగా రైల్వే స్టేషన్‌లోనే ఉంటోంది' అని సమాచారం ఇచ్చారు. ధర్మవరం పట్టణంలోని శారదనగర్‌కు చెందిన లక్ష్మీదేవి కుటుంబం ఇబ్బంది పడుతోందంటూ ఓ ఫొటోను కూడా పంపించారు. దీంతో మంత్రి మానవత్వంతో స్పందించారు. పూరీలో ఉన్న తన మిత్రులకు ఫోన్ చేసి, సాయం చేయాలని సూచించారు. మొత్తం ఆరుగురికి రైలు టికెట్లు, తాత్కాలిక వసతి, ఖర్చులకు కొంత డబ్బు ఇవ్వాలని సూచించారు. మంత్రి మాటతో అక్కడివారు స్పందించి సాయం చేశారు. అయితే, అది మోసమని తేలింది. ధర్మవరం పట్టణవాసులు ఎవరూ పూరీలో ఇబ్బంది పడలేదని తేలింది.

చెక్కుచెదరని మోదీ బ్రాండ్

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీదే అధికారం
- ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరింత బలపడిందని ఇండియా టుడే, సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్-2026 జనవరి'(ఎంవోటీఎన్) సర్వే తేల్చింది. ప్రధాని మోదీపై దేశ ప్రజలకు ఉన్న నమ్మకం ఏమాత్రం సడలలేదని పేర్కొంది. దేశవ్యాప్తంగా గత 8 వారాల్లో 1.25 లక్షల మందిని సర్వే చేసి అంచనా వేసిన ఈ సర్వే ఫలితాలను గురువారం విడుదల చేశారు. లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే అధికార ఎన్డీయే కూటమికి 352 ఎంపీ సీట్లు వస్తాయని సర్వే తేల్చింది. 2024లో ఈ కూటమి మెజారిటీకి అవసరమైన 272 సీట్లనూ సాధించలేకపోయింది. ఆ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు ఆ పార్టీ సొంతంగా 287 సీట్లు గెలిచి మళ్లీ సంపూర్ణ మెజారిటీ సాధిస్తుందని సర్వే తేల్చింది. ప్రతిపక్ష ఇండియా కూటమి 182 సీట్లకే పరిమితం అవుతుందని పేర్కొంది.

ఏఐతో ఉద్యోగాలకు పెను ముప్పు!

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. అయితే, బడాబడా కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయ వైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.65 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయని, అందులో ఈ ఏడాది ప్రవాసులు పంపిన డబ్బులే రూ.12 లక్షల కోట్లు ఉంటాయని తెలిపింది. దేశంలో ఊబకాయం అతిపెద్ద ఆరోగ్య సమస్యగా అవతరించిందని ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం, కదలకుండా కూర్చోవడం కలగలిసి చిన్న పెద్దా పల్లె పట్నం తేడా లేకుండా అందర్నీ మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు బారిన పడేట్లు చేస్తున్నాయని గణాంకాలతో ప్రస్తావించింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం పదిహేనేళ్లలో 40 రెట్లు పెరిగిందని, ఊబకాయం రెండింతలు అయిందని వెల్లడించింది. పిల్లలు మెలకువగా ఉన్న సమయంలో టీవీల్లో ఫుడ్ యాడ్‌లు రాకుండా చూడాలని, నూనె, ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడే ఆహారంపై సిగరెట్ల లాగా చట్టబద్ధమైన హెచ్చరికలు పెట్టాలని సలహా ఇచ్చింది. డిజిటల్ అడిక్షన్ జాతీయ ఆరోగ్య సమస్యగా పరిణమించిందని, ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సోషల్ మీడియా స్క్రోల్ చేయడం వల్ల యువత సామాజిక బంధాలను పూర్తిగా కోల్పోవడమే కాకుండా తెలివితేటలు కూడా దెబ్బతింటున్నాయని తెలిపింది. జీడీపీలో 12% డిజిటల్ ఎకానమీ నుంచే వస్తున్న నేపథ్యంలో రెండింటినీ సమన్వయం చేయాలని సూచించింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. యూత్ హబ్‌లు ఏర్పాటు చేసి యువత కలుసుకొనే వేదికలు కల్పించాలని చెప్పింది. 1.2 కోట్ల గిగ్ వర్కర్లలో 40 శాతం మందికి నెలకు రూ.15 వేలు కూడా రావడం లేదని సర్వే ప్రస్తావించింది. గంటకు లేదా టాస్క్‌ను బట్టి ఇంత కనీస వేతనం ఉండేట్లు నిబంధనలు పెట్టాలని సూచించింది.

రహస్య ఫైళ్లను చాట్ జీపీటీలో అప్‌లోడ్ చేసిన ట్రంప్ 'సైబర్ చీఫ్'

న్యూఢిల్లీ, జనవరి 29: అమెరికా ప్రభుత్వ సైబర్ నెట్‌వర్క్‌ని, రహస్యాలని నిరంతరాయంగా కాపాడే సంస్థ... సీఐఎస్ఏకు చెందిన ఫైళ్లు చాట్ జీపీటీలో అప్‌లోడ్ అయ్యాయి. సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ ఏజెన్సీ' (సీఐఎస్ఏ)కి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులై, ప్రస్తుతం తాత్కాలిక డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు గొట్టుముక్కల స్వయంగా ఆ ఫైళ్లను అప్‌లోడ్ చేయడం సంచలనంగా మారింది. ఆయన గత ఏడాది మేలో కార్యాలయంలో అత్యున్నత అధికారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సంస్థకు చెందిన చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ నుంచి చాట్ జీపీటీ వాడకానికి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. ఆ సమయంలో ఆ సంస్థలో పనిచేస్తున్న మిగిలిన ఉద్యోగులు ఎవరికీ చాట్ జీపీటీ వాడకానికి అనుమతి లేదు. చాట్ జీపీటీ వాడకానికి అనుమతి తీసుకున్న మధు దానిని దుర్వినియోగం చేశారు. 'ఫర్ ఆఫీస్ యూజ్ ఓన్లీ' అని నోట్ ఉన్న ఫైళ్లను మధు అప్‌లోడ్ చేయగానే ఆటోమేటెడ్ రక్షణ వ్యవస్థలు స్పందించాయి. ఆ ఫైళ్లలో సీఐఎస్ఏకి చెందిన కాంట్రాక్టు ఫైళ్లు కూడా ఉన్నాయి. ఆ ఫైళ్లలోని సమాచారం ఏదీ బహిర్గతం చేసేది కాదని డీహెచ్ఎస్ అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మధు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకున్నారు. తరువాత అమెరికాలో వివిధ యూనివర్శిటీల్లో కంప్యూటర్ సైన్స్‌లో ఎంఎస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారు.



మధు గొట్టుముక్కల

అయ్యా... మా ఏఈ మా మాట వినడం లేదు

- జిల్లా జడ్జికి ఆర్‌అండ్‌బీ అధికారుల మొర

చోడవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'అయ్యా... మా ఏఈ మా మాట వినడం లేదు. పనుల గురించి కనీసం పట్టించుకోవడం లేదు' అంటూ అనకాపల్లి జిల్లా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు తమ పర్యవేక్షణలో పనిచేసే ఓ అసిస్టెంట్ ఇంజనీర్‌పై జిల్లా జడ్జికి మొరపెట్టుకున్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల కోసం నిర్మిస్తున్న టాయిలెట్ల నిర్మాణాన్ని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, న్యాయవాదులు ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళలకు, పురుషులకు పక్కపక్కనే టాయిలెట్లు నిర్మించడం గమనించిన జడ్జి అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని మార్పు చేయాలని ఆదేశించారు. అలాగే టాయిలెట్ల చుట్టూ గోడ నిర్మించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు, ఎస్ఈ జాన్‌సుధాకర్‌లు... ఏఈ తమను ఖాతరు చేయడం లేదని, పనులను పర్యవేక్షించడం లేదని జడ్జి దృష్టికి తెచ్చారు. మీరు ఫిర్యాదు ఇస్తే అతనిపై చర్యలు తీసుకుంటామని జిల్లా జడ్జికి విజ్ఞప్తి చేశారు.

లోకం తీరు

2025 నాటికి దేశంలో 95 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు-సర్వే



టీటీడీపై దుష్ప్రచారం చేసిన వారిపై
పీడీ చట్టం అమలు చేయాలి

» జాతీయ హిందూ ధార్మిక సదస్సులో స్వామీజీల డిమాండ్

తిరుపతి (కల్చరల్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమలపై, టీటీడీపై కావాలనే దుష్ప్రచారాలు, అపోహలు సృష్టించే వారిపై తక్షణమే పీడీ యాక్ట్ అమలు చేయాలని పలువురు స్వామీజీలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీటీడీపై జరుగుతున్న దుష్ప్రచారాలను, అపోహలను నమ్మవద్దని కోరుతూ పలువురు స్వామీజీలు, భక్తులు తిరుపతిలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ హిం దూ ధార్మిక సదస్సులో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీలు మాట్లాడుతూ... ఇటీవల కొందరు కావాలనే టీటీడీపై సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తూ అపోహలు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.


తిరుపతిలో నిరసన తెలుపుతున్న స్వామీజీలు


జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ప్రసంగిస్తున్న విజూ కృష్ణన్

భూసేకరణలో
ఇతర రాష్ట్రాల విధానాలను పాటించాలి

» ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

» గుంటూరులో అఖిల భారత కిసాన్ సభలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఔటర్ భూసేకరణలో ఇతర రాష్ట్రాలు పాటిస్తున్న విధానాలనే ఏపీలోనూ అవలంబించాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ సూచించారు. గుంటూరులో జరుగుతున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ ప్రారంభ సమావేశంలో వికసిత్ భారత్-2047 అనే అంశంపై ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాగు భూముల్లో భారీస్థాయిలో రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. పైగా నామమాత్రపు పరిహారం ఇస్తే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్‌తో ప్రధాని మోదీ తప్ప ఏ ఒక్క భారతీయుడు లబ్ధి పొందలేదని ఎద్దేవా చేశారు.

కువైత్‌లో భారతీయులదే హవా..!

» దేశ జనాభాలో 20 శాతం మనోళ్లే.. వారిలోనూ సీమ వాసులు అధికం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మెరుగైన ఉపాధి అవకాశాలు, అధిక వేతనాలు, ఉత్తమ జీవన ప్రమాణాల కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు చెందినవారు కువైత్‌కు వెళ్తుంటారు. అయితే కువైత్‌లో పనిచేస్తున్న విదేశీయులందరిలోనూ భారతీయులే ఎక్కువ మంది ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం 2025లో కువైత్‌లో 10.59 లక్షల మంది భారతీయులు ఉన్నారు. అంటే దేశ జనాభాలో 20శాతం ఉన్నట్లు తాజా అధికారిక జనాభా గణాంకాలు వెల్లడించాయి. భారతీయుల్లో అత్యధికులు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంత వాసులే ఉన్నారు. వారిలోనూ ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల నుంచి వచ్చిన వారు ఎక్కువగా ఉన్నారు. కాగా.. కువైత్‌లో స్థానికుల జనాభా బాగా తగ్గినట్టు అధికారిక గణాంకాల్లో స్పష్టమైంది. గతంలో కువైతీల జనాభా 16.80 లక్షలుగా ఉండేది. తాజాగా అది 15.63 లక్షలకు పడిపోయింది. ప్రస్తుత కువైత్ జనాభాలో స్థానిక పౌరులు 29.85 శాతమేనని ఈ గణాంకాలు వెల్లడించాయి. కాగా, కువైత్‌లోని భారతీయుల్లో అత్యధికంగా 8.23 లక్షల మంది స్థానికుల ఇళ్లల్లో పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రైవేట్ మహిళా పారిశ్రామిక పార్కు

అమరావతి: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రైవేట్ మహిళా పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తోంది. 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కు అభివృద్ధి చేసేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫిక్కీ-ఫ్లో) ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ)తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

గుట్కా మాఫియా..
చీకటి దందా

» పన్నులు ఎగవేస్తూ బ్లాకులో విక్రయం

» పాన్ మసాలాల పేరిట దోపిడీ

» బిల్లులో బ్యాగ్ ధర 10 వేలు.. మార్కెట్లో 25 వేలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గుట్కా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాపారులు పాన్ మసాలా మాటున రకరకాల పేర్లతో అధికధరలకు గుట్టుగా గుట్కా విక్రయిస్తూ సామాన్యుల్ని దోచుకోవడంతో పాటు వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మరోవైపు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల పన్నులు ఎగవేసి మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగుతున్న గుట్కా అక్రమ వ్యాపార నెట్‌వర్క్ వ్యవస్థలకే సవాల్ విసురుతోంది. రూపాయి నుంచి రెండు రూపాయల మధ్యలో ధర ఉన్న ఒక్కో పాన్ మసాలా ప్యాకెట్లను 10 నుంచి 20 రూపాయలకు విక్రయిస్తున్నారు. వాటికితోడు సిగరెట్ల ధరలు ఫిబ్రవరి నుంచి భారీగా పెరుగుతాయంటూ సిగరెట్ వ్యాపారులు బ్లాకులో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ బహిరంగ దోపిడీపై పోలీసులు, విజిలెన్స్, జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందనా లేదని వాపోతున్నారు. ఉత్తరాదితో పాటు మన పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి గుట్కా, పాన్ మసాలా వస్తోంది. డీలర్లు రూ.25 వేలకు ఉత్పత్తిదారు నుంచి కొనే పాన్ మసాలా బ్యాగు అసలు బిల్లులో మాత్రం రూ.10 వేలు ఉంటుంది. ఉత్పత్తిదారులు పన్నుల ఎగవేత కోసమే బిల్లులో అసలు ధర చూపించడంలేదు. బిల్లులో చూపించినంత వరకూ ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరిపి అదనపు డబ్బులు ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో నగదు రూపంలో తీసుకొంటున్నారు. ఇందుకు హవాలా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయల నల్ల డబ్బు దేశం దాటిస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి వచ్చే పాన్ మసాలా బ్యాగును రూ.23 వేల నుంచి 27 వేల మధ్య ఏపీలో డీలర్లు విక్రయిస్తున్నారు. ఉత్పత్తిదారు చూపించే ధర రూ.11వేలకు అటూ ఇటుగా ఉంటోంది. వంద బ్యాగులు తీసుకొచ్చే వాహన డ్రైవర్ వద్ద రూ.11 లక్షలకు బిల్లు, జీఎస్టీ, సెస్ ఉంటోంది. ఒకే బిల్లుతో నాలుగైదు సార్లు అదే వాహనాన్ని తిప్పుతున్నారు. బిల్లు వేసిన 72 గంటల వరకూ చెల్లుబాటు అవుతుండటంతో టుంకూరు నుంచి చిత్తూరు, తిరుపతికి వచ్చి గోడౌన్లలో దించేసి, వెంటనే వెనక్కి వెళ్లి అదే బిల్లుతో మరో ట్రిప్పు తెస్తున్నారు. ఇలా ఏటా రూ.120 కోట్ల పన్నులు ఎగవేస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి వచ్చే గుట్కా, పాన్ మసాలాలకు చిత్తూరు, నెల్లూరు, అనంతపురం కేంద్రాలుగా ఉంటే.. భువనేశ్వర్ నుంచి వచ్చే వాటికి విశాఖపట్నం, గుంటూరులో గోడౌన్లు ఉన్నాయి. నెల్లూరులోని హరినాథపురం ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి వైసీపీ ప్రభుత్వంలో 'జై జగన్' అంటూ వాట్సాప్ డీపీ పెట్టుకుని దందా చేసి కోట్లకు పడగలెత్తాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని ఒక మంత్రి ఫొటో డీపీగా పెట్టుకుని కొనసాగిస్తున్నాడు. నెల్లూరు సమీప మనుబోలుకు చెందిన మరో వ్యాపారి టీ కొట్టు పెట్టుకుని జీవించే స్థాయి నుంచి 10 కోట్ల ఆస్తికి యజమాని అయ్యాడు. గుంటూరుకు చెందిన ఓ వ్యాపారి ఎన్నికలపుడు తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే 50 కోట్లు ఖర్చు చేస్తానని అడిగే స్థాయికి చేరుకున్నాడు. అనంతపురం జిల్లాలో ధర్మవరానికి చెందిన ఒక పాల వ్యాపారి రూ.వందల కోట్ల ఆస్తులు పోగు చేసి మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఫ్యాక్టరీ స్థాపించే స్థాయికి చేరాడు. గుట్కా నిషేధం ఉన్న సమయంలో కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించి ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు మాత్రమే ఇందులో జోక్యం చేసుకోవాలని, పోలీసుల జోక్యానికి తావులేదని ఆదేశాలు తెచ్చుకున్నారు. జీఎస్టీ అధికారులు వాహనాలను ఆపి తనిఖీ చేసినా.. గోడౌన్లను తనిఖీ చేసే అధికారం లేదని అంటున్నారు. అక్కడక్కడ విజిలెన్స్ అధికారులు సోదాలు చేస్తున్నా నెల మామూళ్ల చాటున తూతూ మంత్రంగా సాగిపోతున్నట్టు ఆరోపణలున్నాయి. పోలీసు, విజిలెన్స్, జీఎస్టీ ఉమ్మడిగా రాష్ట్రవ్యాప్తంగా సోదాలు చేపడితే అక్రమాలను కట్టడి చేయవచ్చని అంటున్నారు.

యాడికిలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

» వాహనంతో పోలీసులను ఢీకొట్టే యత్నం.. అదుపులో ఇద్దరు

» వాహనంపై గుంతకల్లు ఎమ్మెల్యే స్టిక్కర్

యాడికి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యాడికి మండలంలో గంజాయి, మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రి హల్‌చల్ చేశారు. నిందితులను గుత్తి పట్టణానికి చెందిన రౌడీషీటర్ అజయ్‌రాజ్, ఆదిత్య వర్మగా గుర్తించారు. వీరు వినియోగించిన వాహనంపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేరిట 'ఎమ్మెల్యే' స్టిక్కర్ అతికించి ఉండగా, దీన్ని పోలీసులు సీజ్ చేశారు. నిందితులిద్దరూ యాడికి మండలం కోనుప్పలపాడు సమీప అటవీప్రాంతానికి బుధవారం కారులో వచ్చారు. రాత్రి 8 గంటల వరకు గంజాయి, మద్యం తాగారు. స్థానికుల సమాచారం మేరకు కానిస్టేబుళ్లు శివరామిరెడ్డి, రాముడు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా.. పోలీసుల పైకి వాహనం నడిపి, తప్పించుకుని యాడికి వైపు వెళ్లారు. అక్కడ రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని నిలబెట్టి, వాహనదారులతో గొడవ పడుతూ కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. కాగా, గుత్తికి చెందిన అజయ్‌తో టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. గడువు ముగిసిన ఎమ్మెల్యే స్టిక్కర్‌ను జిరాక్స్ చేసుకొని వారు వాడుకుంటున్నారని తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అద్దేపల్లి బ్రదర్స్‌కు బెయిల్

మరో ప్రధాన నిందితుడు బాలాజీకి కూడా..

» నకిలీ మద్యం కేసులో బెజవాడ కోర్టు ఉత్తర్వులు

» మరో కేసులో 'బెయిల్' పెండింగ్‌తో ఆ ముగ్గురూ ప్రస్తుతానికి జైలులోనే..

విజయవాడ, ములకలచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు సోదరులు, బాలాజీలకు విజయవాడ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. విజయవాడలోని ఇబ్రహీంపట్నం, తంబళ్లపల్లెలోని ములకలచెరువులో కేంద్రాలను ఏర్పాటు చేసి అద్దేపల్లి బ్రదర్స్ నకిలీ మద్యాన్ని తయారు చేసిన విషయం తెలిసిందే. విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో నిందితులు దాఖలుచేసిన బెయిల్ పిటిషన్లపై వాద ప్రతివాదనలు ముగియడంతో కోర్టు గురువారం తీర్పును వెలువరించింది. అద్దేపల్లి బ్రదర్స్ రూ.50 వేలు చొప్పున, బాలాజీ రూ.25 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలంటూ షరతు విధించింది. కేసును ప్రభావితం చేసేలా సాక్షులు, ఇతర నిందితులను కలవరాదని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని స్పష్టం చేసింది. కాగా, మరో నిందితుడు తలారి రంగయ్య పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. కాగా, ములకలచెరువు కేసులో బెయిల్ పిటిషన్లు మదనపల్లె కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో.. బెయిల్ దొరికిన వారు సైతం జైలుకే పరిమితం కావాల్సి ఉంటుంది.

అంతా జనార్దన్‌రావే చేశాడు

» విచారణలో రాజేశ్, అన్బురసు వెల్లడి!

'అంతా జనార్దన్‌రావే చేశాడు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించేందుకు నకిలీ మద్యం తయారు చేసేందుకు పథకం పన్నారు. ఎవరు చెబితే చేశారో తెలియదు గానీ ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. మూడు నెలల పాటు నకిలీ మద్యం విక్రయించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని బెల్ట్‌షాపులకు రవాణా చేశారు. జనార్దన్‌రావు(ఏ1), ఆయన అనుచరుడు కట్టా రాజు(ఏ2) నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జిగా ఉంటూ లావాదేవీలన్నీ చూసుకున్నారు' అని ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కీలక నిందితులు రాజేశ్, అన్బురసు వెల్లడించినట్లు తెలిసింది. మదనపల్లె సబ్‌జైలులో ఉన్న వీరిద్దరిని గురు, శుక్రవారాల్లో కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి విచారించారు.

అమ్మ భాషతోనే అస్తిత్వం

మంత్రి సత్యకుమార్

డిసెంబరులో ఒంగోలులో ప్రపంచ బాలల తెలుగు మహాసభలు, లోగో ఆవిష్కరణ

ఒంగోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏ జాతి మనుగడ అయినా అమ్మ భాషతోనే సాధ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వంపైనే కాకుండా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించనున్న ప్రపంచ బాలల తెలుగు మహాసభల్లో భాగంగా గురువారం ఓ స్కూల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాసభల లోగోను ఆవిష్కరించారు. అనంతరం సత్యకుమార్ మాట్లాడుతూ.. తెలుగు భాష మాత్రమే కాదని అది మన సంస్కృతికి, వారసత్వానికి ప్రతీక అన్నారు. మన భాష గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసి, దాని ఆవశ్యకతను కొనసాగించేలా బాలల కోసం ప్రత్యేకంగా తెలుగు మహాసభలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇతర భాషల్లో పరిజ్ఞానం పెంచుకుంటూనే మాతృభాషపై మమకారాన్ని ఏర్పరుచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో వెలువరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు

రాజీకి అనుసరించిన విధానమేంటి?

» పరకామణి కేసులో వివరాలతో కౌంటర్ వేయండి... టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీ కేసు రాజీకి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీ ఈవోను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. కేసు రాజీకి అథారిటీ ఎవరు? రాజీకి అనుసరించిన విధానమేంటి? ఈ విషయంలో టీటీడీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? తదితర వివరాలను కౌంటర్‌లో పొందుపర్చాలని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌ను ప్రస్తుత అప్పీల్‌కు జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. పరకామణిలో చోరీకి సంబంధించిన నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులను, వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు ఆ ఆస్తులు వారి ఆదాయానికి తగినట్టే ఆర్జించారా అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించారు. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చాల్సింది ధర్మాసనమేనని, అందువల్ల ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు వీలుగా ఉత్తర్వుల ప్రతిని సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించిన విషయం తెలిసిందే. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితుడు రవికుమార్ వేసిన అప్పీల్‌తో పాటు లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధత తేల్చేందుకు నమోదైన సుమోటో వ్యాజ్యంపై సీజే ధర్మాసనం గురువారం విచారణ జరిపింది.

మార్చి 3న చంద్రగ్రహణం.. శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం కారణంగా మార్చి 3న ఉదయం 9 నుంచి సాయంత్రం 7.30 వరకు తిరుమల శ్రీవారి ఆలయం మూతపడనుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేస్తారు. ఆ రోజు ఆర్జిత సేవలనూ టీటీడీ రద్దు చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరాన్‌పై ట్రంప్ దూకుడు


ఇరాన్ పాలకులను అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. కనీవినీ ఎరుగనంతగా విరుచుకుపడతానని బెదిరిస్తున్నాడు. ట్రంప్ మాటమీద నమ్మకం లేకనో, తనమీద తనకు శ్రుతిమించిన నమ్మకంవల్లనో ఇరాన్ ఎప్పటిలాగానే మాటకుమాట బదులిస్తోంది. ఈ అదిలింపులూ బెదిరింపులకు జడిసేది లేదని, ట్రిగ్గర్ బిగించి సర్వసన్నద్ధంగా ఉన్నామని ట్రంప్‌ను తీసిపారేస్తోంది. ఇరాన్ సీనియర్ నాయకులు లక్ష్యంగా ఈ మారు దాడులు జరిగి, ఈ ముట్టడితో కచ్చితంగా ట్రంప్ ఆశిస్తున్న నాయకత్వం మార్పు సాధ్యపడుతుందని పాశ్చాత్య మీడియా సంస్థల నమ్మకం. ఒకదశలో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టుగా కనిపించిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం, తిరిగి తారస్థాయికి చేరడంతో ఇంతకుమించిన మంచిసమయం మళ్ళీ రాదని అమెరికా నమ్ముతోందట. సదరు అంతర్గత సంక్షోభాన్ని వాడుకొని అక్కడ అస్మదీయులను ప్రతిష్ఠించాలన్నది ట్రంప్ కోరిక.

గత ఏడాది ఇరాన్ అణుకేంద్రాలమీద తాము దాడులు చేసిన సంగతినీ, వందలాదిమందిని మట్టుబెట్టి రాత్రికి రాత్రి వెనెజువెలా అధ్యక్షుడిని తరలించిన ఇటీవలి దృశ్యాన్ని పదేపదే గుర్తుచేస్తూ, అంతకంటే ఘాటుగా, గట్టిగా దెబ్బకొడతాను జాగ్రత్త అని ఇరాన్ పాలకులను ట్రంప్ హెచ్చరిస్తున్నారు. దాడులకు పాల్పడేముందు చర్చలకు రమ్మని ఇరాన్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అణ్వస్త్రాలకు చోటులేని, సమన్యాయబద్ధమైన ఒప్పందం కుదరాలని అంటూనే, ఆ చర్చలు జరగాలంటే ఇరాన్ ముందుగా సంపూర్ణంగా అస్త్రసన్యాసం చేయాలట. యురేనియం శుద్ధిని పూర్తిగా నిలిపివేయడం, ఖండాంతర క్షిపణుల తయారీపై అమెరికా కొత్త నిబంధనలకు తలొగ్గడం, పశ్చిమాసియాలో ఇరాన్ అనుకూల గ్రూపులకు సహాయసహకారాలు పూర్తిగా నిలిపివేయడం ఈ ఆంక్షల్లో కొన్ని. గత ఏడాది జూన్‌లో జరిగిన కొద్దిరోజుల యుద్ధంలో ఇరాన్ వందలాది క్షిపణులను ఇజ్రాయెల్‌మీదకు ప్రయోగించిన సంగతి తెలిసిందే. వాటి వల్ల ప్రాణనష్టం పెద్దగా లేకున్నా, వాటిని నిలువరించి, నిరోధించి తనను తాను రక్షించుకొనే క్రమంలో ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని ఎక్కువగా నష్టపోయిందట. ఇజ్రాయెల్ దగ్గరున్న క్షిపణి నిరోధక వ్యవస్థల బలహీనతలు, వైఫల్యాలను కూడా ఆ దాడులు మిగతా ప్రపంచానికి ఎత్తిచూపాయి. ఈ నేపథ్యంలో, శత్రువుచేతుల్లో ఇజ్రాయెల్‌ను చేరగలిగే ఆయుధాలే లేకుండా చేయాలని ప్రయత్నం.

ఇరాన్ చుట్టూ భారీ యుద్ధనౌకలను మోహరించిన ట్రంప్ అతి వేగంగా లక్ష్యాన్ని సాధించాలని అనుకుంటున్నారనీ, దీర్ఘకాలం యుద్ధం కాక, ఓ పెద్ద దెబ్బతో శత్రువును కూల్చి నాయకత్వమార్పిడి కలను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నట్టు మీడియా విశ్లేషిస్తోంది. ఇరాన్‌తో వ్యవహారం ట్రంప్ మాటల్లోగా తేలిక కాదని అమెరికా సైనికాధిపతులకు తెలుసు. పాతకాలపు రష్యన్ ఆయుధాలను వాడే వెనెజువెలామీద క్షణాల్లో విజయం సాధించినట్టుగా ఇరాన్‌ను కూడా నిముషాల్లో నిర్వీర్యం చేయగలనని ట్రంప్ నమ్ముతున్నట్టుంది. ఇరాన్ స్వదేశీ, విదేశీ ఆయుధ సంపత్తి గురించి బయటకు తెలిసింది తక్కువేననీ, యుద్ధం మొదలైతే గానీ చైనా అందించిన అధునాతన ఆయుధాలు బయటపడవని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు.

తన అణుకార్యక్రమం శాంతియుతమైనదని ఇరాన్ అనడం, అణ్వాయుధాలు తయారుచేస్తోందంటూ అమెరికా పాతపాటే పాడటం అనాదిగా సాగుతోంది. 2015లో అమెరికా చొరవతో జరిగిన అణుఒప్పందం మిగతా ప్రపంచానికి యుద్ధ భయాన్ని పోగొట్టింది. ఆ తరువాత ఇరాన్ యురేనియం శుద్ధిస్థాయి హద్దులు దాటినట్టుగా ఆధారాలు కూడా లేవు. అయినా, మూడేళ్ళలోనే ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలిగి, ఇరాన్‌మీద మళ్ళీ ఆంక్షలతో పరిస్థితిని మొదటికి తెచ్చారు. ఆర్థికకష్టాల్లో మునిగిన ఇరాన్ కూడా పరిమితులను ఉల్లంఘించాల్సిన పరిస్థితి కల్పించారు. పశ్చిమాసియాకు యుద్ధవిమానాలు, నౌకలు తరలిస్తున్న ట్రంప్‌కు అనేక దేశాలు చెబుతున్న హితవు చెవికెక్కడం లేదు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం అన్నివేలమందిని ఊచకోతకోసిన ఇరాన్ పాలకులు అంతసులువుగా విదేశీశక్తులకు లొంగిపోతారనుకోవడం భ్రమ. తమకు అనుకూలంగా లేని పాలకులను అమెరికా గద్దె దించేసిన దేశాలన్నీ ఆ తరువాత యుద్ధాలు, అంతర్యుద్ధాలు, జాతులూ తెగల వైరాలతో కుప్పకూలి, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన గతం ట్రంప్‌కు తెలియందేమీ కాదు.

ఒకే ఒక్కడు.. 'మిస్టర్ బీబీసీ'!





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

మన కళ్లను టీవీ స్క్రీన్‌కు, మన చెవులను మొబైల్ ఫోన్‌కు అప్పగించని కాలంలో వినమ్ర రేడియో ఉండేది. 1960ల బంగారు బాల్యాన్ని దాటి 1970ల్లో కౌమార దశ, తొలి యవ్వనంలో ప్రస్థానించినవారు రేడియో అనే గవాక్షం ద్వారా విశాల ప్రపంచాన్ని వీక్షించేవారు, వినేవారు. నా జీవన విశ్వానికీ రేడియోనే కేంద్రం. వీనుల విందు చేసే హిందీ సినిమా పాటలను మన రేడియో (ఆకాశవాణి) వివిధ భారతి కార్యక్రమం ప్రతి రోజూ ప్రసారం చేసేది. వాటిని విన్న క్షణాలు నాకు ఇప్పటికీ సుమధుర జ్ఞాపకాలే. ఆదివారం మధ్యాహ్నం అమీన్ సయానీ అద్భుతంగా నిర్వహించే బోర్నవిటా క్విజ్ కార్యక్రమాన్ని వింటూ నేను స్వాయత్తం చేసుకున్న ఆనందం ఎనలేనిది. 1975లో హాకీ వరల్డ్ కప్‌ను భారత్ గెలుచుకున్నప్పుడు జస్దేవ్ సింగ్ దేశభక్తి ప్రపూరిత భావోద్విగ్న వ్యాఖ్యానాన్ని నేను నా గుండెలో నింపుకున్నాను, నిలుపుకున్నాను. ఆ రోజుల్లోనే తాజా క్రికెట్ స్కోర్ తెలుసుకునేందుకు క్లాస్‌రూమ్‌లోనే నా పాకెట్ ట్రాన్సిస్టర్‌ను వింటూ ఉండేవాణ్ణి!

బీబీసీ రేడియో ప్రసారాలు వినడమూ ఆ రోజుల్లోనే నాకు అలవాటయింది. పోలీసు అధికారి అయిన మా తాతయ్య ప్రతి ఉదయమూ యోగాసనాలూ, ధ్యానం అనంతరం బీబీసీ న్యూస్ బులెటిన్ తప్పక వినేవారు. 'వార్తలు వినదలుచుకున్నప్పుడు బీబీసీనే విను' అని ఆయన నాకు చెబుతుండేవారు. ఆయన సూచన మేరకు బీబీసీ న్యూస్ వినడం నాకు ఒక వ్యసనమయింది. నాకేనా? నాలాంటి ఎంతో మందికి కూడా. ఇలా ఎందరినో బీబీసీకి అభిమానులుగా మార్చిన ఆ ఘనతను సాధించిపెట్టిన ఒకే ఒక్కడు మార్క్ టలీ (తదనంతర కాలంలో సర్ మార్క్ టలీ).

1984లో ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారన్న వార్తను అందరికంటే ముందుగా ప్రపంచానికి బీబీసీ తెలియజేసినప్పుడు నేను హెయిర్ సెలూన్‌లో ఉన్నాను. ఆకాశవాణి విషాద సంగీతాన్ని వినిపిస్తోంది. అయితే ఆ భయానక ఘటన గురించి టలీ అనర్గళమైన స్వరంతో వార్తా నివేదన చేసిన తరువాతే ఆ దుర్వార్తను ధ్రువీకరించుకున్నాను. 1992లో బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు నేను ముంబైలో విలేఖరిగా ఉన్నాను. సంఘటన ప్రదేశం నుంచి విశ్వసనీయమైన వార్తా కథనాన్ని వినేందుకు అప్పుడూ నేను విన్నది బీబీసీనే. అయోధ్యలో కరసేవకులు టలీని వెన్నాడి, చంపేస్తామని బెదిరించారు. అయినా సంభవించిన ఘటన క్రమాన్ని ఆయన సంయమనంతో తేటతెల్లంగా విశదం చేశారు. మార్క్ టలీది విశ్వసనీయమైన వాణి. ఆయన స్వరంలో నిష్పాక్షికత భావోద్వేగ ప్రామాణికతతో మిళితమవుతుంది. సువిశాల భారత దేశంలో విస్తృతంగా పర్యటించి, అన్ని మతాల వారు, భాషల వారితో మనసు విప్పి మాట్లాడడం ద్వారా ఆయన తన వాణికి ఒక విశిష్టతను సముపార్జించుకున్నారు. ఆయన వార్తలు, వ్యాఖ్యానాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవి. వాటిని వారెవ్వరూ మరచిపోలేరు. దశాబ్దాల పాటు బీబీసీ ఇండియా బ్యూరో చీఫ్‌గా పనిచేసిన టలీ, ఆ సంస్థను సమస్త భారతీయులకు సుపరిచితమైన, విశ్వసనీయమైన న్యూస్ బ్రాండ్‌గా మార్చివేశారు. 1990ల్లో నా కెమెరామ్యాన్‌తో కలిసి ఉత్తరప్రదేశ్‌లో పర్యటిస్తున్నాను. లక్నో సమీపంలోని ఒక గ్రామానికి వెళ్లినప్పుడు మామిడి తోటల ఆసామి ఒకరు మమ్ములను తన గృహానికి ఆహ్వానించారు. అంతకు ముందు కొన్ని సంవత్సరాల క్రితం మార్క్ టలీతో తాను దిగిన ఫొటో నొకదాన్ని మాకు చూపారు. 'టలీని కలవడం, ఆయనతో సంభాషించడం తనకొక చిరస్మరణీయమైన, భావోద్వేగ అనుభవం' అని ఆ మామిడి రైతు నాకు చెప్పారు. పాత్రికేయ వృత్తి నిర్వహణలో మీరు ఒక ముద్రవేయడానికి మీ గొంతు పెంచాల్సిన అవసరంలేని కాలంలో టలీ సెలెబ్రిటీగా వెలుగొందారు. పువ్వులను పుట్టించేది వర్షమే కానీ, ఉరుములు కాదు కదా. ప్రభావాన్ని నెరపేందుకు ప్రశాంతంగా, సంయమనంతో, ఆలోచనాత్మకంగా మాట్లాడితే సరిపోయిన రోజులవి.

నాకూ ఈ గొప్ప పాత్రికేయుడుతో చిరస్మరణీయమైన, భావోద్వేగ అనుభవం ఉన్నది. 1994లో నేను ముంబై నుంచి ఢిల్లీకి మారాను. దేశ రాజధాని అధికార నడవాలు నాకు అపరిచిత ప్రదేశాలు. రాజకీయవేత్తలను కలుసుకోవాలనే ఆరాటం నాకు లేదు. మార్క్ టలీని కలవడానికే ప్రాధాన్యమిచ్చాను. నేను ఆయనకు ఫోన్ చేసినప్పుడు వెంటనే రమ్మని చెప్పారు. యువ పాత్రికేయులను కలవడం తనకెంతో సంతోషం కలిగించే విషయమని ఆయన అన్నారు. పటాటోపంతో వ్యవహరించే ఎడిటర్లు తమ విలేఖర్లను కలిసేందుకు తమ గదుల నుంచి బయటకు రారు కదా. మరి ఇరవైల ప్రాయంలో ఉన్న నన్ను టలీ సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో మరచిపోలేని పిచ్చాపాటీ చేశాను. పాత్రికేయంలో తన అనుభవాలను ఆయన ఆసక్తికరంగా వివరించారు. అంత గొప్ప జర్నలిస్టు వృత్తి జీవితం మొదటి దశలో ఉన్న యువ పాత్రికేయుడుతో అంత కలుపుగోలుగా మాట్లాడడం అపురూప విషయమే. తమకు అవసరమైన సమాచారం కోసం మాత్రమే భారతీయ పాత్రికేయులను కలుసుకునే 'ఫిరంగ్' తరహా జర్నలిస్టు కాదు టలీ. ఆయన తనను తాను భారతీయ పాత్రికేయ జగత్తులో అంతర్భాగంగా భావించుకునేవారు. ఈ కారణంగానే భారతదేశాన్ని తన సొంత దేశంగా మార్క్ టలీ భావించారు, గౌరవించారు. భారత్ అన్నా, భారతీయులు అన్నా ఆయనకు అవ్యాజమైన ప్రేమాభిమానాలు. అవి ఎటువంటి అభిజాత్యం లేనివి.

భారత్‌ను ఒక ప్రగాఢ ఆధ్యాత్మిక ప్రదేశంగా మార్క్ టలీ భావించారు. దేవునికి అనేక మార్గాలు ఉన్నాయనే సత్యాన్ని భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచే తాను నేర్చుకున్నానని ఆయన చెప్పేవారు. 'రక్తంలోను, రంగులోను భారతీయులు; అభిరుచులు, ఆలోచనలు, అభిప్రాయాలు, మేధలో ఆంగ్లేయులు అయిన వ్యక్తులను సృష్టించే లక్ష్యంతో భారత్‌లో ఆంగ్ల మాధ్యమంలో నూతన విద్యా విధానాన్ని అమలుపరచాలని లార్డ్ మెకాలే 1835లో ప్రతిపాదించారు. మెకాలేను తలకిందులు చేసిన ఘటికుడు మార్క్ టలీ. ఆయన రక్తంలోను, రంగులోను ఆంగ్లేయుడు. అయితే చింతనా దోరణిలో మాత్రం పరిపూర్ణ భారతీయుడు. ఇదే ఆయన్ని విశిష్టంగా నిలిపింది. విలక్షణ వ్యక్తిగా, విఖ్యాత విలేఖరిగా వెలుగొందేలా చేసింది.

టెలివిజన్ మాధ్యమం పట్ల మార్క్ టలీ పెద్దగా ఆకర్షితుడు కాకపోవడంపై ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. భారతీయ రైల్వే ప్రయాణాలపై సుప్రసిద్ధమైన డాక్యుమెంటరీ ఫిల్మ్ నొకదాన్ని ఆయన రూపొందించారు. మరికొన్ని డాక్యుమెంటరీలనూ రూపొందించినప్పటికీ ఆయన మొదటి ప్రేమ రేడియోనే. నేను ఎన్డీటీవీలో ఉన్నప్పుడు 'బిగ్ ఫైట్' కార్యక్రమంలో చర్చకు ఆయన్ను ఆహ్వానించాను. ఎంతో నచ్చచెప్పిన తరువాత మాత్రమే ఆయన వచ్చారు. ఆ టీవీ అనుభవం ఆయనకు ఏమంత ఆనందకరంగా లేదని అనిపించింది. నైతిక విలువలు, వృత్తి నిబద్ధత వర్ధిల్లిన కాలంలో ప్రభవించిన పాత్రికేయుడు మార్క్ టలీ. శబ్దం కంటే వార్తలకు, సంచలనం కంటే భావాలకు, గందరగోళం కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యమిచ్చిన పాత్రికేయుల తరానికి చెందినవాడు. ప్రస్తుత పాత్రికేయ ధోరణులను ఆయన ఆమోదించలేరు, అనుసరించలేరు. శాస్త్రీయ సంగీతవేత్త ఒకరు ఎవరైనా ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ బ్యాండ్‌లో పాల్గొనగలుగుతాడా? టెస్ట్ బ్యాట్స్‌మెన్ టెన్ ఓవర్స్ క్రికెట్ మ్యాచ్ ఆడగలుగుతారా? ఈ కారణంగానే టలీ తన జీవిత తుది దశను పూర్తిగా గ్రంథరచనతో గడిపారు.

రాజకీయ భారతదేశ కోలాహలానికి అతీతంగా తన వృత్తి విధులను నిష్పాక్షికంగా, నిశిత అవగాహనతో, సమగ్రంగా నిర్వర్తించగల స్థిర ప్రజ్ఞత టలీలో నిండుగా కనిపించే గుణ విశేషం. అత్యవసర పరిస్థితి కాలంలో ఆయనను భారత్ నుంచి బహిష్కరించారు. అయితే ఇందిరాగాంధీ జీవితాన్ని రాజకీయాలను సన్నిహితంగా, వ్యక్తిగతంగా, అదే సమయంలో నిష్పాక్షికంగా విశ్లేషించడంలో టలీకి ఆ 'చీకటి రోజులు' బాధాకర అనుభవం అడ్డు రాలేదు. అయోధ్య ఉద్యమకాలంలో హిందుత్వ శక్తులు ఆయనను వేధించాయి, దాడి చేశాయి. అయినా లాల్‌కృష్ణ అడ్వాణీతో నిష్కపటంగా మాటామంతీ జరిపేందుకు టలీని అవేమీ నిరోధించలేదు. 'పాత్రికేయం అక్షరాలా చరిత్ర మొదటి చిత్తుప్రతి' అని మార్క్ టలీ విశ్వసించారు. దైనందిన జీవితంలో సామాన్యుల సమస్యలు తెలుసుకోవడానికి, నడుస్తున్న చరిత్రపై ప్రజల మనోభావాలు వినడానికే ఆయనలోని విలేఖరి ప్రవృత్తులు అన్నిటికంటే ఎక్కువగా ప్రాధాన్యమిచ్చాయి. తన కళ్లముందు సంభవిస్తోన్న ఘటనలపై ఎటువంటి పక్షపాతం లేకుండా వార్తలు నివేదించేందుకే టలీ నిబద్ధమై ఉన్నారు. అధికార ప్రాభవాలు ఉన్నవారి మెచ్చుకోలుకుగానీ గానీ ధన లబ్ధికిగానీ ఆయన ఎన్నడూ ఆరాటపడలేదు, ప్రాకులాడలేదు.

గోదీ మీడియా ప్రాభవ ప్రాబల్యాల పట్ల టలీ ప్రతిస్పందన ఏమిటి? పాలకపక్షం, ప్రభుత్వం తరఫున వకాల్తా పుచ్చుకున్న పాత్రికేయుల గురించి ఆయన ఏమనుకుంటున్నారు? నేను ఎప్పుడూ ఆయన్ను ఈ అంశాలపై ప్రశ్నించలేదు. అయితే ఇండియా ఇంటర్నేషనల్‌లో టలీతో నేను చివరిసారి జరిపిన సంభాషణల్లో ఒకటి నాకు బాగా గుర్తు ఉన్నది. 'నేటి భారతదేశంలో ఒక జర్నలిస్టుగా ఉండడం అంత తేలికైన విషయం కాదనుకుంటాను' అని ఆయన చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. భారత్‌లోని బీబీసీ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు జరిపిన రోజులవి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శనాత్మక డాక్యుమెంటరీ నొకదాన్ని ప్రసారం చేసినందుకే బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులు జరిగాయి. టలీ వ్యాఖ్య విని నేను మందహాసం చేస్తూ మెల్లగా తల ఊపాను. భారతీయ జీవితం నిరంతరాయ ప్రవాహిని అన్న భావాన్ని ప్రస్ఫుట పరుస్తూ రాసిన తన సుప్రసిద్ధ గ్రంథానికి ఆయన 'There are no full Stops in india' అన్న సముచిత శీర్షిక పెట్టారు. వీడ్కోలు సర్ మార్క్, ఆవలి తీరానికి ప్రశాంతంగా ప్రయాణించండి.

నైతిక విలువలు, వృత్తి నిబద్ధత వర్ధిల్లిన కాలంలో ప్రభవించిన పాత్రికేయుడు మార్క్ టలీ. శబ్దం కంటే వార్తలకు, సంచలనం కంటే భావాలకు, గందరగోళం కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యమిచ్చిన పాత్రికేయుల తరానికి చెందినవాడు. దైనందిన జీవితంలో సామాన్యుల సమస్యలు తెలుసుకోవడానికి, నడుస్తున్న చరిత్రపై ప్రజల మనోభావాలు వినడానికే ఆయనలోని విలేఖరి ప్రవృత్తులు ఎక్కువగా ప్రాధాన్యమిచ్చాయి. అధికార ప్రాభవాలు ఉన్నవారి మెచ్చుకోలుకుగానీ ధన లబ్ధికిగానీ ఆయన ఎన్నడూ ఆరాటపడలేదు, పాకులాడలేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)


గాంధీ, అంబేడ్కర్, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

మహాత్ముడివి మూడు బాధలు!

సత్యమే దేవుడని నమ్మిన మహామనిషి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. మన దేశపు భిన్నత్వంలోని ఏకత్వాన్ని మనసా వాచా కర్మణా నమ్మి ప్రజల మధ్య వైషమ్యాలు లేని సమైక్య భారతావనిని కలగన్న దార్శనికుడు. ఆయన సంప్రదాయవాది కాదు, అదే సమయంలో అభ్యుదయ వాదీ కాదు. కేవలం ఇంగిత జ్ఞానంతో పనిచేసిన ఒక ఆదర్శవాది. గాంధీని జీవితాంతం బాధించిన విషయాలు ప్రధానంగా మూడు ఉన్నాయి. ఒకటి, హిందూ ముస్లిం ఐక్యత లేకపోవడం. రెండు, దళితులు అభ్యున్నతి పొందక పోవడం. మూడవది, దరిద్ర నారాయణుల్ని పేదరికం నుంచి బయట పడవేయలేకపోవడం. గాంధీ రచనలన్నిటా ఈ విషయాలే కీలకంగా ఉంటాయి. "నేను నమ్మే సిద్ధాంతాలు, ఆదర్శాలు వ్యాప్తిలో ఉన్నంత కాలం, మరణానంతరం సైతం జీవించే వుంటాను" అని చెప్పారాయన. 20వ శతాబ్ది రాజకీయ నాయకుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచవ్యాప్తంగా నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచాడాయన.

దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచాక నేడు, గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు భారతజాతి నైతికత మీద దాడి చేయడమే. అన్ని జాతులు, మతాలు కలగలిసి సమైక్యంగా జీవించాలనే ఆకాంక్ష కోసం ఆయన చెల్లించిన మూల్యం– ప్రాణం. ప్రజాస్వామ్యంలో హింసను, హత్య చేసిన వారిని కీర్తించడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే. దేశానికి గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేదేమో కానీ, గాంధీ ఐడియాలజీ లేకుండా దేశం ఇంతటి ప్రశాంతతను పొందేది కాదు. మార్టిన్ లూథర్‌కింగ్ అమెరికాలో నల్ల జాతీయులకు హక్కులు సాధించినా, నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తెచ్చినా... మహాత్ముడి అహింసా మార్గమే వారికి ఆదర్శం.

గాంధీ సత్యాగ్రహం అంటే– తనను తాను ఆత్మపరిశీలన, ఆత్మ పరివర్తన చేసుకోవడం. మనిషిలో హింస, కోపం, అహంకారం, ద్వేషం ఉన్నప్పుడు



ఇతరులకు మార్గదర్శిగా నిలవడం నైతికంగా సరైంది కాదని ఆయన నమ్మారు. ఇదే గాంధీ సత్యాగ్రహానికి పునాది. తనతో తాను నిజాయితీగా ఉండకపోతే, సత్యం కోసం సమాజంతో పోరాడే నైతిక హక్కు ఉండదని నమ్మారు. చౌరీ–చౌరా సంఘటనలో హింస జరిగిందని, తాను నైతికంగా సమాజాన్ని అహింస వైపు నడిపించడంలో విఫలమయ్యానని భావించి ఉద్యమాన్ని ఆపేశారు. ఇది గాంధీలోని ఆత్మ పరిశీలనకు ఒక గొప్ప తార్కాణం. అలాగే గాంధీ దృష్టిలో ధర్మం అంటే– సత్యం, అహింస, నైతికతపై ఆధారపడిన జీవన విధానం. ధర్మం– వ్యక్తిగత, సామాజిక రాజకీయ రంగాలన్నిటిలోనూ నైతిక బాధ్యతను సూచిస్తుంది. వ్యక్తికీ– వ్యక్తికీ, వ్యక్తికీ– సమాజానికీ, సమూహానికీ– సమూహానికీ మధ్య సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని ప్రస్తావించారు. గాంధీ దృష్టిలో సన్యాసి అంటే అంతర్ముఖ నైతికత, సామాజిక బాధ్యత, బాహ్యజీవన రీతిగా ఆచరించేవారు; ముఖ్యంగా బలహీనుల పక్షాన నిలబడే ఆధునిక వేదాంతి; సమాజం నుంచి పారిపోయేవారు కాదు, ఒక నైతిక పోరాట యోధుడు.

స్వదేశీ గురించి విస్తృతంగా ప్రచారం చేసిన గాంధీ... కేవలం దేశీయ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ మాత్రమే కాదు. దానిని ఒక సామాజిక, ఆర్థిక కార్యక్రమంగా ముందుకు నడిపారు. ఖద్దరు ఉత్పత్తి, సత్యాగ్రహం, రైతు ఉద్యమాలు, దేవాలయ ప్రవేశాలు ఇవన్నీ కూడా ప్రజలను కుల, మత రహితంగా ఐక్యం చేయడానికి ఉద్దేశించిన కార్యాచరణలు. తోటి మానవుల పట్ల ప్రేమ, దయ, గుణాలతో వ్యవహరించడం, మానవసేవే మాధవ సేవగా ఆచరించడం... గాంధీ దృష్టిలో సనాతనం. గాంధీ సనాతన వాదం ఏ విషయాలపైనా మొండిగా వ్యవహరించదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతుంది. "నా హిందూయిజం ఎవరినీ వెలివేయదు. అన్ని తరగతులను కలుపుకుపోయే సమగ్రతా సిద్ధాంతం" అంటారు గాంధీ.

అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీ పెద్ద యుద్ధం చేశారు. హిందూ శాస్త్రాల భావం సమానత్వాన్ని ప్రసాదించేదే తప్ప అస్పృశ్యతను ప్రోది చేసేది కాదని పలు సందర్భాల్లో అన్నారు. 'హరిజన' పేరుతో ఒక పత్రికను స్థాపించి, అహింసా సిద్ధాంతానికి అస్పృశ్యత విరుద్ధమని చాటారు. సాటి మనిషిని తక్కువగా, అవమానకరంగా చూడడం భగవద్గీత సందేశానికి కూడా వ్యతిరేకమని హిందూ సమాజాన్ని హెచ్చరించారు. హిందూ మతంలో అంతర్గత సంస్కరణల కోసం పోరాటం చేసిన చిట్టచివరి నాయకుడు మహాత్మాగాంధీ. సత్యమే దేవుడని నమ్మిన ఆయన దైవాన్వేషణలో ఎవ్వరూ మతం మారాల్సిన అవసరం లేదని చెప్పారు.

గాంధీ లేకుండా స్వాతంత్ర్యోద్యమాన్ని, అంబేడ్కర్ లేకుండా భారత రాజ్యాంగాన్ని, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

● డొక్కా మాణిక్య వరప్రసాద్
మాజీ మంత్రి

(నేడు మహాత్మాగాంధీ వర్ధంతి)

అటకెక్కిన 'ప్రధాని 15 సూత్రాల పథకం'

దేశంలోని మైనార్టీల సంక్షేమం కోసం 2005లో 'ప్రధాని 15 సూత్రాల పథకం'ను ప్రకటించారు. అల్పసంఖ్యాక వర్గ ప్రజల సంక్షేమం కోసం ఈ పథకంలో నిర్దేశించిన కచ్చితమైన లక్ష్యాలు అమలు చేస్తామని అప్పటి ప్రధానమంత్రి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా చెప్పారు. మైనార్టీలకు విద్యావకాశాలు పెంపొందించడం, ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలలో మైనార్టీలకు సమాన వాటా కల్పించేందుకు కొత్త పథకాలు–ప్రస్తుత పథకాల ద్వారా కృషి చేయడం వంటివి ఈ పథకం లక్ష్యాలు. ఇవేగాక స్వయం ఉపాధికి అవసరమైన రుణ సదుపాయాలను కల్పించడం, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు పెంపొందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మైనార్టీలకు తగిన వాటా కల్పించి, వారి జీవన స్థితిగతులను మెరుగుపరచడం, మతసామరస్యం దెబ్బతీసే సంఘటనలను నియంత్రించడం కూడా ఉన్నాయి.

ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం అమలుకు, ప్రస్తావించిన తగినంత మైనార్టీ జనాభా ఏదైనా జిల్లాలోని ఒక యూనిట్ ప్రాంతం పరిధిలో 25 శాతం మంది ఉండాలి. 1992లో జాతీయ మైనార్టీ కమిషన్ చట్టంలోని 2(ఓ) సెక్షను ప్రకారం ఈ కార్యక్రమాల లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఈ సెక్షన్ ప్రకారం– ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు (జోరాస్ట్రియన్లు) తదితరులను మైనార్టీలుగా గుర్తిస్తారు. ఆ వర్గాలకే ప్రయోజనాలు అందేలా లక్ష్యాలు నిర్దేశిస్తారు. మైనార్టీగా గుర్తింపు పొందిన ప్రజలు మరో రాష్ట్రంలో మెజార్టీ వర్గమైనప్పుడు, వివిధ పథకాల ప్రయోజనాలు మైనార్టీలుగా నోటిఫై చేసిన ఇతర గ్రూపులకు మాత్రమే వర్తిస్తాయి. జమ్మూ కశ్మీర్, పంజాబ్, మేఘాలయ, సిక్కిం, మిజోరం, నాగాలాండ్ ఈ కేటగిరీ కిందకు వస్తాయి. అలాగే కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షద్వీప్ కూడా ఇదే కేటగిరికి వస్తుంది.

మైనార్టీల బతుకులను మార్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి 15 సూత్రాల పథకం అటకెక్కి ఎక్కడా పూర్తిగా అమలవుతున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో ఇది పూర్తిగా పడకేసింది. ముస్లింల సంక్షేమం దృష్ట్యా ఈ పథకం అమలుకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలి. మైనార్టీలలో చాలా వరకు తక్కువ స్థాయి పనుల్లో ఉపాధి పొందుతున్నారు. ఎక్కువగా చేతి వృత్తుల మీదనే జీవనం గడుపుతున్నారు. వారికి సాంకేతిక శిక్షణ అందించడం ద్వారా నైపుణ్యాలను పెంపొందించే కృషి జరగాలి. మైనార్టీల ఆర్థికాభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక సహాయం సంస్థ 1994లో ఏర్పాటయింది. అది కూడా లక్ష్యాలను సాధించడంలో విఫలమైంది. ప్రధాని 15 సూత్రాల పథకం అమలు మాత్రమే మైనార్టీ వర్గాలకు చేయూత ఇస్తుంది.

– షేక్ అబ్దుల్ సమద్

కానరాని కోకో ధరల విధానం

కోకో కాంక్లేవ్‌ను జనవరి 30, 31 తేదీల్లో ఏలూరు వేదికగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కాంక్లేవ్ ద్వారా కోకో గింజల ధర సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్రంలోని కోకో రైతులు ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ మార్కెట్ ధరలు ఇవ్వకుండా ధరలు తగ్గించి రైతులను మోసగించాయి.

రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు ఉన్నది. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్ పామ్ పంటలకు అంతర పంటగా రైతులు కోకోను సాగు చేస్తున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్ల ఆశించడం, ఈ సంవత్సరం మినహా గత అనేక సంవత్సరాలుగా కొబ్బరికి ధర లేకపోవడం, కొబ్బరి రైతులు సంక్షోభం ఎదుర్కోవడం వలన రైతులు కోకో పంట మీదనే ఆధారపడ్డారు. అంతర పంట అయిన కోకో కాస్తా ప్రధాన పంటగా మారింది.

ప్రపంచంలో 20 దేశాలలో కోకో పంట సాగు ఉండగా, వాటిలో భారత్ 20వ దేశంగా ఉంది. మన దేశ అవసరాలకు కావలసిన కోకో గింజల్లో 20శాతం మాత్రమే దేశంలో ఉత్పత్తి అవుతున్నాయి. తక్కిన 80శాతం కోకో గింజలతోపాటు, కోకో పౌడర్, బటర్, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కోకో రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. భారత్–యూరప్ యూనియన్ మధ్య జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా చాక్లెట్ ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా ఎత్తివేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం కోకో ఉత్పత్తులపై నామమాత్రపు దిగుమతి సుంకాలు ఉండడం వలన కంపెనీలు విదేశీ కోకో ఉత్పత్తులను దిగుమతి చేసుకొని దేశీయంగా రైతులను నష్టపరుస్తున్నాయి. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిపోయి సున్నా శాతం దిగుమతి సుంకాలకు ఒప్పందాలు చేసుకోవడం వలన రైతులు మరింతగా నష్టపోయే పరిస్థితి దాపురిస్తుంది.

రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే వాటి కొనుగోలుకు, మార్కెటింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేయడం అన్యాయం. ఏలూరు కేంద్రంగా జరుగుతున్న కోకో కాంక్లేవ్ లోనైనా కోకో గింజల ధరల నిర్ణయానికి ఫార్ములా రూపొందించేందుకు తగు సమాలోచనలు చేస్తారని ఆశిద్దాం.



రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే వాటి కొనుగోలుకు, మార్కెటింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేయడం అన్యాయం. రాష్ట్రంలో 30 ఏళ్లకు పైగా కోకో పంట సాగు అవుతుంటే ఇంతవరకు కోకో గింజలకు ధర నిర్ణయ విధానం లేకపోవడం దారుణం. రాష్ట్రంలో పామాయిల్ రైతులు ఆయిల్ పామ్ గెలలకు ధర నిర్ణయ సూత్రాన్ని సాధించుకున్నారు. ఆయిల్ పామ్ గెలలకు క్రషింగ్ ద్వారా వచ్చే ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఇఆర్) ఆధారంగా అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రూపొందించిన ఫార్ములా ప్రకారం ప్రతి నెల ధర నిర్ణయం జరుగుతుంది. అదే విధంగా కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించాలని రైతాంగం కోరుతోంది. కోకో గింజలకు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసం చేసిన ఫలితంగా గత ఏడాది రూ.500కోట్లకు పైగా రాష్ట్ర కోకో రైతులు నష్టపోయారు. 2025 ఫిబ్రవరి నుంచి మే వరకు నాలుగు నెలల పాటు సుదీర్ఘ పోరాటాన్ని రాష్ట్రంలో కోకో రైతులు సాగించారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రూ.50 ప్రోత్సాహం అందించి కిలో కోకో గింజలకు రూ.500 ధర కల్పించింది. కోకో రైతులకు ప్రోత్సాహం పేరుతో రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. అయితే రైతులు నష్టపోయింది రూ.500 కోట్లు పైనే.

ప్రస్తుతం కిలో కోకో గింజలను కంపెనీలు రూ.350కి మొదలుపెట్టి రైతుల ఆందోళనలతో రూ.400లకు పెంచి కొంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ధర తగ్గిపోయిందంటూ కంపెనీల ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు పెరిగినప్పుడు ఈ కంపెనీల ప్రతినిధులు పెరిగిన ధరల గురించి కనీసం మాట్లాడటం లేదు. దేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో సాగు విస్తీర్ణంలో మొదటి స్థానంలో ఉంది. కోకో గింజల ఉత్పత్తి కూడా దేశంలో 50శాతం ఏపీలోనే ఉత్పత్తి జరుగుతున్నది. గత సంవత్సర కాలంగా రైతులలో ఐక్యత పెరిగింది. కోకో రైతులు వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కోకో పంట విస్తీర్ణం పెరుగుదలకు, కోకో ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు, సబ్సిడీలు ఇస్తున్నట్లు చెబుతున్నది. అయితే రైతులు కోరుతున్న విధంగా కోకో గింజల ధరల పాలసీ గురించి మాట్లాడడం లేదు.

ఏలూరు కేంద్రంగా జనవరి 30, 31 తేదీల్లో జరుగుతున్న కోకో కాంక్లేవ్‌లోనైనా కోకో గింజల ధరల నిర్ణయానికి ఫార్ములా రూపొందించేందుకు తగు సమాలోచనలు చేస్తారని ఆశిద్దాం. రాష్ట్రంలో కోకో విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర కోకో పరిశోధనా సంస్థ ఏర్పాటు అత్యవసరం. అంతేకాకుండా కొబ్బరి బోర్డులా రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలి.

■ కె.శ్రీనివాస్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోకో రైతుల సంఘం



- రోజురోజుకు పెరుగుతోన్న సరుకు రాక
- వచ్చే వారం నుంచి రోజుకు లక్షకుపైగా వస్తాయని అంచనా
- పెద్దఎత్తున కోతలు..
- ధర ఆశాజనకంతో పెరిగిన ఎరైవల్స్

యార్డుకు.. 93 వేల టిక్కీలు

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి కోతలు జోరందుకుంటున్నాయి.. ధర కూడా ఆశాజనకంగా ఉంటోంది.. దీంతో గుంటూరు మిర్చి యార్డుకు టిక్కీలు పోటెత్తుతున్నాయి. రైతులు మిరపకాయలను విక్రయించేందుకు యార్డుకు తరలివస్తున్నారు. అలానే శీతల గిడ్డంగుల్లో నిల్వ పెట్టిన బస్తాలను కూడా బయటకు తీసి విక్రయానికి తెస్తున్నారు. దీంతో యార్డుకు ఎరైవల్స్ పెరిగాయి. గురువారం ఒక్క రోజే 93,040 టిక్కీలు వచ్చినట్లు యార్డు గేట్ ఎంట్రీలో నమోదయ్యాయి. వాటిలో 90,143 టిక్కీలు విక్రయం జరగడం విశేషం. ఇక వచ్చే వారం నుంచి రోజుకు లక్షకు పైగా టిక్కీలు వస్తాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తోన్నాయి. ఫిబ్రవరి 15వ తేదీ మహాశివరాత్రి తర్వాత లక్షన్నర దాటొచ్చని భావిస్తున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిర్చి పంట ఇప్పుడు చేతికి వస్తోంది. గుంటూరు, ప్రకాశం, పల్నాడు, మార్కాపురం, కర్నూలు జిల్లాల్లో మిర్చి పంట తొలి కోతలు ప్రారంభమయ్యాయి.334,341,బ్యాడిగి, దేవనూరు డీలక్స్ వంటి రకాల మిర్చికి క్విం టాల్ రూ.23 వేల నుంచి రూ.25,500 వరకు ధర వస్తున్నది. ఈ ఏడాది పెద్దగా తాలు కాయలు రావడం లేదు. గత సంవత్సరం కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసిన తాలు కాయలకు కూడా మార్కెట్‌లో మంచి రేటు లభిస్తున్నది. రకాన్ని బట్టి రూ.9 వేల నుంచి రూ. 11 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు పోను కొంత ఆదాయం వచ్చే పరిస్థితి ఉండటంతో తాలుకాయలను స్టాకిస్టులు, రైతులు విక్రయిస్తున్నారు. ఇదికూడా ఎరైవల్స్ పెరగడానికి ఒక కారణంగా మారింది.

యార్డుకు పెరగనున్న ఆదాయం

మిర్చియార్డుకు ఎరైవల్స్ పెరిగి, రైతుకు ధర ఎక్కువగా లభిస్తే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. గత ఏడాది క్వింటాల్ మిర్చి రూ.10 వేల మధ్యనే ఉండటంతో ఆదాయం పడిపోయింది. రూ.100 కోట్లకు పైగా వస్తుందని అంచనా వేస్తే రూ.90 కోట్ల మధ్యనే ఆగిపోయింది. ఈ సంవత్సరం ఎరైవల్స్ పెరుగుతోండటం, ధర గత ఏడాదితో పోల్చితే రెట్టింపుగా ఉన్న నేపథ్యంలో ఆదాయం కచ్చితంగా పెరుగుతుందని మార్కెటింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్కెట్ కమిటీకి రూ.1 శాతం ఫీజు విక్రయాలపై సమకూరుతుంది. దీని వలన కచ్చితంగా మార్కెటింగ్ శాఖ ఇచ్చిన లక్ష్యం అధిగమించొచ్చని భావిస్తున్నారు. అలానే 2 శాతం కమీషన్ రూపంలో వ్యాపారులకు కూడా ఆదాయం గణనీయంగా పెరగనున్నది.

తెల్ల బంగారమే

- క్వింటాల్ పత్తి రూ.8200
- పరుగులు పెడుతున్న ధర
- మద్దతు మించి వ్యాపారుల కొనుగోలు



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

పత్తి సాగుదారుల పంట పండింది. రోజురోజుకు ధరలు పరుగు పెడుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు దూసుకెళ్తున్నట్లుగానే తెల్ల బంగారం కూడా మెరిసిపోతోంది. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రకటించిన మద్దతు ధరను దాటేసింది. వ్యాపారులు పోటీలు పడి మరీ అధిక ధరలకు పత్తి కొనుగోళ్లకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం క్వింటాల్ పత్తిధర రూ.8,000 నుంచి రూ.8,200 వరకు పలుకుతోంది. సాధారణంగా సీసీఐ ధరే మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తుంది. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా మారింది. ప్రభుత్వ ధరకు మించి ప్రైవేట్ వ్యాపారులు పోటీగా కొనుగోలు చేయడం విశేషం. ఇందుకు దేశీయ-అంతర్జాతీయ మార్కెట్లలో పత్తికి డిమాండ్ ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సీసీఐ మద్దతు

(మిగతా 6వ పేజీలో)

విత్తనాల ధరలూ, దిగుబడి ప్రభావం


పత్తి ధరల పెరుగుదల ప్రభావం విత్తనాల మార్కెట్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. ఒక క్వింటాల్ పత్తిలో సుమారు 65 కేజీ లు విత్తనాలు, 31.5 కేజీల నుంచి 33 కేజీల వరకే దూది వస్తుంది. ప్రస్తుతం క్వింటాల్ పత్తి విత్తనాల ధర రూ.3,800 నుంచి రూ.4,000 వరకు చేరింది. రానున్న సీజన్‌లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో విత్తనాలకు డిమాండ్ ముందుగానే పెరిగింది. అంతేకాకుండా ప్రస్తుతం పత్తి ధరలు పెరిగేందుకు దిగుబడి తగ్గడం కూడా ఒక కారణంగా వ్యాపారులు చెప్తున్నారు. తుఫాన్ల ప్రభావం వల్ల ఎర్ర తెగులు సోకి పత్తి దిగుబడి పూర్తిగా పడిపోయింది. అయితే నాణ్యతపై రాజీపడకుండా పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే పూర్తి లాభం దక్కుతుందని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. మొత్తంగా ఈ ఏడాది పత్తి రైతుకు అనుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి.

రూ.99కే అల్పాహారం, భోజనం

- మిర్చియార్డులో భోజన టెండర్ ఖరారు

7

వీధిపోటుకి.. విముక్తి



- సమస్యకు సీఆర్డీఏ పరిష్కారం
- 112 ప్లాట్లకు ప్రత్యామ్నాయ ప్లాట్ల పంపకం

తుళ్లూరు, మంగళగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూ సమీకరణ కింద భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి వీధి పోటు సమస్యకు సీఆర్డీఏ ఎట్టకేలకు పరిష్కారం చూపింది. గతంలో రైతులకు ఈ-లాటరీ ద్వారా రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కేటాయించగా అందులో వీధిపోటు ఉన్న ప్లాట్లకు బదులు వేరే ప్లాట్లు కేటాయించాలని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. త్రిసభ్య కమిటీ సమావేశంలో కూడా రైతులు వీధి పోట్లు ఉన్న ప్లాట్లకు సంబంధించి మరి కొన్ని సమస్యలు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. ఆ మేరకు రైతుల అభ్యంతరాలను సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో చర్చించిన అనంతరం పలు రకాల వీధి పోట్లు వచ్చిన ప్లాట్లను పరిశీలించి మార్గదర్శకాలు రూపొందించారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లలో రహదారి అడ్డంకులు (రోడ్డు పోటు) ఉన్న కేటగిరి ఏ, బీ ప్లాట్లను గుర్తించారు. కేటగిరి ఏ కింద పశ్చిమ- నైరుతి, దక్షిణ- నైరుతి దిశల నుంచి రోడ్డు పోటు కలిగిన కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. కేటగిరి బీ కింద చిన్న రోడ్డు నుంచి పెద్ద రోడ్డు వరకు రోడ్డు పోటు కలిగిన ప్లాట్లు ఉన్నాయి. ఈ కేటగిరిలో 62 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. సమాన రోడ్డు వెడల్పులు కలిగిన ప్లాట్లు, పలు దిశల నుంచి వీధి పోట్లు ఉన్న ప్లాట్లు, చిన్న రోడ్డు నుంచి పెద్ద రోడ్డుకు మారడం లేదా సమాన వెడల్పు రోడ్ల వల్ల ప్రభావితమైన ప్లాట్లు ఉన్నాయి. ఈ కేటగిరిలో 50 ప్లాట్లు, మొత్తంగా 112 ప్లాట్లు ఉన్నాయి. వీటిని రద్దుచేసి వాటి స్థానే వేరే ప్లాట్లను ఇచ్చేందుకు సీఆర్డీఏ చర్యలు చేపట్టింది. 112 ప్లాట్లలో రిటర్నబుల్ ప్లాట్లు మూడో పార్టీకి చేతులు మారకుండా ఉంటే, రిజిస్ట్రేషన్ కాని, మ్యూటేషన్ జరగని ప్లాట్లకు మాత్రమే ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిస్తారు.

తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు పింఛన్

భూ సమీకరణ పథకం(ఎల్‌పీఎస్) అమలులో భాగంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని భూమిలేని కుటుంబాలకు నెలకు రూ.5,000 పింఛన్‌ను సామాజిక భద్రత చర్యగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. తల్లిదండ్రులిద్దర్నీ కోల్పోయిన చిన్నారులకు తాజాగా పింఛను సదుపాయం కల్పిస్తూ సీఆర్డీఏ చర్యలు తీసుకుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మైనర్లకు పింఛన్ మంజూరు చేసే అవకాశం లేదు. దీంతో తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందిన ఏడు కుటుంబాల్లోని పిల్లలకు పింఛన్ నిలిపివేయాల్సి వచ్చింది. ఈ పిల్లలు వృద్ధులపై ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో సీఆర్డీఏ అధికారులు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన క్యాబినెట్ ఏడు కుటుంబాల్లోని మైనర్లకు పింఛన్ మంజూరుకు ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటి వరకు గుర్తించిన ఏడు కుటుంబాల్లోని బాలలకు అమరావతి జీవన భృతి పింఛన్ రూ.5,000 అందిస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు.



చెరువు చుట్టూ ఎండిపోయిన మొక్కలు

ఆహ్లాదం.. అధ్వానం

ముణ్ణాళ్ల ముచ్చటగా చెరువు అభివృద్ధి



ఆహా అన్నారు.. అందుబాటులోకి ఆహ్లాదం వచ్చింది.. రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు.. నగర శివారులో వెంగళాయపాలెం చెరువును అద్భుతంగా తీర్చిదిద్దారు. అయితే ఇదంతా మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది. దేశంలోనే మోడల్‌గా అభివృద్ధి చేసిన చెరువు నిర్వహణ లోపం కారణంగా రూ.లక్షలతో చేపట్టిన పనులు అధ్వానంగా మారాయి. చెరువు చుట్టూ నాటిన కొబ్బరి చెట్లు, ఇతర చెట్లు ఎండిపోయాయి. వాకింగ్ ట్రాక్ రాళ్లు తేలి నడవడానికి ఇబ్బందికరంగా మారింది. కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించిన అభివృద్ధి పనులు, వెచ్చించిన నిధులు నిరుపయోగంగా మారాయి.

- (గుంటూరు - ఆంధ్రజ్యోతి)



ధ్వంసమైన బోర్డు



మూడేళ్లలో ఐకానిక్ టవర్లు పూర్తి

- రాజధాని గ్రామాల్లోనూ అంతర్జాతీయ వసతులు
- గ్రామసభల్లో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



తుళ్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వచ్చే మూడేళ్లలో ఐకానిక్ టవర్లు పూర్తి అయ్యేందుకు నిర్మాణ కంపెనీలు వడివడిగా అడుగులు వేస్తున్నాయని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. ఉద్దండ్రాయునిపాలెం, వెలగపూడి, వెంకటపాలెం గ్రామాల్లో గురువారం సీఆర్డీఏ గ్రామసభలు జరిగాయి. ఆయా సభల్లో రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాజధాని లేఅవుట్లలో అంతర్జాతీయ స్థాయిలో ఏ మౌలిక వసతులు ఏర్పాటు అవుతున్నాయో, గ్రామాల్లో కూడా అదేస్థాయిలో ఏర్పాటు చేస్తామని వివరించారు. రాజధాని నిర్మాణంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఇప్పటికే సీఆర్డీఏ నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిమన్ కమిటీ తరచూ రైతులతో భేటీ అయ్యి వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలం నాటికి అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ, డీసీలు భాగ్యరేఖ, శేషురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి.. తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం

- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ఆరంతస్తులు.. 600 పడకలతో నిర్మాణం



గుంటూరు మెడికల్, గుంటూరు కార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం(జింకానా) వితరణతో రూ.100 కోట్లతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో రూపుదిద్దుకున్న డాక్టర్ కానూరి రామచంద్రరావు జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జీ ప్లస్ ఐదు అంతస్తులుగా 600 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ బహుళ అంతస్తుల భవనాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆధునిక వైద్య పరికరాలతో స్త్రీ, ప్రసూతి వైద్య విభాగంతో పాటు శిశు వైద్యం, శిశు శస్త్రచికిత్స విభాగాలను అందుబాటులోకి తెచ్చారు. కాగా ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులు జీజీహెచ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి నగరంపాలెం వైపుగా జీజీహెచ్ వరకు విభాగాధిపతులతో కలిసి పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై గోతులు ఉండకుండా ప్యాచ్ వర్కులతో పాటు ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం 10.30 గంట లకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో గుంటూరుకు చేరుకుంటారు. 10.40కి పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకునే సీఎంకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి 10.50కి జీజీహెచ్‌కు చేరుకుంటారు. డాక్టర్ కానూరి - జింకాన మాత, శిశు విభాగం ప్రారంభోత్సవంలో పాల్గొం టారు. అనంతరం పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి వెళ్తారని అధికారులు ప్రకటించారు.

జాబ్.. జాప్యం

జాడలేని క్యాలెండర్

- జనవరి పూర్తవుతున్నా ఊసెత్తని వైనం
- ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- గుంటూరులో శిక్షణ తీసుకుంటోన్న వేల మంది



నోటిఫికేషన్ల కోసం నిరీక్షణ

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఒంగోలు, ఎన్టీఆర్ జిల్లాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా ఉంటోంది. గుంటూరు నగరంలో ఉండే కోచింగ్ సెంటర్లలో వీరంతా శిక్షణ తీసుకుంటున్నారు. వారంతా నగరంలో ఉండే హాస్టళ్లలోనో, రూములు అద్దెకు తీసుకునో ఉంటూ పోటీ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టడీ రూముల్లోనో, జిల్లా, కేంద్ర గ్రంథాలయాల్లోనో ఏళ్ల తరబడి అధ్యయనం చేస్తున్నారు. ఒక్క గుంటూరు నగరంలోనే స్థానికేతరులు 20వేల మందికి పైగా ఉంటున్నారంటే, స్థానికులతో కలుపుకుంటే ఈ సంఖ్య అనేక రెట్లు ఉంటుంది. వీరంతా గత ఆరేళ్లుగా వేలాది రూపాయలు ఖర్చు చేసి పోటీ పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారు. ఆ కారణంగా కుటుం బాలపై మోయ లేని భారం పడుతోంది.



తెనాలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం.. చదువుకున్న ప్రతి యువకుడి కల. ఆ కలను సాకారం చేసుకోవడానికి సర్వస్వం ఒడ్డి పోరాడుతుంటారు. అయితే పోరాడే అవ కాశమే రావడంలేదు. గడిచిన ఆరేళ్లుగా నోటిఫి కేషన్ల కోసం నిరుద్యోగులు ఎదురుచూపులతో సరిపెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌పై హామీ ఇచ్చి ఐదేళ్లు గడిపింది. కాగా ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ వస్తుందని రెండు మూడు నెలలుగా భారీ ప్రచారం జరిగింది. కానీ జనవరి నెల పూర్తి కావస్తున్నా జాబ్ క్యాలెండర్ ఊసే లేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వం లాగే కూటమి ప్రభుత్వం కూడా తమను వంచిస్తోందా అన్న అనుమానం నిరుద్యోగుల్లో కనిపిస్తోంది. 2019 ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగుల ఆకాంక్షలను ఆసరా చేసుకుని వైసీపీ ఏటా జాబ్ క్యాలెండర్.. రాష్ట్రంలో 2లక్షల 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఐదు సార్లు జనవరి ఒకటో తేదీ వచ్చింది కానీ జాబ్ క్యాలెండర్ రాలేదు. కనీసం నోటిఫికేషన్లు కూడా రాలేదు. మొత్తంగా చూసుకున్నా రెండు వేల లోపు పోస్టులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా వివాదాస్పదమయ్యాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనం (మిగతా 6వ పేజీలో)



ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్
- ఘనంగా అఖిల భారత కిసాన్ సభలు ప్రారంభం

6

అపూర్వం.. దాతృత్వానికి నిదర్శనం

కానూరి జింకానా తల్లీపిల్లల ఆరోగ్య కేంద్రం సిద్ధం

- 600 పడకలతో జీ ప్లస్ ఐదు అంతస్తులుగా నిర్మాణం
- భారీగా పాల్గొనేందుకు వస్తున్న ఎన్నారై వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికాలో స్థిరపడ్డ గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) వితరణతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో రూపుదిద్దుకుంటున్న డాక్టర్ కానూరి రామచంద్రరావు జింకానా తల్లీపిల్లల



శిశు వైద్య విభాగంలో కార్పొరేట్ లుక్‌లో కారిడార్

ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జీ ప్లస్ ఐదు అంతస్తులుగా 600 పడకల సామర్థ్యంతో ఈ బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యంత అధునాతనరీతిలో ఆధునిక వైద్య పరికరాలతో స్త్రీ, ప్రసూతి వైద్య విభాగంతో పాటు శిశు వైద్యం, శిశు శస్త్రచికిత్స విభాగాలను ఈ నూతన భవనంలో ఏర్పాటు చేశారు. స్త్రీ, ప్రసూతి విభాగంలో 320 పడకలు, శిశు వైద్య విభాగానికి 200 పడకలు, శిశు శస్త్రచికిత్స విభాగానికి 80 పకడకలు కేటాయించారు. 9 అధునాతన ల్యామినార్ ఫ్లో మాడ్యులార్ ఆపరేషన్ థియేటర్లు, వైద్యబోధన కోసం 350 సీట్ల కెపాసిటీతో ఆడిటోరియం నిర్మించారు. రూ.100 కోట్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకోసా) రూ.10 కోట్లు, జింకానా రూ.84 కోట్లు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చింది.

ఎన్నారైల రాక..

జింకానా అధ్యక్షుడు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని, డాక్టర్ బాబు రెడ్డి సాగిరెడ్డి, కో-ఆర్డినేటర్లు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ వి. బాలభాస్కరావు తదితరులు తుది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కానూరి జింకానా తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉత్తర అమెరికా నుంచి వందలాది మంది ఎన్నారై డాక్టర్లు గుంటూరుకు చేరుకున్నారు. జింకానా పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ ఉమాదేవి గవిని రూ.20.60 కోట్లు ఈ ఆరోగ్య కేంద్రానికి విరాళంగా ఇవ్వడంతో, ఆమె భర్త డాక్టర్ కానూరి రామచం ద్రరావు పేరిట ఈ కేంద్రానికి నామకరణం చేశారు. ఈ తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం అందుబాట్లోకి వస్తే గుంటూరు జిల్లాకే కాకుండా కోస్తా ఆంధ్ర జిల్లాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కేంద్రంలో నవజాత శిశువుల కోసం మదర్ బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్, కంగారూ మదర్ సెంటర్లను కూడా నిర్మించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ కే మయూర్ అశోక్

విరాళ దాతలు

జింకానా సభ్యులు డాక్టర్ నళిని, వెంకట్ తేళ్ల రూ.8 కోట్లు, రమాదేవి వాసిరెడ్డి, వెంకట్రావు కొండ్రగుంట రూ.4.32 కోట్లు, వేదవతి, వెంకటేశ్వరరావు ముమ్వా రూ.4.04 కోట్లు. తెలికచర్ల, గుడిమెడ కుటుంబాలు రూ.3.60 కోట్లు, లక్ష్మీ చౌదరి గంగ రూ.3.40 కోట్లు, బీనా నూతక్కి, గోపాలరావు తాతినేని రూ.1.93 కోట్లు, కృష్ణకుమారి, బాబురావు కాకాని రూ.1.72 కోట్లు, లక్ష్మీ, నరసింహరావు మాలేపాటి రూ.1.54 కోట్లు, జ్యోతి మట్ట, వెంకటరెడ్డి జొన్నల రూ.1.20 కోట్లు. సరస్వతి, వెంకట సుబ్బారావు ఉప్పులూరి రూ.1.08 కోట్లు విరాళంగా అందజేశారు. రమేష్, సురేష్ కాసరనేని రూ.కోటి, నవత, వెంకటేశ్వరరావు కర్నాటి రూ.కోటి, సూర్యకుమారి, వెంకటేశ్వర ప్రసాద్ కొండ్రగుంట రూ.కోటి, స్టార్ హాస్పిటల్స్ రూ.కోటి విరాళంగా అందజేశారు. మొత్తం మీద జింకానాకు చెందిన సుమారు 250 మంది సభ్యులు ఈ భవన నిర్మాణానికి తమ వంతు విరాళాలు అందించారు. గురువారం ప్రభుత్వాస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో దాతలందరినీ ఘనంగా సత్కరించారు. అనంతరం నిరంతర వైద్యవిద్య కార్యక్రమం నిర్వహించారు.

తెల్ల బంగారమే

(5వ పేజీ తరువాయి)

ధర కూడా ఈ ఏడాది బాగానే ప్రకటించింది. క్వింటాల్ పొడవాటి వేరు పత్తికి రూ.8,110, మధ్యస్థ వేరు పత్తికి రూ.7,710 నిర్ణయించింది. ఇదే ధర కోసం మొన్నటి దాకా రైతులు సీసీఐ కేంద్రాలు చుట్టూ తిరుగుతూ వచ్చారు. అయితే అక్కడ నాణ్యమైన పత్తితో పాటు, తేమ శాతం 8 నుంచి 12 శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో తుఫాన్ ప్రభావం వల్ల తేమ ఎక్కువగా ఉంటుందని రైతుల విజ్ఞప్తితో సీఎం చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. సీసీఐ నిబంధనలు సడలించాలని కేంద్రానికి లేఖ రాయడంతో రైతులకు లాభం చేకూరింది. ప్రస్తుతం అతి తక్కువ భాగంలో పత్తి తీయకుండా పెండింగ్‌లో ఉంది. ఎక్కువ భాగం పత్తితీత పూర్తయ్యింది. ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 4403 మంది రైతుల నుంచి 300393 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసి రూ.232 కోట్ల 84 లక్షలు చెల్లించింది. పల్నాడు జిల్లాలో 5323 మంది రైతుల నుంచి 355603 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.277 కోట్ల 11 లక్షలు చెల్లించింది.

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం

ప్రపంచవ్యాప్తంగా పత్తి ఉత్పత్తి కొన్ని దేశాల్లో తగ్గుముఖం పట్టడం, టెక్స్‌టైల్ పరిశ్రమలో ఆర్డర్లు పెరగడం వల్ల భారత పత్తికి డిమాండ్ పెరిగింది. ఆసియా దేశాల నుంచి ఎగుమతి ఆర్డర్లు పెరగడంతో దేశీయ మార్కెట్లో ధరలు దూసుకెళ్తున్నాయి. రానున్న రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జాబ్.. జాప్యం

(5వ పేజీ తరువాయి)

వివాదాస్పదం కావడంతో పోస్టులు ఇప్పటికీ నిరుద్యోగులకు దక్కలేదు. కానిస్టేబుల్ పోస్టులు ప్రకటించినా కూటమి ప్రభుత్వం వచ్చాకగానీ అవి భర్తీ కాలేదు. మెగా డీఎస్సీ పేరుతో ఐదేళ్లు ఊరించి చివరకు ఆరు వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ భర్తీ చేయలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీనికి తోడు ఉద్యోగార్థుల వయోపరిమితికి మినహాయింపును రద్దు చేసి వేలాది మందిని అనర్హులు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చి పద్దెనిమిది నెలలు పూర్తవుతోంది. కిందటేడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారని నిరుద్యోగులు ఆశించినా ప్రయోజనం లేకపోయింది. గత ప్రభుత్వంలో వేసిన నోటిఫికేషన్లను భర్తీ చేయడంతోపాటు, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మందికి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. సాధారణ డిగ్రీ పట్టాదారులకు మాత్రం పెద్దగా నోటిఫికేషన్లు రాలేదు. అటవీ శాఖకు సంబంధించిన మూడు నోటిఫికేషన్లలో 791 పోస్టులు మినహా మిగిలిన 10 నోటిఫికేషన్లు కలిపినా 100 పోస్టులు లేవు. దీంతో నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. 2026 జనవరిలో వచ్చే జాబ్ క్యాలెండర్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఐక్య పోరాటాలతోనే... హక్కుల సాధన

- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్
- ఘనంగా అఖిల భారత కిసాన్ సభలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభం నుంచి బయటపడేందుకు రైతులు మరో పోరాటానికి సిద్ధం కావాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో భాగంగా గురువారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వ్యవసాయ ఎగ్జిబిషన్ విజు కృష్ణన్‌తో కలిసి ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ శారదాజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించారు. వికసిత్ భారత్-2047 అనే అంశంపై విజూకృష్ణన్ కీలక ఉపన్యాసం చేశారు. వికసిత్‌లో పేదలు, రైతులు, కౌలు రైతులు, కార్మికులు, మహిళలు, వివిధ సామాజిక తరగతుల వారికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. కేవలం అంబాని, అదాని, టాటా, బిర్లా ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. కేరళ ప్రభుత్వం వరి రైతులకు క్వింటాలుకు రూ.3 వేలు కనీస మద్దతు ధర ఇస్తుంటే మోదీ ప్రభుత్వం రూ.2,389 ఇస్తోందన్నారు. ఉపాధి హామీ అమలు చట్టాన్ని సమూలంగా మార్పు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం భారం మోపి కేంద్రం క్రమంగా తన బాధ్యతల నుంచి తప్పు కుంటుందన్నారు. మహాత్మాగాంధీ పేరును తొలగించి జి రామ్ జీ పేరును పెట్టి పేదలకు ఉపయోగపడే ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. మోదీ హయాంలో ప్రజాస్వామ్య వ్యవస్థలపైనా, రాజ్యాంగంపైనా దాడి జరుగు తోందని.. దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు మరో ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఎన్జీరంగా వీసీ శారదా జయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ వ్యవసాయాన్ని విస్మరిస్తే స్వర్ణాంధ్ర సాధ్యం కాదని, వెలిగొండ, వరికపూడిశెల, గుంటూరు చానల్ వంటి ప్రాజెక్టులు చేపట్టి సాగుకు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన కౌలు చట్టాన్ని మారు స్తామని చెప్పిన వ్యవసాయం శాఖ మంత్రి అచ్చెన్నాయుడు 18 నెలలుగా ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

శారదా జయలక్ష్మి ప్రసంగిస్తూ రైతుల హక్కులను కాపాడుకోవడం కోసం, కష్టాల్లో ఉన్న వారికి ఓదార్పును ఇవ్వడం కోసం ఈ సంస్థలు కృషి చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్లు రావూరు వీర రాఘవయ్య, వేణుగోపాలరావు, రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్..

కిసాన్ సభ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల ప్రదర్శన అట్టహాసంగా ప్రారంభమైంది. వీసీ శారదా జయలక్ష్మి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విజు కృష్ణన్, కేఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాలలు, కళాశాల విద్యార్థులు రైతుల కోసం రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. లలిత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



అలనాటి మేటి నటి, ఎన్టీఆర్‌ను చిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన నిర్మాత కృష్ణవేణి జీవితకథను 'మీర్జాపురం రాణి.. కృష్ణవేణి' పేరుతో సీనియర్ జర్నలిస్ట్ భగీరథ రచించారు. ఈ పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి కుమార్తె అనూరాధదేవి, నందమూరి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్ధన్, నిర్మాత డీవీకె రాజు పాల్గొన్నారు.

రీమేక్స్ మనకు కొత్త కాదు




- సృజన్ యరబోలు

'అందరూ 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రాన్ని రీమేక్ అని అంటున్నారు. నిజానికి రీమేక్స్ మనకు కొత్త కాదు. రాజమౌళి గారు రామాయణం తీస్తే రీమేక్ అని అనలేం కదా? ఎంతో ఆసక్తిగా చూస్తాం. అలాగే ఇది కూడా మళ్లీ మళ్లీ చూడాలనుకునే కథ' అని అన్నారు నిర్మాత సృజన్ యరబోలు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా ఏ.ఆర్.సజీవ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రమిది. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మొదటి నుంచీ నేను కంటెంట్‌తో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాల వైపు దృష్టిపెట్టాను. ఈ సినిమా కూడా అందరికీ రిలేట్ అయ్యే కమర్షియల్ ఎంటర్‌టైనర్. తర్వాత చేయబోయే సినిమాలు కూడా ఇలాగే ఉంటాయి' అని చెప్పారు.

వేధింపులు వాస్తవమే..

తమ్మారెడ్డి భరద్వాజ



తెలుగు పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ లేదని మెగాస్టార్ చిరంజీవి అనడం.. దానికి బదులుగా ఇండస్ట్రీలో ఈ సమస్య ఎక్కువగా ఉందని గాయని చిన్మయి పేర్కొనడం తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. ఆయన చిత్రజ్యోతితో మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో వేధింపులు ఉన్నాయనేది వాస్తవమే. అయితే ఇది అందరూ చేస్తున్నారని కాదు. ఇది తెలుగు సినీ పరిశ్రమ ప్రారంభం నుంచి ఉన్న సమస్యే. పరిశ్రమలో ఏడాదికి దాదాపు 250 చిత్రాలు నిర్మితమవుతుంటాయి. ఓ 30 లేదా 40 సినిమాలు మాత్రం మహిళలను ఇలా వాడుకోవడానికి తీస్తున్నవే. ఇది కాదనలేని వాస్తవం. కాస్టింగ్ కౌచ్ గురించి చిన్మయి చెప్పింది నిజమే. లైంగిక వాంఛలు తీర్చుకోవాలని చూసే ధోరణి పరిశ్రమలోని ఒకరిద్దరు పెద్దల్లో ఉంది' అని పేర్కొన్నారు.

తిరుపతి లడ్డూ తయారీలో కెమికల్స్ కలిపారు

రూ.300కోట్ల కుంభ కోణం జరిగింది: యరపతినేని



లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అతి ముఖ్య పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యికి బదులు కెమికల్స్ వాడి వెంకటేశ్వరస్వామిని, హిందువుల మనోభావాలను జగన్మోహన్‌రెడ్డి అండ్ కో ఫ్యాక్టరీ అపవిత్రం చేసిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. గురువారం మాచవరం మండలంలోని మోర్జంపాడులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి 70వ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆయన దేవాలయానికి చేరుకొని నరసింహస్వామి ఆశీస్సులు పొందారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. 2019 - 2024 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో జరిగిన కల్తీ గురించి సుప్రీం కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిందన్నారు. సీబీఐ, సిట్ లడ్డూ తయారీలో అసలు నెయ్యి వాడలేదని, దానికి బదులు కెమికల్స్ వాడారంటూ కోర్టుకు నివేదించినప్పటికీ. వైసీపీ నాయకులు చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి లేనిపోని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కెమికల్స్ వాడటం వల్ల సుమారు మూడు వందల కోట్ల రూపాయల కుంభ కోణం జరిగిందని పేర్కొన్నట్లు చెప్పారు. విచారణలో అక్రమాలు సంపాదించే ధ్యేయంగా వైసీపీ నాయకులు పనిచేశారని తేలిందని యరపతినేని ఆరోపించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేసిందంటూ పేర్కొన్నారు. ప్రజలంటే అక్రమాలు చేయటం వల్ల 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారని, అయినప్పటికీ జగన్ రెండవ పరిపాలనలో ఎలా ఉంటుందో చూస్తారని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా మాట్లాడుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గుంటుపల్లి వెంకటేశ్వర్లు, గ్రామాధ్యక్షుడు కావూరి విచ్చయ్య, సీనియర్ నాయకులు దున్నా చెన్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కల్తీ నెయ్యి వ్యవహారంపై ఫ్లెక్సీలు

పిడుగురాళ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై పిడుగురాళ్లలో ఫ్లెక్సీలు వెలిశాయి. మహా పాపం నిజం అని పేరుతో వెలసిన ఈ ఫ్లెక్సీలను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కల్తీ నెయ్యి స్కాంతో కోట్ల రూపాయలు వైసీపీ నేతలు తమ జేబుల్లో వేసుకున్నారని, కల్తీ నెయ్యితోనే 20 కోట్ల లడ్డూ ప్రసాదాలు తయారు చేశారని ప్రచురించారు. పట్టణంలో పలుచోట్ల వెలిసిన ఈ ఫ్లెక్సీలపై వైసీపీ నేతలు అధికారుల ముందు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వైఎస్ కాదు.. కల్తీ జగన్మోహన్‌రెడ్డి

● తిరుమల ప్రసాదం కల్తీని కప్పిపుచ్చే ప్రయత్నాలు మానుకోవాలి
● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్
● వైకుంఠపురం ఆలయంలో పసుపు నీళ్లతో శుద్ధి



ఆలయాన్ని పసుపు నీటితో శుద్ధి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, కార్యకర్తలు

తెనాలి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని సర్వం కల్తీమయం చేశారని ఇంటి పేరు ఎడుగూరి సందింటి బదులు కల్తీ అని మార్చుకోవాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రసాదం కల్తీ అయినట్లు సిట్ నిగ్గు తేల్చినా.. సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. లడ్డూ కల్తీపై దర్యాప్తు సంస్థ సిట్ స్పష్టం చేయడంతో గురువారం వైకుంఠపురం ఆలయంలో పసుపు నీటితో శుద్ధి చేశారు. పూజలు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ నేతలు తిరుమల ప్రసాదం కల్తీ వ్యవహారాన్ని కప్పి పుచ్చే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. కల్తీ ఘనులకు తగిన శాస్తి జరిగినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. వైసీపీ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ రెచ్చిపోవడం భక్తులు గమనిస్తున్నారని, నాటికీ నేటికీ లడ్డూ నాణ్యత భక్తులందరికి తెలుసని చెప్పారు. పంచభూతాలను దోచుకున్న ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ అని.. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసింది కాక స్వామికి పంగనామాలు పెడదామనుకుంటే 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. కల్తీ చేసి చేయలేదని బొంకుతున్నారని కొవ్వుపట్టి మాట్లాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. పార్టీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, జెట్టి రేణుక, పాలడుగు సురేంద్ర, కోగంటి రోహిత్, అనిత, ఈదర పూర్ణచంద్, రమ్య, రావి చిన్ని, అశోక్‌వర్ధన, హరిప్రసాద్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలు లేకుండా
నెయ్యి తయారీ

● తల్లి పాలు కూడా కల్తీ చేయగల దుర్మార్గులు
● స్వామి వారికి ద్రోహం చేయలేదని ప్రమాణం చేయగలరా?
● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం లడ్డూ తయారీలో కల్తీ చేయలేదని, స్వామి వారికి ద్రోహం చేయలేదని వైసీపీ నేతలు ప్రమాణం చేయగలరా అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉండగానే అనుమానం వ్యక్తం చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గుర్తుచేశారు. పాలు లేకుండా నెయ్యి తయారు చేయడం ఏంటని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు నిజం నిగ్గుతేల్చిందన్నారు. నెయ్యిలో కల్తీ జరిగిందని, ఆ కల్తీ నెయ్యితోనే స్వామివారికి ప్రసాదాలు తయారు చేశారని సిట్ చార్జిషీటు ద్వారా బట్ట బయలైందన్నారు. ఇందుకు వైసీపీ నేతలు ఏం సమాధానం చెపుతారని ఆయన నిలదీశారు. తల్లి పాలు కూడా కల్తీ చేయగల దుర్మార్గులు వైసీపీ నేతలు అంటూ మండిపడ్డారు. తప్పు చేయకపోతే బెయిల్ కోసం వైసీపీ నేతలు కోర్టుకు ఎందుకు వెళ్లారని.. ఆయన ప్రశ్నించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా అందులో 60 లక్షల కిలోలు కల్తీ జరిగిందన్నారు. హిందూ సాంప్రదాయాలను జగన్‌మోహన్‌రెడ్డి కాల రాశారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తప్పు తెలుసుకొని స్వామి వారిని క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.

కల్తీ నెయ్యితో జగన్ తరతరాలకు.. తీరని అపచారం

● ఎమ్మెల్యే ఆనందబాబు



భక్తులు, మహిళలతో కలిసి ర్యాలీలో ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వాడడం ద్వారా జగన్ తరతరాలకు తీరిన మహాపచారం చేశాడని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. గురువారం అమృతలూరులో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిన విషయంపై సిట్ నివేదిక నేపథ్యంలో మహిళలు, భక్తులతో కలిసి ర్యాలీగా వెళ్లి అమృతేశ్వరస్వామి దేవాలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లడ్డూలో నెయ్యి వాసన రావడం కోసం రసాయనాలు వినియోగించారన్నారు. 2019-2024 మధ్య కాలంలో 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యి ఈ లడ్డూ తయారీ, ప్రసాదాల్లోనూ వినియోగించారన్నారు. ఎన్‌డీడీబీ వంటి సంస్థలు చేసిన పరీక్షల్లో ఈ లోపాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పలు సంస్థలతో పాటు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణకరరెడ్డి లాంటి వ్యక్తులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని.. రూ.234 కోట్ల మేర వెంకటేశ్వరస్వామికి ఆర్థిక నష్టం కలిగించారని విమర్శించారు. దీనిపై ఇంకా లోతైన దర్యాప్తు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, గంగాధర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, బొల్లు రామేశం, కొసరాజు దేవకుమార్, గుత్తికొండ శాంతకుమారి పాల్గొన్నారు.

వైసీపీ..జడ్పీకి రూపాయి ఇవ్వలేదు

● నిబంధనలకు లోబడే కేటాయింపులు
● సర్ చార్జీ విడుదలకు ప్రయత్నం
● ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



గుంటూరు సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అధికారంలో ఉన్నంతకాలం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా తెలిపారు. అప్పటి ప్రభుత్వం న్యాయ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా రూ. కోట్లలో బకాయి పెట్టిందని వెల్లడించారు. గురువారం జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్న ఆర్థిక పరిస్థితికి గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి మాత్రమే కారణమని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ నిధుల వినియోగం పూర్తిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతోందని చెప్పారు. పనుల కేటాయింపులోనూ, నిధుల లభ్యతను పూర్తిగా పరిగణలోకి తీసుకున్నామని చెప్పారు. సర్‌చార్జి బకాయి కోసం మంత్రి అనగానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. బకాయిలన్నీ విడుదల చేస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జిల్లా పరిషత్ ఆర్థిక పరిస్థితిని క్రమంగా పటిష్టం చేస్తూ, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, అభివృద్ధి పనుల బకాయిలను దశల వారీగా పరిష్కరిస్తోందన్నారు. ఇప్పటికే పలువురు సరఫరా దారులకు, కాంట్రాక్టర్లకు చెల్లింపులు పూర్తయ్యా యని, మిగిలినవీ త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని ఛైర్‌పర్సన్ చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పారదర్శకంగా పాలన సాగిస్తున్న పరిషత్ పాలనపై రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

4,300 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం 4,300 మిరప టిక్కీల అమ్మకం జరిగాయి. యార్డుకు 4,700 మిరప టిక్కీలు వచ్చాయి. 334 రకం రూ.10వేలు నుంచి రూ.22వేలు, తేజా రకం రూ.9వేలు నుంచి రూ.19వేలు, తాలు కాయలు రూ.3 వేలు నుంచి రూ. 9 వేలకు అమ్మకం జరిగాయి.

యూజీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది అక్టోబర్, నవంబర్‌లో నిర్వహించిన బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఏఓఎల్ 3వ సెమిస్టర్ ఫలితాలను గురువారం యూజీ పరీక్షల నిర్వహణాధికారి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను ఏఎన్యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

అజిత్ పవార్‌లేని లోటు తీర్చలేనిది

● మంత్రి అనగాని సత్యప్రసాద్



అజిత్ పవార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

రేపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ప్రభుత్వానికి అజిత్ పవార్ లేని లోటు పూడ్చలేనిదని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మంత్రి నారా లోకేశ్‌తో కలిసి బారామతి వెళ్లి.. అజిత్ పవార్ మృత దేహానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళులర్పించారు. రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగి ప్రజలకు ఎనలేని సేవలు అందించి ప్రజానాయకుడుగా పేరుగాంచిన అజిత్‌పవార్ మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

మంత్రి సత్యకుమార్‌పై
దాడి చేసిన వ్యక్తి అరెస్టు

తుళ్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై 2023లో దాడి చేసిన వారిలో 17వ నిందితుడిని తుళ్లూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి, కోర్టులో హాజరపరిచారు. తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. అమరావతి ఉద్యమం నేపథ్యంలో మందడంలోని ధర్నా శిబిరంలో రైతులను సత్యకుమార్ పరామర్శించారు. అదే సమయంలో తాళ్లాయపాలెం సీడ్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు అనుకూలంగా.. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో కొందరు ధర్నా చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో సత్యకుమార్ కారుపై మాజీ ఎంపీ నందిగం సురేష్, అతని అనుచరులు దాడి చేశారు. దీంతో సత్యకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై అప్పడే సత్యకుమార్ అసిస్టెంట్ ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నందిగం సురేష్‌తో సహా మొత్తం 17మంది దాడిలో పాల్గొన్నారు. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలు కూడా స్పష్టంగా పేర్కొనలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఐ కొంకా శ్రీనివాసరావు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిందితుల పూర్తి వివరాలు సేకరించారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి.. నిందితుల్లో ఒకరైన తాళ్లాయపాలెం గ్రామానికి చెందిన గడ్డ జాన్‌ను గురువారం అరెస్టు చేశారు. మంగళగరి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

వీవీఐటీయూలో యుఫోరియా చిత్ర బృందం సందడి



విద్యార్థులతో మాట్లాడుతున్న దర్శకుడు గుణశేఖర్

పెదకాకాని, జనవరి 29(ఆంధ్రజ్యోతి): భూమిక చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన యూత్ ఒరియంటెడ్ సోషల్ ఫాంటసీ చిత్రం యుఫోరియా చిత్ర బృందం వీవీఐటీలో గురువారం సందడి చేసింది. ఫిబ్రవరి 6న చిత్రం విడుదల నేపథ్యంలో వర్సిటీలో ప్రచారం చేపట్టింది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ కల్చర్, టీనేజ్ సమస్యల కథాంశంగా చిత్రాన్ని తెరకెక్కించినట్లు చెప్పారు. కమర్షియల్ ఫార్మాట్‌లో అలరిస్తూనే సందేశాన్ని అందిస్తుందన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని, ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నటీనటులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

ఫోన్‌పే క్యూఆర్ కోడ్ మోసం

● 3 నెలలకు గుర్తించిన పండ్ల వ్యాపారి

పిడుగురాళ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణంలో రహదారి వెంట పండ్లను విక్రయించే రెంటాల శ్రీను సరికొత్త మోసానికి గురయ్యాడు. కొంత కాలంగా కొనుగోలుదారులు అతనికి ఫోన్ పే ద్వారా నగదు చెల్లిస్తున్నా.. బ్యాంకు ఖాతాకు జమ కాలేదు. ఖాతాలో బ్యాలెన్స్ పెరగకపోవడంతో అనుమానం వచ్చి ఫోన్ పే క్యూఆర్ కోడ్‌ను పరిశీలించగా.. మరో క్యూఆర్ కోడ్ ఉండటాన్ని గమనించాడు. మూడు నెలలుగా పండ్లు కొనుగోలు చేసిన వారంతా వేస్తున్న నగదు మరో వ్యక్తి ఖాతాకు వెళ్తున్నట్లు గుర్తించి గురువారం పోలీసులను ఆశ్రయించాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

మిర్చియార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	93,040	
అమ్మకాలు	90,143	
నిల్వ	20,457	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	23000
దేవనూరు డీలక్స్	14500	25500
ఆర్మూరు	12000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21000
నెంబరు. 5	13500	21500
273	----	----
341	13000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19500
బ్యాడిగి 355	13500	22000
దేవనూరు డీలక్స్	---	---
తాలుకాయలు	7000	10800

వినుకొండ బ్రాంచ్‌లో భోక్తలపై చర్యలు

● జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన



సమావేశంలో ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సీఈవో ఫణికుమార్

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వినుకొండ బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ నివేదిక ప్రకారం భోక్తలపై చర్యలు తీసుకుంటామని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం బ్యాంకు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వినుకొండ బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ నివేదిక అందిందన్నారు. నివేదిక ఆధారంగా ఫిబ్రవరి నెలాఖరులో జరిగే సమావేశంలో భోక్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. అలానే బ్యాంకు రుణాలపై పూర్తిస్థాయిలో సమీక్ష చేశారు. బ్యాంకు డిపాజిట్లను పెంచి అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. మొండి బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వసూళ్లపై ఇప్పటికే ఇన్‌చార్జీలను నియమించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వచ్చే నెల 26 లేదా 27 తేదీల్లో బ్యాంకు జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం శరత్, బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, బ్యాంకు అధికారులున్నారు.

రూ.99కే అల్పాహారం, భోజనం

● మిర్చియార్డులో భోజన టెండర్ ఖరారు
● రూ.88కే సరఫరాకు ముందుకొచ్చిన ఎల్1 బిడ్డర్
● అందుకు అంగీకరించని జాయింట్ కలెక్టర్
● పెరిగిన ధరల నేపథ్యంలో ఎల్2కు అవకాశం



టెండర్ బాక్సుకు సీలు వేయిస్తున్న సెక్రటరీ చంద్రిక

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో ప్రస్తుత సీజన్‌లో నిత్యం రైతులకు ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సరఫరా టెండర్‌ని అధికార యంత్రాంగం ఖరారు చేసింది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు టెండర్ షెడ్యూల్స్‌ని స్వీకరించింది. సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ సమక్షంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి చంద్రిక సీలు టెండరు బాక్సుని తెరిచి దాఖలు చేసిన షెడ్యూల్స్‌ని పరిశీలించారు. మొత్తం 11 మంది టెండర్ షెడ్యూల్స్ తీసుకోగా వారిలో తొమ్మిదిమంది మాత్రమే వాటిని దాఖలు చేశారు. అతి తక్కువగా ఎల్1 బిడ్డర్ రూ.88కే తాను అల్పాహారం, మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తానని ముందుకొచ్చారు. అనూ మెస్ సంస్థ రూ.99కి సరఫరా చేస్తామని ఆసక్తిని తెలియజేసింది. ఉదయం ఇడ్లీ, టమాట్ బాత్/పొంగల్ చట్నీ, సాంబారు, టీతో సరఫరా చేయాల్సి ఉండటం, మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని రైతులకు కడుపు నిండా పెట్టాల్సి ఉంది. అలానే ఏజెన్సీ జీఎస్‌టీ, ఐటీ చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొన్న జేసీ శ్రీవాస్తవ రూ.88కి టెండరు ఖరారు చేస్తే రేపటి రోజున సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఎల్2 బిడ్డర్ రూ.99 టెండర్‌ను ఈ ఏడాది అల్పాహారం, భోజనం సరఫరాకు ఎంపిక చేశారు. గతేడాది ఒక్కో రైతుకు అల్పాహారం, మధ్యాహ్న భోజనానికి రూ.132 చొప్పున మిర్చి యార్డు తరుపున చెల్లించారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ తమకు భోజనం సరిగా పెట్టడం లేదని రెండు మూడు సందర్భాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటిది ఈ సంవత్సరం అదే కాంట్రాక్టర్ రూ. 88కే తాను సరఫరా చేస్తానని ముందుకు రావడంపై పలువురు అధికారులు సందేహించారు. అప్పటికి, ఇప్పటికి బియ్యం, వంట సరుకుల ధరలు ఏమి తగ్గలేదు. ఇంకా కొన్ని సరుకుల ధరలు పెరిగాయి. కూరగాయల ధరల్లో కూడా హెచ్చుదల కనిపిస్తోంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న జేసీ శ్రీవాస్తవ ఎల్1 బిడ్‌ని తిరస్కరించారు.

మెనూ ఇలా

మధ్యాహ్న భోజనం రైతుకు సరిపడా అన్నం, పప్పు, ఇగురు, వేపుడు, సాంబారు, కోడిగుడ్డు/అరటి పండు, వడియాలు, రోటి పచ్చడి, పెరుగు సరఫరా చేయాల్సి ఉంటుంది. మిర్చి యార్డుకు సరుకు తీసుకొచ్చే రైతుల పేర్లు గేట్ ఎంట్రీలోనే నమోదు అవుతాయి. తక్‌పట్టీ ఆధారంగా టోకెన్లను పంపిణీ చేస్తారు. రైతులు కాకుండా ఇతరులెవ్వరికి టోకెన్లు ఇవ్వరు.



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బొట్టు బొట్టులో కల్తీ.. శ్రీవారి లడ్డూ ప్రసాదం

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వేంకటేశ్వరుని ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపిన మహా పాపం నిజమని సాక్షాత్తూ కోర్టుకు సమర్పించిన సిట్ రిపోర్టు సాక్షిగా తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చుక్కపాలు లేకుండా రసాయనాలు, అపవిత్ర పదార్థాలతో లడ్డూలు చేసి కోట్లాది భక్తుల మనోభావాలను వైసీపీ దెబ్బతీసిందన్నారు. శ్రీవారి లడ్డూలో సువాసనలు వచ్చేందుకు బీటా కెరోటిన్ లాంటి రసాయనాలను కలిపినట్లు సిట్ నివేదికలో తెలిందన్నారు. ఈ కుంభకోణంలో రూ.250 కోట్ల టీటీడీ నిధులు దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా, కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసినట్లు నివేదిక వివరించిందన్నారు.

ఆర్టీసీ అధికారులు మొండి వైఖరి విడనాడాలి

● బస్టాండ్‌లో ఈయూ ఉద్యోగుల నిరసన

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై గుంటూరు-1 డిపో అధికారుల మొండి వైఖరి విడనాడాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగుల నిరసన కార్యక్రమం గురువారం కొనసాగింది. ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నినాదాలతో నిరసన తెలియజేశారు. డిపో అధికారులు ఉద్యోగులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, చార్ట్‌లో కూడా నిబంధనలు పాటించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇదే విధంగా మొండిగా వ్యవహరిస్తే ఫిబ్రవరి 2 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి జె.రత్నాకర్, జోనల్ నాయకులు గేరా ప్రకాష్, ఖాసిం నాగయ్య, కృష్ణవేణి, ఎస్.వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, ఎమ్ఎస్ ప్రసాద్, గంగమ్మ తదితరులున్నారు.

కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్‌గా విజయ్‌కుమార్

కాంగ్రెస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్‌గా తాడికొండకు చెందిన చిలకా విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చిలకా విజయ్‌కుమార్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన్ను జిల్లా అధ్యక్ష పదవి నుంచి అర్ధాంతరంగా తొలగించటంపై కూడా విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాల కోఆర్డినేటర్ల నియామకాల్లో భాగంగా గుంటూరు జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా చిలకా విజయ్‌కుమార్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు గుంటూరుకు చెందిన గడ్డం పాల్‌విజయ్‌ను నంద్యాల జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవటం హర్షణీయం

గుంటూరు సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గతంలో జీవో నెం 1207 కింద తొలగించిన 730 మంది హెల్త్ అసిస్టెంట్లను సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తిరిగి విధుల్లోకి తీసుకోవడం హర్షణీయమని తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, న్యాయస్థానం తీర్పును గౌరవిస్తూ వెంటనే చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయిన హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాలకు న్యాయం జరిగినట్లయిందని వారు పేర్కొన్నారు.

ఏసీ చంద్రశేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు సతీష్‌శర్మ

గుంటూరు: శ్రీశైలంలో 120 ఏళ్ళ చరిత్ర కలిగిన అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన సత్రాన్ని గురువారం అర్ధాంతరంగా కూల్చివేయటంపై శ్రీశైలం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి నోటీసు లేకుండా, కనీసం కమిటీ వారికీ సమాచారం ఇవ్వకుండా దౌర్జన్యంగా సత్రం కాంపౌండ్ వాల్ పడగొట్టటమే కాక, సత్రం సిబ్బందిపై దుర్భాషలాడారన్నారు. ఈ ఘటనను యావత్ బ్రాహ్మణజాతి ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు.

యువత ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారాలి

● పారిశ్రామికవేత్త వెలగపూడి కృష్ణకుమారి

గుంటూరు విద్య: సాంకేతికత సహకారంతో వ్యాపారరంగంలో విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి కృష్ణకుమారి పిలుపునిచ్చారు. చౌడవరం లోని ఆర్వీఆర్‌జేసి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రొడక్ట్ కాస్ట్ ఎఫెక్టివ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఫర్ స్టార్టప్స్ అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. స్టార్టప్స్‌పై అవగాహన కల్పిస్తూ, వ్యాపార రంగంలో వివిధ సాంకేతిక అంశాల పాత్రను వివరించారు. కొత్త ఆలోచనలతో ముందుకు సాగితే విజయాలు సులభంగా సాధ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్‌వీపీ చంద్రశేఖర్ రావు, డాక్టర్ శోభా, డాక్టర్ ఆలపర్తి ముద్దు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృష్ణప్రియ కృషి అభినందనీయం

గుంటూరు (విద్య), జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ చేస్తున్న కృషి అభినందనీయమని జలగం రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నూతలపాటి వేణుగోపాలరావు అన్నారు. 36 సంవత్సరాలు పాటు బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన కృష్ణప్రియను గురువారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ, కృష్ణప్రియ పాఠశాలలో వాటర్‌ప్లాంట్, బాలికల బాత్రూంలు, ఇతర మౌలిక సౌకర్యాలు ఏర్పాటుకు చేయూతనిచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు విజయానంద్, నూతలపాటి అశ్విని, వి.గిరిధర్‌కృష్ణ, ఎం.రాజశేఖర్‌కృష్ణ నీలై తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ వసూళ్లు సమర్థంగా నిర్వహించాలి

● ఇందుకు ప్రభుత్వ శాఖలు సహకారం అందించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ వసూళ్ల సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు వాణిజ్య పన్నుల శాఖకు సహకరించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె వాణిజ్యపన్నులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, ఇంజనీరింగ్, విద్యా, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు డివిజన్ జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి జీఎస్టీకి సంబంధించి వివిధ శాఖలు అందించాల్సిన సమాచారం గురించి పీపీపీ ద్వారా వివరించారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, డీపీవో సాయికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాదు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీఈవో సలీం భాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కల్యాణచక్రవర్తి, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటరత్నం, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్‌ఈ హజరతయ్య, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసులు, తెనాలి మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

సాయుధ దళాల త్యాగాలు వెలకట్టలేనివి

దేశం కోసం సాయుధ దళాలు చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్, సైనిక బోర్డు గుంటూరు చైర్మన్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. గురువారం స్థానిక గుంటూరు వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఎన్‌జీవో హాల్‌లో 10వ సాయుధ దళాల వెటరన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యుద్ధ క్షతగాత్రులు కోటిరెడ్డి, బీఎస్ శ్రీనివాసరావు, వీరమాతలు కొల్లి జానకి, విజయలక్ష్మి, యుద్ధ వితంతువులు డి.అన్నపూర్ణ, బి.వెంకటలక్ష్మి, చిట్టిమడుగుల నవీన, షహనాజ్ కానుమ్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సైనిక సంక్షేమ మాజీ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకట రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఆర్ గుణ షీల, సైనిక సంక్షేమ డైరెక్టర్ సత్య ప్రసాద్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నీరజ్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, జిల్లా మాజీ సైనిక సంక్షేమాధికారి ఎం.హనుమంతరావు, మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



బాల్య వివాహ విముక్తి రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

బాల్య వివాహ విముక్తి రథం ప్రారంభం

బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ప్రారంభించారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాలో క్రాఫ్ రూపొందించిన బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

శ్రీవారి లడ్డూ కల్తీ వైసీపీ దుర్మార్గాలకు పరాకాష్ఠ

● మేయర్ కోవెలమూడి రవీంద్ర, పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్వామివారి లడ్డూను కూడా కల్తీ చేయడం వైసీపీ దుర్మార్గాలకు పరాకాష్ఠ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. వైసీపీ పాలనలో తిరుపతి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకాన్ని నిరసిస్తూ జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ తదితర నాయకులు నిరసన ర్యాలీలో పాల్గొని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంప్రోక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, పానకాల వెంకటమహాలక్ష్మి, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, కొమ్మినేని కోటేశ్వరరావు, సొపాటి రత్నం, ముత్తినేని రాజేష్, ఏమినేటి లక్ష్మీశైలజ, లామ్ నవమి, శనక్కాయల రాజకుమారి, తాటి శంకర్, గంటా మౌళిక, మేళం ఆనంద్ మోహన్, కొనకళ్ల సత్యనారాయణ, వేములకొండ శ్రీనివాస్,గుడిమెట్ల దయారత్నం, పాటిబండ్ల బలరాం, షేక్ రుస్తుంబాబు, ఉప్పుటూరి పేరయ్య, పంచుమర్తి కల్పన పాల్గొన్నారు



బృందావన్‌గార్డెన్స్ శ్రీవారి ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్ నాని, పిల్లి మాణిక్యరావు, టీడీపీ నేతలు



జీజీహెచ్‌లో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో నూతనంగా నిర్మించిన మాతాశిశు సంరక్షణ భవనం ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జీజీహెచ్‌లో పర్యటించి ఆయా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్ వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవికుమార్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్, ఇతర సీఐలు, ఆర్‌ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికపాటి నరసింహారావు, హాజరైన ప్రజలు

వ్యాసభగవానుడే నిజమైన కులపతి

● డాక్టర్ గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాసభగవానుడే నిజమైన కులపతి అని మహాసహస్రావధాని, ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని శ్రీ రమ సత్యనారాయణ స్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాల్మీకి మహర్షి రచించిన యోగవాశిష్టంపై జరుగుతున్న ప్రవచం రెండో రోజు కొనసాగింది. డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచనం చేస్తూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలలో ఎక్కడెక్కడి నుంచో విద్యార్థులు ఎటువంటి ప్రయాణ సౌకర్యాలు లేని రోజులలోనే నడిచివచ్చి విద్యాభ్యాసం చేసేవారన్నారు. అసలైన విశ్వవిద్యాలయాలంటే అవేనన్నారు. నేడు సమాజంలో వీధికి ఒక విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసి వీధిబడులుగా మార్చారన్నారు. సంసారంలో సరసభాషణం అవసరమని పేర్కొన్నారు.

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం

స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో గురువారం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ పాలకమండలి సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి నిర్వహణలో భీష్మ ఏకాదశి సందర్భంగా గోష్ఠి సభ్యులతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మికవేత్త నారాయణం శేషుబాబు ప్రవచిస్తూ ఈ రోజున భీష్మున్ని స్మరిస్తూ, విష్ణు ఆరాధన చేస్తే జీవితంలో క్రమశిక్షణ, సత్యం, ధర్మాన్ని పాటించే ప్రేరణ పొందుతారన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుకు వార్షిక శిక్షణ

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సాయుధ (ఆర్మ్ రిజర్వ్) విభాగం జిల్లా పోలీస్ వ్యవస్థకు వెన్నెముక లాంటిదని, సాయుధ పోలీస్ బలగాల పనితీరు మెరుగుపరచడానికే వార్షిక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా ఆర్మ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బంది విధులలో నైపుణ్యం, క్రమశిక్షణను మరింత పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక మొబిలైజేషన్ (శిక్షణ) కార్యక్రమాన్ని గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ పరేడ్ మైదానంలో ప్రారంభించారు. ఏఆర్ డీఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమం రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ.హనుమంతు, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణ రెడ్డి, సురేష్, ఆర్‌ఎస్సైలు, ఆర్మ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ హనుమంతు

జీవో 36 వెంటనే అమలు చేయాలి

● సహకార ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

● మూడో రోజు వంటా వార్పు కార్యక్రమం

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల ప్రయోజనం కోసం తీసుకొచ్చిన జీవో 36 ను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనల్లో భాగంగా స్థానిక శ్యామలనగర్ సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం నిరసనలో భాగంగా ఉద్యోగులు వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొవ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 2019లో తీసుకొచ్చిన జీవో నెం 36ను ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. తక్షణమే దాన్ని అమలు చేసి ఉద్యోగులందరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 13న కార్యాలయాల ముట్టడి, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల సంఘ నాయకులు తోట వెంకట్రామయ్య, రామానాయుడు, చిరంజీవిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, హరికృష్ణ, ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వంటా వార్పు చేపట్టిన సహకార ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

సీబీఐ నివేదికలో జంతు కొవ్వు కలవలేదని స్పష్టం

● భక్తుల మనోభావాలను గాయపరిచిన సీఎం, డిప్యూటీ సీఎం

● విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డులో జంతు కొవ్వు కలవలేదని సీబీఐ నివేదిక స్పష్టంగా పేర్కొందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్ కేఆర్ విజయకుమార్ అన్నారు. గురువారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ భక్తుల మనోభావాలు దెబ్బతీశారని అన్నారు. వారు వెంకటేశ్వరస్వామి భక్తులకు బహిరంగ క్షమాపణ తెలపాలని డిమాండ్ చేశారు.



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్, వేదికపైన లక్ష్మణ రెడ్డి తదితరులు

● ధనవంతుల చేతుల్లోనే 40 శాతం సంపద

అనంతరం ఆర్థిక అసమానతల భారత్ అనే అంశంపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ గోష్ఠికి ప్రధాన వక్తగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ధనవంతుల చేతుల్లో 40 శాతం సంపద కేంద్రీకృతమై ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ఆర్థిక అసమానతలను మరింతగా పెంచే విధంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి, ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రంగయ్య, ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కేవీ చలపతిరావు, బీసీ మహాజన సభ అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, ప్రోగ్రెసివ్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి సంగిరెడ్డి హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. గురువారం గుంటూరు నగరంతోపాటు నరసరావుపేట, బాపట్ల, తెనాలి పట్టణాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ నెలకొంది. కొన్ని కార్యాలయాల్లో రాత్రి వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. రిజిస్ట్రేషన్‌ల రద్దీ కారణంగా సర్వర్‌పై ప్రభావం పడడంతో కొంత సమయం మొరాయించింది. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో ఇప్పటికే శుక్రవారం నాటి స్లాట్స్ అన్నీ బుక్ అయ్యాయి. సాధారణంగా శుక్రవారం పెద్దగా రిజిస్ట్రేషన్‌లు జరగవు అయినప్పటికీ రిజిస్ట్రేషన్‌లకు ముందుకువచ్చారు. ఇప్పటికే ఒప్పందాలపై ఉన్నవారు, అదేవిధంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సినవారు తొందరపడ్డారు. అలాగే శనివారం జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు మరింత కిటకిటలాడే అవకాశం ఉంది. వచ్చే నెల ఒకటి ఆదివారం కావడంతో ఫిబ్రవరి 2 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో చివరి రెండురోజులు ఆయా కార్యాలయాల్లో అత్యధిక సంఖ్యలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది. పరిస్థితి ముందే గమనించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

కళాకారుల పొట్టకొట్టొద్దు

● ఏపీ గ్రామీణ బ్యాంకు ఎదుట కళాకారుల నిరసన

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ప్రాతిపదికన కళాజాతల ప్రచారాల పద్ధతి అమలుతో పేద కళాకారుల పొట్టకొట్టొద్దని కళాకారుల సంఘం నాయకులు సతీష్ ఆధ్వర్యంలో పలువురు కళాకారు లు నిరసన తెలిపారు. బ్రాడీపేటలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు కళాకారులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనర్హులైన వారికి రూ.కోటి 25లక్షల కళాజాతల టెండర్ కేటాయించి, పేద కళాకారులకు అన్యాయం చేయటం సరికాదన్నారు. కళాజాతలపై టెండర్ ప్రక్రియ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. ఇప్పటికైనా బ్యాంకు చైర్మన్ తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఏజీఎం వీరారెడ్డి కళాకారులతో చర్చించి న్యాయంచేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీనివ్వగా.. కళాకారులు నిరసనవిరమించారు.

కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో చర్చకు రావాలి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి వ్యవహారంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సవాల్ విసిరారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని సుప్రీంకోర్టు నియమించిన సిట్ స్పష్టంగా నిర్ధారించిందని చెప్పారు. ఆ నెయ్యిని శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించడంతో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ అంశంపై వైసీపీ సభ్యులతో కలిసి జగన్‌రెడ్డి అసెంబ్లీలో చర్చకు రావాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

టీటీడీ లడ్డూల తయారీలో అవినీతి దుర్మార్గం

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ లడ్డూ ప్రసాదాల తయారీలోనూ అవినీతికి పాల్పడిన నీచ చరిత్ర వైసీపీదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక లాలాపేట వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు, కూటమి నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేసే నెయ్యిలో కల్తీకి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. కల్తీ నెయ్యి విషయంలో బుకాయించే అంబటి రాంబాబు తమ ప్రభుత్వంలో తప్పు జరగలేదని విషయాన్ని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్పగలరా అని ప్రశ్నించారు.

● ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జింకానా ఆర్థికసాయంతో నిర్మించిన తల్లీబిడ్డల ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు గుంటూరు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు.

విద్యతోనే అసమానతలు లేని సమాజం

● ప్రముఖ పారిశ్రామిక వేత్త చల్లా రాజేంద్రప్రసాదు



మాట్లాడుతున్న చల్లా రాజేంద్రప్రసాదు, పాల్గొన్న కేజేఎస్ఎస్ సభ్యులు

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అసమానతలు లేని సమాజం సాధ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త చల్లా రాజేంద్రప్రసాదు అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని కమ్మబాలికల వసతి గృహంలో గురువారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సభకు కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాద్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య సారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బిక్కసాని పూర్ణ, చైతన్య భారతి ట్రస్ట్ సీఈవో బాల మోహన్, ఎస్‌సీ మూర్తి, ప్రవాసాంధ్రుడు వీపీఎస్ సింగల్, సమితి కార్యదర్శి కన్నెంగంటి బుచ్చయ్య చౌదరి, ఉపాధ్యక్షుడు మాదాల రత్నగిరిబాబు, కోశాధికారి కావూరి రవిచంద్ర, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, పట్టాభి సీతారామారావు, మర్రిపూడి సీతారామయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు, పోసాని వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: వెస్ట్ ట్రాఫిక్ సీఐ

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య అన్నారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, వెస్ట్ ట్రాఫిక్ ఎస్సై నజీర్ సాహెబ్, సిబ్బంది గురువారం ఎంటీబీ సెంటర్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు.

తల్లిదండ్రుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

గుంటూరు (విద్య) జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరమని ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం అన్నారు. చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, ఉర్దూ పాఠశాలల ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, తల్లిదండ్రుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి సాధ్యమన్నారు. ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నసీమ బేగం ఉపాధ్యాయులు జప్నుల్ల ఖాన్, హబీబున్నిసా బేగం, బచ్చా బేగం, సాజిదాఖానం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు

గుంటూరు(తూర్పు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో గురువారం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు నిర్వహణలో సీతారాములకు పంచామృతాలతో అభిషేకం, తిరుమంజన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు పర్యవేక్షించారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తదితరులు


గుంటూరుకార్పొరేషన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ గురువారం తెలిపారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇజ్రాయెల్ పేట రైల్వే ట్రాక్ పక్కన గల ఖాళీ స్థలంలో గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. గంజాయికి బానిసలైన ఇజ్రాయిల్ పేటకు చెందిన సయ్యద్ భాష అలియాస్ చిన్న భాష, శారద కాలనీ చెందిన గుంజి గోపికృష్ణ గుంటూరు సీతానగర్‌లో నివాసముండే ముక్కోటి రాము వద్ద గంజాయి కొనుగోలు చేసి దాన్ని అమ్ముతూ పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

భార్య ప్రవర్తనతో విరక్తి చెంది భర్త ఆత్మహత్య

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భార్య ప్రవర్తనతో విరక్తి చెంది భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోర్లవారిపాలెంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, గోర్లవారిపాలెం గ్రామానికి చెందిన బొమ్మ వెంకటేశ్వరరావు(38)కు గరికపాడు గ్రామానికి చెందిన వేల్పూరు అనిత శివనాగవాణితో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇరువురు మగపిల్లలు సంతానం. మూడేళ్లుగా అనిత అదే గ్రామానికి చెందిన ముద్దుల నాగరాజుతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. నాగరాజుతో కలిసి గ్రామంలో తిరుగుతూ భర్త వెంకటేశ్వరరావును రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించింది. తనకు ఆస్తి ఎలా రాదో చూస్తానని బెదిరించింది. తమ ఇద్దరి మధ్య అడ్డుగా ఉన్న భర్త వెంకటేశ్వరరావును లేపేస్తానంటూ హెచ్చరికలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది వెంకటేశ్వరరావు పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంకటేశ్వరరావును గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు మృతి చెందాడు. తన కుమారుడు వెంకటేశ్వరరావు చావుకు భార్య అనిత, ఆమె ప్రియుడు నాగరాజే కారణమని మృతుడి తండ్రి నాగేశ్వరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
శుక్రవారం • 30 జనవరి 2026

హరేకృష్ణ



రేపు నిత్యానంద త్రయోదశి

హరినామప్రదాత

శ్రీచైతన్య గౌడీయ సంప్రదాయంలో శ్రీనిత్యానంద ప్రభువుకు ఉన్న స్థానం అద్వితీయమైనది. ఆయనను సాక్షాత్తూ బలరాముని అవతారంగా పరిగణిస్తారు. శాస్త్రాల విశ్లేషణ ప్రకారం బలరాముడు గురుతత్త్వానికి మూలపురుషుడు. కృష్ణుడి వివిధ లీలల్లో ఆయనకు తోడుగా నిలిచిన బలరాముడు... ఆ పరమాత్మ స్వరూపాన్ని భక్తులకు పరిచయం చేసిన ఆదిగురువు. శ్రీకృష్ణుడు కలియుగంలో చైతన్య మహాప్రభువుగా అవతరించినప్పుడు... ఆయనకు సంకీర్తనా యజ్ఞంలో తోడ్పడడం కోసం బలరాముడు శ్రీ నిత్యానంద ప్రభువుగా ఆవిర్భవించారు. మహా ప్రభువు చేపట్టిన హరినామ ప్రచారంలో నిత్యానందుల పాత్ర ఎంతో కీలకమైనది. 'శ్రీ చైతన్య భాగవతం', 'చైతన్య చరితామృత' లాంటి గ్రంథాలు ఆయనను 'బలరామ స్వరూపం'గా నిర్ధారించాయి.

కరుణకు ప్రతిరూపం

నిత్యానంద ప్రభువు కరుణామయుడిగా ప్రసిద్ధి చెందారు. ఆ కరుణతత్త్వం ద్వారానే ప్రజలకు చేరువయ్యారు. నవద్వీపధామంలో జగాయి, మధాయి అనే ఇద్దరు సోదరులు ఉండేవారు. వారు మద్యపానం, జూదం లాంటి దురలవాట్లకు లోనయ్యారు. అందరితోనూ అమర్యాదగా ప్రవర్తించేవారు. హింసా ప్రవృత్తితో భయపెట్టేవారు. వారిని ఉద్ధరించాలనే సంకల్పంతో శ్రీనిత్యానందుడు వారి వద్దకు వెళ్ళి, హరినామ సంకీర్తన చేయాలని కోరారు. మధాయి కోపంగా ఒక మట్టి కుండ పెంకుతో ఆయనపై దాడి చేశాడు. నిత్యానందుల నుదుటి నుంచి రక్తం ప్రవహించింది. అయినప్పటికీ ఆయన కోపగించుకోకుండా... "నన్ను కొట్టినా పరవాలేదు. ఒక్కసారి కృష్ణ నామాన్ని జపించండి" అని వేడుకున్నారు. ఈ వార్త తెలిసిన చైతన్య మహాప్రభువు ఆగ్రహంతో వారిని శిక్షించడానికి సుదర్శన చక్రాన్ని ప్రయోగించారు. నిత్యానందులు అడ్డుపడి, వారిని క్షమించాలని ప్రార్థించారు. ఈ అసమానమైన కరుణను చూసిన జగాయి తక్షణమే శరణాగతి పొందగా, మధాయి కూడా తన తప్పు తెలుసుకొని ప్రభువు పాదాలపై పడ్డాడు.

శ్రీ నిత్యానంద ప్రభువు ఆవిర్భవించిన రోజైన మాఘ శుద్ధ త్రయోదశిని 'నిత్యానంద త్రయోదశి'గా ప్రపంచవ్యాప్తంగా ఇస్కాన్, హరేకృష్ణ మందిరాలు నిర్వహిస్తాయి. భక్తులు మధ్యాహ్నం వరకు ఉపవాసం ఉండి... శ్రీ నిత్యానందుని కృప కోసం ప్రార్థిస్తారు. ఆలయాల్లో శ్రీచైతన్య, శ్రీ నిత్యానంద విగ్రహాలకు మహాభిషేకం, విశేష అలంకారాలు చేసి, వందల రకాల పిండివంటలతో రాజభోగ్ నైవేద్యం సమర్పిస్తారు. వాటిని ప్రసాదంగా స్వీకరిస్తారు. నిత్యానందుని లీలలు, ఆయన చూపిన కరుణ, భక్తిమార్గంపై పండితులు ప్రవచనాలు చేస్తారు. రాత్రి నగర సంకీర్తన, విందులతో కార్యక్రమాలు ముగుస్తాయి.


ఆది గురువు

మాయావాద సంప్రదాయంలో అగ్రగణ్యుడైన సార్వభౌమ భట్టాచార్య... జగన్నాథపురిలో శ్రీ చైతన్య మహాప్రభువును దర్శించి, శిష్యుడిగా మారారు. ఆయన శ్రీనిత్యానందులను 'హరినామ ప్రదం దేవం' అని కొనియాడారు. అంటే 'హరినామాన్ని ప్రసాదించే దైవం' అని అర్థం. బద్ధ జీవులకు (సంసారంలో బందీలు అయిన వారికి) హరినామాన్ని ప్రసాదించే ఆది గురువు శ్రీనిత్యానంద ప్రభువు. జీవాత్మను శ్రీ చైతన్య మహాప్రభువుకు, పవిత్ర హరినామానికి అనుసంధానం చేసే వారధి ఆయనే. తనను కలిసిన ప్రతి ఒక్కరికీ భగవత్ ప్రేమను ఎలాంటి వివక్ష లేకుండా పంచారు. ఆయనకు ప్రతినిధిగా విశ్వగురువు శ్రీల ప్రభుపాదులు అందించిన సూచనలు, ఆదేశాలను పాటించడం ద్వారా ఎవరైనా తమ జీవితంలో అత్యున్నతమైన ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందవచ్చు. సాధారణ జీవితం సైతం నిత్యానంద ప్రభువు కృపతో, శ్రీల ప్రభుపాదుల మార్గదర్శకత్వంతో శాంతియుతంగా, పరమానందభరితంగా మారుతుంది. 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించడం ద్వారా శ్రీకృష్ణుడిపట్ల అచంచలమైన భక్తి అనురాగం ఏర్పడతాయి. ఉన్నతమైన ఆ కృష్ణ చైతన్యంలో ఉన్న వ్యక్తి స్వార్థాన్ని విడిచిపెట్టి, పరోపకారమే పరమార్థంగా జీవిస్తాడు.

• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9640086664



"ఆధ్యాత్మిక ఆనందం అనంతమైనది. శాశ్వతమైనది. మానవ జీవిత లక్ష్యం మోక్షం. దాన్ని సాధించేవరకూ మానవులకు జనన మరణాలు తప్పవు. 'పునరపి జననం, పునరపి మరణం' అనే ఈ చక్రం కొన్ని వేల సంవత్సరాలుగా కొనసాగుతోంది. మనస్సు ఒక్కసారే జన్మిస్తుంది. ఒక్కసారే మరణిస్తుంది. అంటే మనస్సుకు మరో జన్మ ఉండదు. కాబట్టి నిరంతరం భగవన్నామస్మరణలో గడపాలి. దేవుడు ఎల్లవేళలా మీ ఎదుటే ఉన్నాడన్న ఎరుకతో ప్రవర్తించాలి" అని ప్రబోధించిన మహనీయుడు అవతార్ మెహెర్‌బాబా. తాను మానవ రూపధారినైన భగవంతుడిననీ, తాను ప్రత్యేకంగా ఎలాంటి మతం స్థాపించడానికి రాలేదనీ, అన్ని మతాలూ ఒక్కటేననీ, తన మతం ప్రేమ అనీ ప్రకటించారు.



లోక రక్షకుడు

మెహెర్‌బాబా

రేపు మెహెర్‌బాబా అమరతిథి

మహారాష్ట్రలోని పుణేలో 1894 ఫిబ్రవరి 25న మెహెర్‌బాబా జన్మించారు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు మేర్వాన్. పుణేలోని దక్కన్ కాలేజీలో చదువుకున్నారు. ఒక రోజు కళాశాలనుంచి ఆయన తిరిగి వస్తూ ఉండగా... వృద్ధురాలైన బాబాజాన్ ఆయన నుదుటిమీద ముద్దాడింది. దాంతో మేర్వాన్ ప్రపంచ చైతన్యం కోల్పోయారు. సద్గురువుగా మారారు. హజ్రత్ బాబాజాన్, షిరిడీ సాయిబాబా, ఉపాసినీ మహారాజ్, నారాయణ్ మహారాజ్, తాజుద్దీన్ బాబా తదితరులు మేర్వాన్‌ను సమస్త మానవాళిని ఆదుకొనే అవతార పురుషునిగా, భగవంతుని స్వరూపంగా కొనియాడారు. షిరిడీని మేర్వాన్ దర్శించుకున్నప్పుడు 'ఓ పర్వర్దిగార్' (ఓ లోకరక్షకా) అని షిరిడీబాబా ఆయనను సంబోధించారు. అనంతరం మేర్వాన్‌ను ఆయన శిష్యులు మెహెర్‌బాబా... అంటే 'దయగల తండ్రి' అని పిలవడం ఆరంభించారు. 1925 జూలై 10 నుంచి భౌతిక దేహం వదిలేవరకూ... నలభై నాలుగు ఏళ్ళపాటు మెహెర్‌బాబా కఠిన మౌన వ్రతంలో ఉన్నారు.

దేశంలో తొలిసారిగా...

1920వ దశకంలోనే పేదలకు కుష్టు రోగులకు సేవలు అందించడం కోసం ఉచిత వైద్యశాలను మెహెరాబాద్‌లో ఆయన స్థాపించారు. తరచూ కుష్టు రోగుల పాదాలు కడిగి, శిరస్సు వంచి పాదాభివందనం చేసి, కొంత డబ్బు, నూతన వస్త్రాలు ఇచ్చి పంపేవారు. 1925 మార్చిలో హజ్రత్ బాబాజాన్ పేరిట మెహెరాబాద్‌లోనే ఆశ్రమ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అస్పృశ్యత తీవ్రస్థాయిలో ఉన్న ఆ కాలంలో... అన్ని కులాలు, మతాలకు చెందిన 200 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించారు. 50 శాతం సీట్లను దళితులకు కేటాయించారు. స్కూలు యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. అలాంటి పాఠశాల ఆనాడు మన దేశంలో ఎక్కడా లేదు. మహాత్మాగాంధీ కూడా అప్పటికి అస్పృశ్యతా నివారణ కార్యక్రమాలు ఎక్కడా చేపట్టలేదు. అలాగే యావత్ మానవాళి కోసం 1952 నవంబర్‌లో, 1953 ఆగస్టులో విశేషమైన ప్రార్థనలు చేశారు. ఆ ప్రార్థనలు 'దేవుడు ఒక్కడే' అనే సత్యాన్ని చాటుతాయి. అలాగే మానవాళిని మేలుకొలపడానికి అనేక ప్రవచనాలు చేశారు. 'భగవద్వచనం', 'సర్వం-శూన్యం' తదితర గ్రంథాలను మౌనదీక్షలో ఉన్నప్పుడే రచించారు.

వ్యతిరేకి... విధేయుడయ్యాడు!

మెహెరాబాద్ ఆశ్రమ పాఠశాలలో ఢాకే ఫాల్కర్ ఉపాధ్యాయునిగా పనిచేసి, ఆ తరువాత ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. "టీచర్‌గా చేరడానికి ముందు రెండు షరతులు పెట్టాను. మిమ్మల్ని భగవంతుడిగా అంగీకరించననీ, నెలకు మూడొందల జీతం ఇప్పించాలనీ నేరుగా బాబాకే చెప్పాను. ఆయన అంగీకరించారు. అయితే ఒక రోజు... 'మెహెర్‌బాబా సాక్షాత్తూ భగవంతుడు' అని ప్రతిజ్ఞచేసి, ఆయనకు నమస్కరించాల్సిందిగా ఉపాధ్యాయులందరినీ స్కూలు మేనేజర్ ఆదేశించాడు. ఒక్కొక్కరూ ఆ ప్రకారం ప్రతిజ్ఞ చేశారు. నా వంతు వచ్చింది. నేను చేయనని చెప్పాను. మేనేజర్ అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. ఆ మాట బాబా చెవిన వేశాడు. "నాకు, ఢాకేకు మధ్య ఉన్నది యజమాని, ఉద్యోగి సంబంధం మాత్రమే. కాబట్టి ఢాకే గురించి పట్టించుకోవద్దు" అని మేనేజర్‌ను బాబా హెచ్చరించారు. "ఏదో ఒక రోజు అతను నన్ను భగవంతుడిగా అంగీకరిస్తాడు" అన్నారు. అదే నిజమయింది" అని ఢాకే తన స్వయంగా రాసుకున్నారు. మెహెర్‌బాబా శిష్య బృందంలో ఢాకే ఒక ముఖ్య కార్యకర్తగా మారారు. ఇలా బాబాను వ్యతిరేకించినవారు ఎందరో ఆయనలోని దైవత్వాన్ని తెలుసుకొని, సంపూర్ణంగా విధేయులు అయ్యారు.

ఏడు రోజులైనా తరగని వర్చస్సు

మెహెర్‌బాబా 1969 జనవరి 31న దేహత్యాగం చేశారు. ఆయన దేహాన్ని ఫిబ్రవరి ఏడో తేదీ వరకూ... ఏడు రోజుల పాటు భద్రపరిచి ఉంచారు. దానికి దగ్గరగా వరిపొట్టు చల్లిన ఐసు గడ్డలను ఏర్పాటు చేశారు.. ఫిబ్రవరి ఒకటిన అంత్యక్రియలు నిర్వహించాలని, లేకపోతే బాబా దేహంలో మార్పులు వస్తాయని వైద్యులు సూచించారు. కానీ తాము వచ్చేవరకూ బాబా భౌతిక కాయాన్ని ఉంచాలని విదేశాల్లో ఉన్న బాబా అనుయాయులు అనేకమంది అభ్యర్థించడంతో... ఏ రోజుకారోజు అన్నట్టు వాయిదా పడుతూ వచ్చింది. పార్సీయుడైన మెహెర్‌బాబా జన్మదినం జోరాస్టర్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి ఏడు కావడం విశేషం. ఆ ఏడు రోజులూ ఆయన ముఖవర్చస్సు పచ్చని పసిడికాంతులు వెదజల్లుతూనే ఉంది. మహారాష్ట్రలోని అహమ్మద్ నగర్ జిల్లా కేంద్రానికి అయిదు కిలో మీటర్ల దూరంలోని మెహెరాబాద్‌లో... చిన్న కొండపైన మెహెర్‌బాబా సమాధి ఉంది. దాన్ని తన స్వీయ పర్యవేక్షణలో... 1930వ దశకంలో మెహెర్‌బాబా స్వయంగా నిర్మించారు. ఆయన 57వ అమరతిథి వార్షికోత్సవాలు శనివారం జరగనున్నాయి.

• డాక్టర్ మల్లాది కృష్ణానంద్,
9959553218

దైవమార్గం

తొలి అద్భుతం

మానవ రూపంలో జన్మించిన దైవసుతుడైన ఏసు ప్రభువు తనలోని మానవాతీత శక్తిని ప్రకటించిన తొలి సన్నివేశం... ఒక పెళ్ళి విందు. బెత్లెహేములో జన్మించిన ఏసుక్రీస్తు ఆచూకీ తెలియకుండా... ఆ పసి శిశువుతో ఈజిప్టుకు వెళ్ళి, అక్కడ కొన్నాళ్ళు తలదాచుకున్నారు



ఆయన తల్లిదండ్రులు మరియా, యేసేపు. ఆ తరువాత తమ సొంత ఊరైన నజరేతుకు తిరిగి వచ్చి అక్కడే నివాసం ఏర్పరచుకున్నారు. కొన్నేళ్ళ తరువాత... గలిలియా తీరంలోని వారి ఇంటికి... కానా అనే ఊరుకు చెందిన దూరపు బంధువుల నుంచి ఒక పెళ్ళికి ఆహ్వానం వచ్చింది. అప్పటికి పెద్దవాడైన ఏసును ఆ పెళ్ళికి తనతోపాటు మరియా తీసుకువెళ్ళింది.

పెళ్ళికి వచ్చిన అతిథులకు విందులో భాగంగా ద్రాక్ష రసం ఇచ్చి గౌరవించడం ఆనాటి ఆచారం. అయితే, ఆనాటి విందులో ద్రాక్ష రసం అయిపోయింది. తమకు తగిన మర్యాదలు చేయలేదని అతిథులు భావిస్తే తన పరువు పోతుందనే ఆందోళనలో ఆ ఇంటి యజమాని ఉన్నాడు. వారి దయనీయ స్థితిని మరియా గమనించింది. ఆ విషయం ఏసుకు చెప్పి, "ఏం చేయాలి?' అంటూ బాధపడింది. ఆ పేద కుటుంబీకుల దీనావస్థను చూడలేక, తల్లి అభిమతం మేరకు... ఆరు పాత బానలను యేసు రప్పించాడు. వాటిలో నీరు పోయించాడు. ఆ నీటిని ద్రాక్షరసంగా మార్చాడు. అది ఎన్నడూ సేవించనంత రుచిగా ఉండడం చూసి... అతిథులు ఆశ్చర్యపోయారు. పెళ్ళి చేస్తున్న దంపతుల ఆనందానికి అవధులు లేవు. వారు యేసుకు మనసారా కృతజ్ఞతలు తెలుపుకొన్నారు.

'నీరు ద్రాక్షరసంగా ఎలా మారింది?' అనే ప్రశ్న గలిలియా సముద్రతీరంలో మారుమోగింది. ప్రభువులోని దైవత్వం ప్రజలకు కనిపించింది. అది ఆయన బహిరంగంగా ప్రదర్శించిన తొలి అద్భుతం. ఏసు వెంట ఉండే శిష్యులు ఆయన మహిమను అప్పుడు గుర్తించారు. ఆయనలోని శక్తిని బలంగా నమ్మారు. భూమిమీదకు ఏసు రాక... ప్రజల ఆధ్యాత్మికమైన అవసరాలు తీర్చడానికి. కానీ ఇటువంటి లౌకికమైన అవసరాలు కూడా ఆయన సమయానుసారం తీర్చాడు. తల్లి మాట ప్రకారం... తనలోని దైవత్వాన్ని ప్రదర్శించాడు. అంతేకాదు... పాత బానల్లో కొత్త నీరు నింపి, దాన్ని ద్రాక్ష రసంగా మార్చి... అప్పటివరకూ యూదామతంలో ఉన్న ప్రాచీన సంప్రదాయాలు 'ఇక చెల్లవు' అనే సందేశాన్ని ప్రతీకాత్మకంగా ప్రభువు చూపించాడంటారు పండితులు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

యోగా

ఉరుకుల పరుగుల నేటి ఆధునిక ప్రపంచంలో చాలామంది వ్యక్తులు నిరంతరం ఒత్తిడికి, నైతికమైన గందరగోళానికి, భావోద్వేగపరమైన అలసటకు గురవుతున్నారు. సాంకేతికంగా అపూర్వమైన పురోగతిని సాధించినప్పటికీ, అంతర్గతమైన శాంతి చాలా అరుదయిపోయింది. ఇలాంటి సమయంలోనే 'ధర్మం' అనే ప్రాచీన భావన ఆరోగ్యవంతంగా, అర్థవంతంగా జీవించడానికి ఒక ఆచరణాత్మకమైన సూత్రంగా సమయోచితమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ధర్మం

ధర్మం... ఒక జీవన సూత్రం

అంటే కఠినమైన నియమాలు లేదా సామాజికమైన నిర్బంధాలు అని తరచూ పొరపడుతూ ఉంటారు. వాస్తవానికి, తమతో, ఇతరులతో, ప్రకృతితో సామరస్యంగా జీవించడం గురించి అది సూచిస్తుంది. అది నిశ్శబ్దమైన అంతర్గత అవగాహన. మనల్ని రోజువారీ జీవితంలో నిజాయితీ, బాధ్యత, సమతుల్యత దిశగా అది నడిపిస్తుంది.



అంతర్గత సమన్వయం

ఒక కార్డియాలజిస్టుగా, తీవ్రమైన ఒత్తిడి, పరిష్కారం కాని అంతర్గతమైన ఘర్షణ, జీవితానికి లక్ష్యం లేకపోవడం అనేవి హైపర్‌టెన్షన్‌గా గుండె జబ్బులుగా, నిస్సత్తువగా ఎలా మారతాయనేది నేను నిత్యం గమనిస్తున్నాను. ఈ పరిస్థితులు కేవలం శారీరకమైనవి కావు. ఒక వ్యక్తి తన అంతర్గత విలువలకు దూరం అయిన స్థితిని అవి ప్రతిఫలిస్తాయి. మన చర్యలు నిరంతరం మనస్సాక్షిని ఉల్లంఘించినప్పుడు... హృదయం శారీరకంగా, మానసికంగా భారాన్ని మోయాల్సి వస్తుంది. గుండె లయను, రక్తపోటును, మొత్తంగా హృదయసంబంధమైన ఆరోగ్యాన్ని భావోద్వేగ స్థాయిలు తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఆధునిక సైన్స్ గుర్తించింది. ఆలోచనలు, అనుభూతులు, చర్యలు సమరేఖలో ఉన్నప్పుడు... శరీరం ఒక సమన్వయ స్థితిలోకి ప్రవేశిస్తుంది. ధర్మం ఒక కోణంలో అంతర్గత సమన్వయాన్ని సూచిస్తుంది. అది సరైన క్రియ సహజంగా ఉద్భవించే ఒక స్థితి. ధర్మం అనేది ఒక స్థిరమైన నియమావళి కాదు, అది ఒక వ్యక్తి పాత్ర, పరిస్థితి బట్టి పరిణామం చెందుతుంది. ఒక విద్యార్థి ధర్మం తల్లిదండ్రులు, వృత్తి నిపుణులు లేదా నాయకుడి ధర్మం కంటే భిన్నంగా ఉంటుంది. కానీ నిర్ణయాలు తీసుకునేటప్పుడు అవగాహన, సున్నితత్వం, బాధ్యత అవసరం అనే అంశం మాత్రం స్థిరంగా ఉంటుంది.

కాలం చెల్లిన భావన కాదు

ఆచరణాత్మకంగా చెప్పాలంటే, ధర్మం చిన్నవైన, చేతనతో కూడిన ఎంపికల ద్వారా వ్యక్తమవుతుంది. నిజాయితీగా మాట్లాడడం, నిజాయితీగా పనిచేయడం, న్యాయంగా వ్యవహరించడం, ఒత్తిడిలో కూడా దయను చూపించడం... ఇలాంటి చర్యలు అనిశ్చితమైన బాహ్య పరిస్థితులలో కూడా అంతర్గతమైన స్థిరత్వాన్ని సృష్టిస్తాయి. నిరాడంబరత్వం, అంతర్గతమైన నిశ్చలత ద్వారా హృదయాన్ని శుద్ధి చేసుకోవడం గురించి 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానం నొక్కిచెబుతుంది. భావోద్వేగపరమైన భారాలనుంచి విముక్తి పొందితే స్పష్టత పెరుగుతుంది, నైతికమైన ప్రవర్తన అప్రయత్నంగానే అలవడుతుంది. ఈ అంతర్గత స్థితి నుంచి ధర్మం మనమీద బలవంతంగా రుద్దినట్టు కాకుండా... సహజంగాసిద్ధంగానే మనలో ప్రవహిస్తుంది. కాగా, కేవలం చట్టాల ద్వారా మాత్రమే కొనసాగే సమాజం చివరకు దుర్బలంగా మారుతుంది. వ్యక్తులు భయంతో కన్నా అంతర్గత బాధ్యతతో వ్యవహరిస్తే నమ్మకం బలపడుతుంది, సామరస్యం ఏర్పడుతుంది. పరివర్తన చెందిన వ్యక్తుల ద్వారానే స్థిరమైన సామాజిక మార్పు ప్రారంభం అవుతుంది. ధర్మం కాలం చెల్లిన, వేరే యుగానికి చెందిన భావన కాదు. అది ఒక జీవన సూత్రం. ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యం, సమగ్రత, శాంతికి అది దోహదం చేస్తుంది. ధర్మంగా జీవిస్తున్నప్పటికీ సవాళ్ళు ఎదురుకావచ్చు, కానీ ధర్మం అంతర్గత ఘర్షణ నుంచి విముక్తి కలిగిస్తుంది. అది అందించే గొప్ప బలం... అంతర్గతమైన సామరస్యం.

డాక్టర్ శరత్‌రెడ్డి, కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532



కాలం సాక్షిగా

కాలం మనకు కనిపించదు. కానీ అది ఆగదు, వెనుతిరగదు. అది మన నవ్వుల్ని చూస్తూ పోతుంది. మన కన్నీళ్ళను లెక్క చెయ్యదు. మనల్ని అది పూర్తిగా మార్చేస్తూ ఉంటుంది. మనిషి కాలాన్ని గడియారంలో చూస్తాడు. కానీ కాలం మనిషిని జీవితంతో కొలుస్తుంది. విశ్వాసంతో ఉండడం, సత్కార్యాలు, సత్యోపదేశం, సహనబోధ చేసేవారు తప్ప మిగిలిన మానవులందరూ కాలం సాక్షిగా నష్టపోతారని దివ్య ఖుర్‌ఆన్ గ్రంథం హెచ్చరించింది. మనం చేసేవాటికి కాలం సాక్షి. ఇక్కడ నష్టం అంటే ఇహలోకానికి చెందిన ఆర్థికమైన, ఆరోగ్యపరమైన, బంధుత్వపరమైన, కీర్తిప్రతిష్టలు, ఆస్తిపాస్తులకు సంబంధించిన నష్టం కాదు, అది పరలోక నష్టం. మరణానంతర జీవితానికి సంబంధించిన నష్టం.

విశ్వాసం అంటే దైవం పైనా, దివ్య గ్రంథాల పైన ఉండే సంపూర్ణ విశ్వాసం. ఇది జీవితంలోని అన్ని అంశాల్లో ప్రతిఫలించాలి. అలాగే విశ్వాసంతో పాటు మనిషి ఎల్లప్పుడు సత్కార్యాలు చేయడం ముఖ్యం. దివ్య ఖుర్‌ఆన్‌లో ధర్మం, అధర్మం, ఆజ్ఞలు, అగోచరాలు, గత చరిత్ర అనే అయిదు అంశాలు ఉన్నాయి. దేని విషయంలో ఎలా వ్యవహరించాలనే విచక్షణతో వ్యవహరించడమే సత్కార్యం. సత్యోపదేశం అంటే... ఇహ, పర జీవితాలకు ఉపయుక్తమైన మాటలను బోధించడం. సహనబోధ అంటే... సహనంగా ఉండాలని చెప్పడం. సత్యోపదేశం చేసిన వ్యక్తి మీద కొన్ని సందర్భాల్లో కష్టాలు విరుచుకుపడతాయి. సంపాదనలో వెలితి కనిపిస్తుంది. అలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి సహనం అత్యవసరం అవుతుంది. కాబట్టి సహనాన్ని బోధించాలి.

సందేశం



"మీకు పలు రకాల పరీక్షలు ఎదురవుతాయి. ఆ స్థితిలో మీరు సహనం, నమాజ్‌ల ద్వారా సహాయం పొందండి" అని దివ్య ఖుర్‌ఆన్ చెబుతోంది. కాబట్టి మనిషి తన జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా... నష్టం నుంచి కాపాడుకోవడానికి దైవం పట్ల దృఢమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. విశాల హృదయంతో సత్కార్యాలు ఆచరించాలి. అందరి మేలు కోరుతూ సత్యోపదేశం చేయాలి. పరస్పర సహనాన్ని బోధించే లక్షణాన్ని కలిగి ఉండాలి. వీటన్నిటినీ మనలో కలిగించాలని దైవాన్ని ప్రార్థిద్దాం.

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

భక్త ప్రతిమలూ ప్రత్యేకమే



ఆలయాల్లో ప్రతిష్ఠించే దైవ భక్తుల విగ్రహాల రూపకల్పనకు ప్రత్యేకమైన విధివిధానాలను గ్రంథాలు నిర్దేశించాయి. విష్ణు భక్తులైన ఆళ్వార్ల విగ్రహాలన్నిటినీ ఉత్తమ అష్ట తాళంలో చేయాలని 'విష్ణుతత్త్వం' అనే గ్రంథం చెబుతోంది. శిల్పులు వైష్ణవ విధులను పాటిస్తూ... ఆ భక్తుల విగ్రహాలను వైష్ణవ సంప్రదాయానుగుణంగా తయారు చేయాలి. అలాగే శివభక్తులైన నాయనార్ల విగ్రహాలను శైవ సంప్రదాయానుసారంగా ఉత్తమ అష్టమ తాళంలో రూపొందించాలి.


బోధలు, కైంకర్యాల ఆధారంగా...

సాధారణంగా భక్త ప్రతిమలన్నీ రెండు చేతులూ జోడించి, అంజలి ముద్రతో భగవంతుడికి నమస్కరిస్తూ ఉంటాయి. అయితే కొన్ని ప్రతిమలు ఆ భక్తుల జ్ఞానవైరాగ్యం, వారు చేసిన బోధలు, ఆ ప్రతిమలు ఉన్న క్షేత్రాలు, ఆ క్షేత్రాలలో వారు చేసిన కైంకర్యాలను బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు ఆళ్వార్లలో ముఖ్యుడైన శ్రీనమ్మాళ్వార్ విగ్రహం జ్ఞానముద్రలో ఉంటుంది. మిగిలిన చోట్ల అంజలి ముద్రలో ఉన్నప్పటికీ, తిరుమల క్షేత్రంలో... శ్రీవారి సన్నిధిలో కొలువైన శ్రీరామానుజాచార్యుల విగ్రహం ఉపదేశాత్మకంగా జ్ఞాన, వరద ముద్రలతో ఉంటుంది. అలాగే శ్రీరంగ క్షేత్రంలో జ్ఞానముద్రతో ఉంటుంది. బదరీనాథ్ ఆలయంలోని శ్రీఆదిశంకరాచార్యుల ప్రతిమ జ్ఞానముద్రతో, మరొక చేతిలో తాళపత్రాలతో ఉంటుంది. శ్రీ మధ్వాచార్యుల ప్రతిమ... ఆయన ప్రవచించిన ద్వైత సిద్ధాంతాన్ని సూచిస్తూ, రెండు వేళ్ళను చూపిస్తూ ఉంటుంది.

ఆయుధాలు, వాయిద్యాలు

పరమ భక్తుడైనప్పటికీ రాచరిక నేపథ్యం ఉన్న శ్రీకులశేఖర ఆళ్వార్ విగ్రహానికి కత్తి, డాలు అమర్చి ఉంటాయి. భగవంతునికే మంగళాశాసనం చేసిన పెరియాళ్వార్ ప్రతిమకు చేతిలో తాళాలు, పూలబుట్ట ఉంటాయి. భగవంతుడికి పుష్ప కైంకర్యం చేసిన విప్రనారాయణుడనే ఆళ్వారు చేతికి కూడా ఒక పూలబుట్ట అమరుస్తారు. భగవంతుని సాయుజ్యం పొందిన ఆండాళ్ తల్లి విగ్రహాన్ని సాక్షాత్తూ భూదేవి రూపంలో... సర్వాభరణయుక్తంగా ఉత్తమ నవ నవతాళంలో చేస్తారు. తురుప్పాణి ఆళ్వార్ చేతిలో వీణ ఉంటుంది. తిరుమంగై ఆళ్వార్ చేతిలో బల్లెం ఉంటాయి. తిరుమలలో హుండీకి ఎదురుగా ఉండే తాళ్ళపాక వారి సంకీర్తనా భాండాగారం పైన ఉండే శ్రీ అన్నమయ్య, పెద్ద తిరుమలాచార్యుల విగ్రహాలు తంబురాలు పట్టుకొని యక్షుల మాదిరిగా ఉంటాయి. తిరుజ్ఞాన సంబంధర్ అనే నాయనార్ చేతిలో సంగీత సాధనమైన తాళాలు ధరించి ఉంటారు. కన్నప్ప విగ్రహం తన కంటిని పొడుచుకుంటున్నట్టు ఉంటుంది. శివాలయాలను శుభ్రపరిచే కైంకర్యంలో ఉండే తిరునావుక్కరసు నాయనార్ చేతిలో కుంచెను పోలిన దండాన్ని అమరుస్తారు. శ్రీకృష్ణ దేవరాయలు విజయనగర సామ్రాజ్యాధిపతి అయినప్పటికీ... తన ఇద్దరు భార్యలతో కలిసి ఉన్న తన విగ్రహాన్ని తిరుమల శ్రీవారి ఆలయంలో సామాన్య భక్తుల్లా అంజలి ముద్రతో ప్రతిష్ఠించుకున్నారు. మధుర నాయక రాజుల విగ్రహాలను మీనాక్షి దేవాలయంలో చూడవచ్చు. తంజావూరు ఆలయంలో రాజరాజ చోళుని విగ్రహం సర్వాభరణాలతో... పొడవాటి కత్తిని ధరించి ఉంటుంది.

డి.యన్.వి. ప్రసాద్
స్థపతి, 9440525788



రచయిత, అరసం నేత ఆచార్య చందు సుబ్బారావు కన్నుమూత



ఆచార్య చందు సుబ్బారావు(ఫైల్)

విశాఖపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం(అరసం) నేత, ఏయూ విశ్రాంత ఆచార్యుడు చందు సుబ్బారావు(80) గురువారం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లోనే చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గుంటూరు జిల్లా చదలవాడలో 1946 మే 18న సుబ్బారావు జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. అదే విశ్వవిద్యాలయంలో 1974లో అధ్యాపకునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, రీడర్‌గా, జియో ఫిజిక్స్ విభాగంలో ఆచార్యునిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. 1979-1982 మధ్య అరసం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన రచించిన సైన్స్ అండ్ సివిలైజేషన్, 'కవికి విమర్శకుడు శత్రువు కాదు'... వంటివి ప్రాచుర్యం పొందాయి. శ్రీశ్రీపై ఆయన చేసిన రచనలు హిందీలోకి అనువదించారు. తాపీ ధర్మారావు అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు. ఆయన మరణ వార్త తెలియగానే ఆచార్య కేఎస్ చలం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరసం రాష్ట్ర నాయకులు ఉప్పల అప్పలరాజు, ఏఎంఆర్ ఆనంద్, కొమ్మాలపాటి శరత్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం: మంత్రి ఫరూక్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. బడ్జెట్ ప్రతిపాదనలపై గురువారం అమరావతి సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మైనార్టీల సంక్షేమానికి ఉద్దేశించి ప్రాధాన్య అంశాల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర నిధులు రాబట్టడం, వినియోగించుకోవడంలో ప్రణాళికాబద్ధంగా, కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయాలకు 1.40 కోట్ల విలువైన పుస్తకాలు

» ముందుకొచ్చిన ఎమెస్కో... అభినందించిన సీఎం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన పుస్తకాలను అందించేందుకు ఎమెస్కో సంస్థ ముందుకొచ్చింది. ఎమెస్కో విజయకుమార్ సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఈ విషయాన్ని తెలియజేశారు. పుస్తకాల జాబితాను ఆయనకు అందించారు. విజయకుమార్‌ను సీఎం అభినందించారు.

పులిచింతల అభివృద్ధి పనులకు రూ.2.85 కోట్లు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేఎల్‌రావుసాగర్ పులిచింతల ప్రాజెక్టు కుడి వైపున కంట్రోల్ ప్యానల్, జనరేటర్ సెట్లు, 11కేవీ సీసీ ఛార్జ్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.2.85 కోట్లకు పాలనా ఆమోదం తెలుపుతూ జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్ జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు.

జనగణనపై ప్రజలకు విస్తృత అవగాహన: సీఎస్

» జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనాభా లెక్కల సేకరణ సక్రమంగా, సజావుగా నిర్వహించాలని, దీనిపై రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతోపాటు డిస్పెన్సరీలు, ఐఎంఎస్ ఆస్పత్రుల నిర్మాణానికి భూ కేటాయింపులు తదితర అంశాలపైనా సీఎస్ సమీక్షించారు.

301 బార్లకు రీనోటిఫికేషన్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బార్ పాలసీలో మిగిలిపోయిన 301 బార్లకు తిరిగి నోటిఫికేషన్ జారీచేసినట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో పాలసీ విడుదల చేసినప్పుడు 299 బార్లు మిగిలాయని, కొత్తగా గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు బార్లకు లైసెన్సులు జారీచేయాలని నిర్ణయించామని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, 5న కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ విధానంలో లైసెన్స్‌లు మంజూరు చేస్తారని వివరించారు. ఎంపికైన వారికి అదే రోజున తాత్కాలిక లైసెన్స్ అందజేస్తారని తెలిపారు. ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎక్సైజ్ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల


అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నాలుగు నోటిఫికేషన్ల రాత పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్- అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, అటవీ శాఖలో తానేదార్, దేవదాయశాఖలో గ్రేడ్-3 ఈవోలు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ల రాత పరీక్షలు ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి.

ప్రైవేటు కాలేజీల జేఏసీ కన్వీనర్‌గా రమణాజీ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం రాష్ట్రంలోని అన్ని రకాల ప్రైవేటు విద్యా సంస్థలు కలిసి జేఏసీగా ఏర్పడ్డాయి. గురువారం మంగళగిరిలో నిర్వహించిన సమావేశం దీనికి వేదికైంది. ఇందులో జూనియర్ కాలేజీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, బీఈడీ కాలేజీలు, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, పీజీ కోర్సులు అందించే విద్యా సంస్థలు ఉన్నాయి. ఇంజనీరింగ్ కాలేజీలు మాత్రమే ఇందులో చేరలేదు. జేఏసీ కన్వీనర్‌గా జె.రమణాజీ, సభ్యులుగా పొన్న జయరాం, కె.శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాస మోహన్, బి.శ్రీనివాసరావు, వి.జనార్దన్, జి.మొహిద్దీన్, వి.విజయరమణ, వీవీ ప్రసాద్, వైవీఎస్ఎన్ ప్రసాద్ ఎన్నికయ్యారు. దాదాపు తొమ్మిది విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మూడేళ్ల మెయింటెనెన్స్ ఫీజులు బకాయి ఉన్నాయని జేఏసీ తెలిపింది. దీంతో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని పేర్కొంది. ఫిబ్రవరి 10లోపు ఫీజులు విడుదల చేయాలని కోరింది.


ఎక్సైజ్ శాఖను గాడిలో పెట్టాం: కొల్లు రవీంద్ర

» ఎక్సైజ్ అధికారుల సంఘాల డైరీల ఆవిష్కరణ



ఎక్సైజ్ విభాగంయ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ అధికారులు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఎక్సైజ్ శాఖను తిరిగి గాడిలో పెట్టామని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎక్సైజ్ గజిటెడ్ అధికారుల సంఘం, ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘాలు రూపొందించిన డైరీలు, క్యాలెండర్లను గురువారం మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను నాశనం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ శాఖను తిరిగి ప్రక్షాళన చేసిందని తెలిపారు. నవోదయం కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని నాటుసారా రహితం చేశామన్నారు. నాటుసారా నిర్మూలన విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. కాగా, దేశంలో నాటుసారా రహితంగా మారిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా తెలిపారు. త్వరలో ఎక్సైజ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, అదనపు కమిషనర్ దేవకుమార్, సంఘాల ప్రతినిధులు బి.నరసింహులు, కె.కామేశ్వరరావు పాల్గొన్నారు.



గాంధీ హిల్ నుంచి బెజవాడ దృశ్యం

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో బెజవాడ నగరానికి కీలకమైన స్థానం ఉంది. అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపిన మహాత్ముని అడుగుజాడలతో పునీతమైన నగరమిది! జాతీయోద్యమ స్ఫూర్తిని, గాంధేయవాదాన్ని పుణికిపుచ్చుకున్న ఈ నగరం గాంధీజీ అడుగుజాడల్లో నడిచి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ముఖ్యంగా నేటి గాంధీనగర్ ప్రాంతం కేవలం ఒక పేరు కాదు.. అది ఒక ఉద్యమ కేంద్రం.. త్యాగాల ప్రతిరూపం.. గాంధీజీ పట్ల బెజవాడ ప్రజలకున్న అచంచలమైన అభిమానానికి నిదర్శనం! గాంధీజీ విజయవాడలో జరిపిన పర్యటనలు స్థానిక ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయి. అప్పట్లో వన్‌టౌన్ నుంచి ప్రారంభమైన ఈ చైతన్యం, క్రమంగా గాంధీనగర్ ఆవిర్భావానికి పునాది వేసింది. నేడు గాంధీజీ వర్ధంతి సందర్భంగా బెజవాడలో గాంధీజీ పర్యటనలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' అవలోకనం!



బెజవాడ.. 'గాంధీ గిరి'!

నాటి ఉద్యమ స్ఫూర్తి కేంద్రం.. నేటి గాంధీ నగర్



విజయవాడలో మహాత్ముడు విశ్రమించిన గది, ఆయన వస్తువులు భద్రపరుచుకున్న అలమరా

» మహాత్ముడి పాద స్పర్శతో పులకించిన నేల.. ఉద్యమాన్ని ఉరకలెత్తించిన వేళ

» గాంధీజీ స్మారకార్థంగా ప్రసిద్ధి చెందిన గాంధీ కొండ

» మిల్క్‌ఫ్యాక్టరీ సమీపంలో గాంధీ ఆలయ నిర్మాణం

» నేటికీ ఏటా 100 మంది వరకు దీక్షలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ కల్చరల్)

నేడు మహాత్ముని వర్ధంతి

జాతీయోద్యమం బెజవాడ చరిత్రను కొత్త మలుపు తిప్పింది! జాతిపిత మహాత్మాగాంధీ పాదస్పర్శ నగరాన్ని ఉద్యమ కేంద్రంగా మార్చింది. 1919 నుంచి 1936 వరకు ఆయన సందర్శనలు ప్రజల్లో స్వాతంత్ర్య భావనను రగిలించాయి. వన్‌టౌన్ నుంచి మొదలైన ఈ చైతన్యం 'గాంధీనగర్' అవతరణకు పునాది పడగా, అక్కడప్రారంభమైన ఉద్యమం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా మహా సంగ్రామంగా మారింది.

తొలి సందర్శన 1919లో..

రౌలట్ చట్టాన్ని గాంధీజీ నిరసిస్తూ దేశమంతా పర్యటించారు. ఈ సందర్భంలోనే 1919లో తొలిసారి బెజవాడ వచ్చారు. 1919 ఏప్రిల్ 6న పట్టణ ప్రజలు సత్యాగ్రహ ఉద్యమం చేపట్టారు. అన్ని వర్గాలవారూ ఏకమై ఊరేగింపులు చేశారు. అదే రోజు సాయంత్రం మిషన్ స్కూల్ ఎదుట జరిగిన సభకు ఐదువేల మంది హాజరయ్యారు. సభకు మహాకవి బుచ్చి సుందరరామ శాస్త్రి అధ్యక్షత వహించారు. గాంధీజీ రామ్మోహన్ గ్రంథాలయం ఆవరణలో ప్రసంగించారు. ఇది గాంధీనగర్ ఆవిర్భావానికి తొలి మెట్టు.

1920లో రెండోసారి..

గాంధీజీ రెండోసారి షౌకత్ అలీతో కలిసి 1920 ఆగస్టు 23న నగరానికి వచ్చారు. మున్సిపల్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న జమ్మిచెట్టు కింద జరిగిన సభలో బిరుదులను త్యజించడం, పన్నుల నిరాకరణ, కోర్టుల బహిష్కరణ వంటి అంశాలతో ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ సభ అనంతరం అయ్యదేవర కాళేశ్వరరావు శాసనసభ అభ్యర్థిత్వాన్ని విరమించి గాంధీజీ శిష్యరికాన్ని అంగీకరించారు. గులామ్ మొహియుద్దీన్ సాహెబ్ గౌరవ మేజిస్ట్రేట్ ఉద్యోగాన్ని విడిచిపెట్టారు.

కాంగ్రెస్ కమిటీ మహాసభలు

1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీల్లో విక్టోరియా మ్యూజియం హాలులో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లోనే పింగళి వెంకయ్య జాతీయ పతాకానికి రూపకల్పన చేశారు. గాంధీజీ, కస్తూర్బా, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీదేవి తదితరులు పాల్గొన్నారు. ఇక మహాత్ముడు ఎక్కడ బస చేయాలన్న విషయమై పట్టణంలో 'వేలంపాట' నిర్వహించారు. అందరిలోకెల్లా గొల్ల నారాయణరావు అనే వైశ్యప్రముఖుడు అత్యధికంగా వేలం పాడడంతో, వన్‌టౌన్‌లోని ఆయన మేడపై గాంధీజీ, కస్తూర్బా, మహదేవ దేశాయ్ బస చేశారు. గాంధీ ఏర్పాటు చేసిన స్వరాజ్య నిధికి అప్పట్లోనే రూ.25 వేల నగదు, రూ.2,500 విలువచేసే ఏడువారాల నగలు(అప్పటి ధర ప్రకారం), మరికొన్ని బంగారు వస్తువులు అందించారు. ఆ విలువ ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.46,500 కోట్లు ఉంటుందని మండలి బుద్ధప్రసాద్ గతంలో ప్రస్తావించారు. 1921 ఏప్రిల్ 1న గాంధీనగర్ మైదానంలో విశ్వబ్రాహ్మణ మహాసభ జరిగింది. స్వరాజ్యనిధికి విరాళాలు ఇవ్వాలని గాంధీజీ, తిలక్.. ప్రజలను కోరారు. కోటగిరి వెంకటకృష్ణారావు తమ ఉంగరాలు, గడియారం కానుకగా ఇచ్చారు. తర్వాతి కాలంలో 1936లో గాంధీజీ బెజవాడ మల్లీశ్వరాలయంలో హరిజనులను ఆలయ ప్రవేశం చేయించారు.

గాంధీ కొండ.. నేటికీ అలరారుతున్న వైభవం

నగరంలో ఇప్పటికీ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా నిలిచిన గాంధీహిల్.. నాడు మహాత్మాగాంధీ స్మారకంగా నిర్మించినది. గాంధీజీ స్మారకార్థం దేశంలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇదొకటి. 1962 నవంబరు 9న అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి శంకుస్థాపన చేయగా, 1968 అక్టోబరు 6న రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్.. ప్రారంభించారు. ఇక బెజవాడ మిల్క్‌ఫ్యాక్టరీ సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలో గాంధీ దేవాలయం నిర్మించారు. 2012 నుంచి దీక్షలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఏటా 70 నుంచి 100 మంది వరకు గాంధీజీని ఆరాధిస్తూ దీక్షలు తీసుకుంటారని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం అధ్యక్షుడు రాంపల్లి జయప్రకాశ్ తెలిపారు.

అమరావతి.. అవకాశాల గని

టాప్-10 జీవనయోగ్య నగరాల్లో బెజవాడ, తిరుపతి.. తాజా ఆర్థిక సర్వే వెల్లడి

» ఆర్థికపరంగా ప్రమాదకర స్థాయిలో ఏపీ

» ఆరేళ్ల నుంచి రెవెన్యూ లోటే!

» ద్రవ్యోల్బణం తగ్గుముఖం

» రిజిస్ట్రేషన్, భూకేటాయింపులు, వేగంగా పర్యావరణ అనుమతులు

» విదేశీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ భేష్

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ గురించి ఆసక్తికర విషయాలు పొందుపరిచారు. ప్రధానంగా రాజధాని అమరావతి, రెవెన్యూ లోటు, ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావించారు. అమరావతి నూతన గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని.. ఏమీ లేని స్థాయి నుంచి ప్రజలు సౌకర్యంగా జీవించే పట్టణ ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఈ నగరం అరుదైన అవకాశాలను కల్పిస్తున్నట్లు సర్వే పేర్కొంది. దేశంలో టాప్-10 జీవన యోగ్య నగరాల్లో విజయవాడ, తిరుపతి కూడా ఉన్నాయని వెల్లడించింది. 'పట్టణీకరణ జరుగుతున్న ఇతర ప్రధాన నగరాల్లో మాదిరిగా అమరావతిలో జనసాంద్రత అత్యధికంగా లేదు. మౌలిక సదుపాయాలు, ఉపాధి అందుబాటులో ఉన్నాయి. ఈ దిశగా సరైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తే భవిష్యత్ సమస్యలను నివారించవచ్చు. ట్రాఫిక్ గందరగోళం, అక్రమ కాలనీలు, సేవల్లో లోపాలు ఏర్పడక ముందే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం అవసరం' అని సూచించింది. ఆర్థికపరంగా రాష్ట్రం ఎంత ప్రమాదకర స్థాయిలో ఉందో.. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాల గురించి సర్వేలో వివరించారు. '2019 నుంచి 2025 వరకు వరుసగా ఆరేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటుతోనే కొనసాగుతోంది' అని తెలిపింది.

- 2022-23లో రాష్ట్రంలో ద్రవ్యోల్బణం 7.57 శాతం ఉంది. ఆ సమయంలో జాతీయ ద్రవ్యోల్బణ సగటు 6.66% కాగా.. ఏపీలో ఎక్కువగా నమోదైంది. 2023-24లో జాతీయ సగటు 5.36 శాతం, ఏపీలో 5.54%.. 2024-25లో జాతీయ సగటు 4.36%, ఏపీలో 4.41 శాతంగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు నడుమ జాతీయ ద్రవ్యోల్బణ సగటు 1.72 శాతంగా నమోదుకాగా ఏపీలో 1.39 శాతంగా ఉంది.

వ్యాపార సంస్కరణలు భేష్..


వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచారు. పర్యావరణ అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నారు. వ్యాపారాన్ని సులభతరం చేయడంలో భాగంగా ఏపీలో సింగిల్ విండో పారిశ్రామిక అనుమతులు, ఆన్‌లైన్ భూమి రిజిస్ట్రేషన్, ఈ-పర్యావరణ అనుమతులు లభిస్తున్నాయి. వ్యాపార సంస్థలు డిజిటల్ మార్గంలో అనుమతుల కోసం దరఖాస్తు చేసేందుకు వీలుగా ఆన్‌లైన్ కన్సెంట్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ వ్యవస్థను విస్తరించారు. బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ అమలుతో కొత్త వ్యాపార ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా వేగంగా పర్యావరణ అనుమతులిస్తోంది.

- దేశవ్యాప్తంగా ఒక హెక్టారుకు వరి దిగుబడిలో జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్‌లో దిగుబడి తక్కువగా ఉంది.
- ఆహార ధాన్యాల సరఫరాను జీపీఎస్ ద్వారా సమర్థంగా పర్యవేక్షిస్తున్నారు.
- ఏపీ, హిమాచల్, గుజరాత్‌లలో ప్రపంచ స్థాయి బల్క్ డ్రగ్ పార్కుల అభివృద్ధి. కేంద్ర బడ్జెట్‌లో వీటికి రూ.1,400 కోట్ల కేటాయింపు.
- ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విద్యా విధానాల వల్ల విదేశీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతోంది.
- మహిళల యాజమాన్యం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్‌ల తర్వాత ఏపీకి స్థానం.
- రాష్ట్రంలో భూ వినియోగ మార్పిడిలో విధానపరంగా జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- 2025 నాటికి 6,901 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి.

పంచాయతీరాజ్‌లో 77 జడ్పీ సీఈవో పోస్టులు

» డీడీవోలకు పదోన్నతులు కల్పిస్తూ డీపీసీ ఆమోదం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 77 మంది డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు జడ్పీ సీఈవో హోదా కల్పిస్తూ డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) ఆమోదం తెలిపింది. ఈ పదోన్నతులు పంచాయతీరాజ్ చరిత్రలో ఒక మైలురాయిగా పేర్కొంటున్నారు. ఈ శాఖ ప్రారంభమైనప్పటి నుంచీ ఇతర శాఖల అధికారులే జడ్పీ సీఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. తొలిసారిగా 77 మంది పంచాయతీరాజ్ అధికారులకు ఈ హోదా కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల నుంచి ఎంపీడీవోల వరకూ ఒక్కో కేడర్‌కు పదోన్నతులు ఇచ్చిన ఈ శాఖ తాజాగా డీడీవోలకు జడ్పీ సీఈవోలుగా పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 1999లో గ్రూప్-1 కేడర్‌లో నియమితులైన ఎంపీడీవోలు మూడు దశాబ్దాల పాటు పదోన్నతులు లేకుండా అదే హోదాలో కొనసాగారు. కొంతమంది అదే పోస్టులో రిటైరయ్యారు. కూటమి సర్కారు వచ్చాక 10వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి రికార్డు సృష్టించిందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌లో స్వాతంత్ర్యానంతరం ఎప్పుడు తీసుకోని సంస్కరణలు కూటమి ప్రభుత్వంలో తీసుకున్నారు. దీంతో వివిధ కేడర్లలో ఉన్న ఉద్యోగులందరికీ పదోన్నతుల భాగ్యం దక్కింది. కూటమి ప్రభుత్వం మొదటి విడతలో 53 మంది ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించి డీఎల్‌డీవోలుగా నియమించింది. సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఈవోపీఆర్ అండ్ ఆర్డీలకు పదోన్నతులు కల్పించి 300 మందిని ఎంపీడీవోలుగా నియమించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు సుమారు 3 వేల మందికి, సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులు 2వేల మందికి పైగా ప్రమోషన్లు లభించాయి. మొదటిసారి తమ శాఖతో పాటు ఇతర శాఖలకు కూడా వీరు అధికారులుగా వెళ్లే అవకాశం లభించింది. దీనిపై సీఎం, ఉపముఖ్యమంత్రి, ప్రత్యేక సీఎస్ శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల సంఘం నేతలు కేఎస్ వరప్రసాద్, కేఎన్‌వీ ప్రసాద్, డి.వెంకట్రావు, బుజ్జి, సూర్యనారాయణ తదితులు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ శర్మ దంపతులను సన్మానిస్తున్న సుందరాచారీ

అభివృద్ధి చూశారు.. ఆదరించారు!

» జీఎంసీకి ఎన్నారై వైద్య దంపతుల 2 కోట్ల విరాళం

గుంటూరు మెడికల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో స్థిరపడిన ఎన్నారై దంపతులు డాక్టర్ చల్లా సుబ్రహ్మణ్యం శర్మ, డాక్టర్ లైలా గుంటూరు వైద్య కళాశాలకు రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో శుక్రవారం జరిగే కానూరి జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు జీఎంసీ 1966వ బ్యాచ్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ఆయన భార్య, శిశు వైద్యనిపుణులు డాక్టర్ లైలా అమెరికా నుంచి గుంటూరు వచ్చారు. వీరిద్దరూ మెడిసిన్‌లో క్లాస్‌మేట్లు కావడంతోపాటు ప్రేమ వివాహం చేసుకున్నారు. సతీసమేతంగా గురువారం జీఎంసీకి వచ్చిన సుబ్రహ్మణ్యం శర్మ.. రెండేళ్ల కిందటితో పోలిస్తే కళాశాలలో ఎంతో అభివృద్ధి జరిగినట్లు గుర్తించారు. విద్యా సంస్థ అభివృద్ధికి ప్రిన్సిపాల్ సుందరాచారీ చేస్తున్న కృషిని అభినందించారు. అప్పటికప్పుడు శర్మ దంపతులు కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. వీరి ఉదారతను ప్రశంసించిన ప్రిన్సిపాల్ సుందరాచారీ.. ఎన్నారై దంపతులను శాలువా కప్పి సన్మానించారు.



ఆఫ్‌కాఫ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్, పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత తదితరులు

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

» మత్స్య సంఘాల బలోపేతానికి చర్యలు: అచ్చెన్న


అమరావతి/విజయవాడ అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, మత్స్య సహకార సంఘాల పటిష్టతకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య(ఆఫ్‌కాఫ్) చైర్మన్‌గా యాటగిరి రాంప్రసాద్, వైస్‌చైర్మన్ బి.రంగారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్.సవిత పాల్గొన్నారు. 'మత్స్యకారులకు పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారాలను సీఎం చంద్రబాబు ఇప్పటికే విడుదల చేశారు. వచ్చే మూడేళ్లలో మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరగాలి. ఆక్వా రంగంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలి' అని అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మత్స్యకారుడిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మంత్రి సవిత మాట్లాడుతూ చేపల పెంపకం, విక్రయాల్లో మహిళలకు 60% సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. మత్స్యకారులంతా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వ విప్ మాధవీరెడ్డి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు, బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్, మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు నికరాదాయం: అచ్చెన్న

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. భవిష్యత్ అవసరాలకుగాను 30 నర్సరీలు, 3సీడ్ గార్డెన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు నుంచి వడ్డేశ్వరంలోని ప్రైమ్ హిల్ క్రస్ట్ భవనంలోకి మార్చిన రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని గురువారం మంత్రి అచ్చెన్న ప్రారంభించి మాట్లాడారు.

తప్పని తెలీదు.. క్షమించండి

» తిరుమలలో వెడ్డింగ్ షూట్‌లో పాల్గొన్న నూతన దంపతులు



తిరుమాల్, గాయత్రి

తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి ఆలయం ముందు ఫొటోలు, వీడియోలు తీయడం తప్పని తెలీదు. క్షమించండి' అంటూ తిరుమలలో వెడ్డింగ్ షూట్ నిర్వహించి విమర్శల పాలైన తిరువణ్ణామలైకు చెందిన తిరుమాల్, గాయత్రి క్షమాపణలు కోరుతూ గురువారం వీడియో విడుదల చేశారు. ఆలయం వద్ద ఫొటోలు తీయకూడదనే నిబంధన ఉన్నట్టు తెలీదని, నియమాలకు విరుద్ధమని తెలిసిన వెంటనే వాటిని డిలీట్ చేశామన్నారు. అందరికీ క్షమాపణలు చెబుతున్నామని, ప్రాయశ్చిత్తంగా శ్రీవారిసేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో.. కేసీఆర్‌కు సిట్ నోటీసు



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణకు సిద్ధంగా ఉండాలంటూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామమని సిట్ ఏసీపీ వెంకటగిరి.. నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు కాపీని సిట్ అధికారులు.. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి, అక్కడి సిబ్బందికి అందజేశారు. "పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నంబర్ 243 కింద నమోదైన క్రిమినల్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన అంశాల్లో మీ పాత్రకు సంబంధించి విచారణ జరపాల్సి ఉంది" అని.. 160 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన ఈ నోటీసులో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. అయితే, కేసీఆర్ వయసు రీత్యా హైదరాబాద్ పరిధిలో ఆయన కోరిన స్థలంలో దర్యాప్తు అధికారి, ఆయన బృందం విచారణ చేపడతారని, లేదా, ఆయన సిట్ కార్యాలయానికి హాజరుకావచ్చని పేర్కొన్నారు. కాగా, తెలంగాణలో మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల విచారణకు హాజరుకాలేని పరిస్థితిలో ఉన్నానని.. కాబట్టి, విచారణకు మరోతేదీని నిర్ణయించాలని, బాధ్యతాయుత పౌరుడిగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కేసీఆర్ లేఖ రాశారు.





కోరంగిలో గ్రేటర్ ఫ్లెమింగోల సందడి

కాకినాడ జిల్లా కోరంగి మడ అడవులు ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. విదేశాల నుంచి వచ్చిన గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు ఇక్కడి మడ అడవుల్లో కనువిందు చేస్తూ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నాయి. నదిలో విహరిస్తూ.. గాల్లో ఎగురుతూ.. ఆకట్టుకుంటున్నాయి. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



వెలమవారిపాలెంలో సందడే సందడి

నైజీరియా పక్షుల కిల..కళ!

ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం విదేశీ పక్షుల కిలకిలరావాలతో కళకళలాడుతోంది. వందల ఏళ్ల నుంచి 5,312 కిలోమీటర్ల దూరంలోని నైజీరియా నుంచి ఏటా వెయ్యికి పైన పక్షులు ఇక్కడికి వలస వస్తుంటాయి. ఏటా డిసెంబరు చివరి వారంలో వచ్చే పక్షులు ఈ ఏడాది సంక్రాంతి నాటికి వచ్చాయి. ఆరు మాసాలు అంటే జూన్ వరకు ఇక్కడే ఉంటాయి. గుడ్లు పెట్టి పిల్లలను పెద్ద చేసుకొని వాటితో కలిసి తిరిగి వెళ్తుంటాయి. వాటిని గ్రామస్థులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. - అద్దంకి

సీఎం పదవికి జగన్ అనర్హుడు!

- అధికారం ఇస్తే ఒక్కరోజూ బయటకు రాలేదు
- పాదయాత్ర ప్రజల కోసం కాదు.. పదవి కోసమే: షర్మిల



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవికి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూట్ (సరిపోలేదని) కాలేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తేల్చి చెప్పారు. జగన్ పాదయాత్ర ప్రజల కోసం కాదని.. అధికారం కోసమేనని విమర్శించారు. ఏడాదిన్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడే ప్రకటనలు ఎందుకని ప్రశ్నించారు. చిత్తశుద్ధి లేని యాత్రలు ఎందుకని ప్రశ్నించారు. ప్రజలు ఒకసారి అధికారం ఇస్తే ఏంచేశారని ప్రశ్నించారు. విజయవాడలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమానికి జగన్ తూట్లు పొడిచారని, నవరత్నాల హామీలకూ దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. అధికారం ఇస్తే ఒక్కరోజు కూడా బయటకు రాలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలనూ కలవలేదని విమర్శించారు. 'అధికారంలో ఉండగా జగన్‌ను చూశాం. జగన్ నైజం మారాలి. స్వార్థం తగ్గి మంచితనం పెరగాలి. అప్పుడు దేవుడు అధికారం ఇస్తాడేమో? అంతవరకూ దేవుడూ, ప్రజలూ జగన్‌ను ఆశీర్వదించబోరు' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సహా ఉపాధి కూలీలకు పనిలేకుండా చేసినందుకు నిరసనగా వచ్చే నెల 2 నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని షర్మిల ప్రకటించారు.

వైసీపీవి కుట్ర రాజకీయాలు: సత్యకుమార్

ఒంగోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాష్ట్రంలో కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ అన్నారు. గురువారం ఒంగోలు వచ్చిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. రైల్వే కోడూరు ఎమ్మెల్యేపై విషయంలో... ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వంపై బురదజల్లడానికి జగన్ ఉపయోగించుకుంటున్నారు. జగన్‌కు ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంటే ఈ నెల 11నుంచి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరుకావాలి' అని మంత్రి సత్యకుమార్ అన్నారు.

నియోజకవర్గాల్లో పార్టీలకు 50 సెంట్ల భూమి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు నియోజకవర్గ కేంద్రాల్లో భూములు కేటాయించే పాలసీలో ప్రభుత్వం కీలక సవరణ చేసింది. వాటికి ఇకపై 50 సెంట్ల భూమిని లీజు ప్రాతిపాదికన కేటాయించాలని నిర్ణయించింది. ఇందుకోసం జీవో 575లో పాయింట్ 1, 3లకు సవరణలు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ గురువారం జీవో 62 జారీ చేశారు. ఏడాది లీజు ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పునే వసూలు చేయనున్నారు. ఈ మేరకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) చర్యలు తీసుకోవాలని స్పెషల్ సీఎస్ ఆదేశించారు.

జిల్లాలకు 128.43 కోట్ల ఎన్‌హెచ్ఎం నిధులు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు జాతీయ ఆరోగ్య మిషన్‌కు చెందిన రూ.128.43 కోట్లు విడుదల చేసినట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిని వచ్చే ఫిబ్రవరి 20వ తేదీ నాటికి ఖర్చు పెట్టాలన్నారు. గరిష్ఠంగా గుంటూరు జిల్లాకు రూ.26.1 కోట్లు, నెల్లూరు జిల్లాకు రూ.8.60 కోట్లు, కృష్ణా జిల్లాకు రూ.6.21 కోట్లు చొప్పున విడుదల చేశామన్నారు. మిగిలిన జిల్లాలకు రూ.5.20 కోట్ల నుంచి రూ.2 కోట్ల చొప్పున విడుదల చేశామని తెలిపారు.

కొయ్య బొమ్మలకు ప్రత్యేక క్లస్టర్లు: మంత్రి కొండపల్లి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తయారు చేసే కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతి కొయ్య బొమ్మలకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. సంప్రదాయ కలంకారీ పెయింటింగ్, కడప మాధవరం హ్యాండ్లూమ్స్, శిల్పాలకు అదనపు విలువను జోడించి, వాటికి బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్‌లో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా మన కళాకారుల నైపుణ్యానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెస్తామన్నారు.

వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యాన్ని సాధించాలి

వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యాన్ని సాధించేలా జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. రైతు ఉత్పత్తి సమాఖ్యలను బలోపేతం చేయాలన్నారు.

సారీ.. క్షమించండి!

- మండలి ప్రివిలేజ్ కమిటీకి అధికారుల సంజాయిషీ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో దీపక్‌రెడ్డికి పీఏని కేటాయించకుండా జాప్యం చేసిన కేసులో అప్పటి అనంతపురం కలెక్టర్ గంధం చంద్రుడు శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఎదుట హాజరయ్యారు. అసెంబ్లీ కమిటీ హాలులో గురువారం బీటీ నాయుడి అధ్యక్షతన ప్రివిలేజ్ కమిటీ సమావేశం జరిగింది. దీపక్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై గంధం చంద్రుడిని, అప్పటి డీఆర్వోని కమిటీ పిలిపించి విచారించింది. జాప్యంపై గంధం చంద్రుడు సారీ చెప్పగా.. డీఆర్వో మాత్రం డొంక తిరుగుడు సమాధానం చెప్పడంతో కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని ఆమెను హెచ్చరించింది. మరో కేసులో.. ప్రస్తుత ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ బీటీ నాయుడు విశాఖపట్నం పర్యటనకు వెళ్లిన సమయంలో అతిథిగృహం కోసం అప్పటి డీఆర్వో భవానీ శంకర్‌కు ఫోన్ చేయగా.. కర్నూలు ఎమ్మెల్సీకి విశాఖలో అతిథిగృహం కేటాయించడం కుదరదని సమాధానం చెప్పారు. దీనిపై ఆయన ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా భవానీ శంకర్‌ను కమిటీ పిలిపించి, ప్రశ్నించింది. భవానీ శంకర్ సమాధానమిస్తూ.. పొరపాటైందని.. మళ్లీ ఇలా జరక్కుండా చూసుకుంటానని అన్నారు. జంగా కృష్ణమూర్తి, ఇజాక్ బాషా, రమేశ్ యాదవ్‌ల ఫిర్యాదులపైనా కమిటీ విచారించింది.

గ్రూప్-1 ఫలితాలు సిద్ధం.. నేడు విడుదల..!

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల కోసం అభ్యర్థుల ఎదురుచూపులకు తెరపడనుంది. బుధవారం గ్రూప్-2 ఫలితాలు విడుదల చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాలనూ ప్రకటించేందుకు సిద్ధమైంది. బుధవారం హైకోర్టులో జరిగిన విచారణలో ఫలితాలపై ముందుకెళ్లొచ్చనే ఆదేశాలు వచ్చాయి. దీంతో ఫలితాలు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. హైకోర్టు ఆదేశాల ఉత్తర్వులు కమిషన్‌కు చేరడంతో ఆలస్యం జరిగింది. ఆ ఉత్తర్వులు గురువారం కమిషన్‌కు చేరినట్లు తెలిసింది. దీంతో వెంటనే ఫలితాల విడుదలకు కమిషన్ అధికారులు సిద్ధమయ్యారు. కానీ మరొకసారి మొత్తం ప్రక్రియను పరిశీలించాలని అంతర్గతంగా నిర్ణయించారు. దీంతో ఫలితాలు శుక్రవారం విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

బెంగళూరు-విజయవాడ కారిడార్
2027కల్లా పూర్తికావాలి

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుందన్నారు. గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై ఆయన సమీక్ష జరిపారు. జాతీయ హైవేల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రోడ్లు, ప్రస్తుతం ఏపీలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), కేంద్ర ఉపరితల రవాణా శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలన్నారు. 'మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం, ఓడరేవులను జాతీయ రహదారులతో అనుసంధానించాలి. ఈ పోర్టులకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరకు రవాణా చేసేలా, మారుమూల ప్రాంతాలను కనెక్ట్ చేసేలా రోడ్లు నిర్మించాలి. రోడ్డు ప్రాజెక్టుల పూర్తి విషయంలో మన రాష్ట్రం బెంచ్ మార్క్‌గా ఉండాలి. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న జాతీయ రహదారులను 4 వరుసలు, ఆరు వరుసలుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలి. ప్రస్తుతం రూ.42,194 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం పురోగతిలో ఉంది. వచ్చే ఏడాది డిసెంబరునాటికి వీటిని పూర్తి చేయాలి' అని తెలిపారు.

కేంద్రానికి ప్రతిపాదనలు ఇవ్వాలి..

రాష్ట్రంలో ప్రాధాన్య క్రమంలో చేపట్టాల్సిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు కూడా అనుమతులు తీసుకుని వేగంగా పనులు చేపట్టాలని సీఎం సూచించారు. కేంద్రానికి ఇవ్వాల్సిన ప్రతిపాదనలను కూడా తక్షణమే సమర్పించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, రాయపూర్-అమరావతి, మూలపేట పోర్టు, జగ్‌దల్‌పూర్, రాయపూర్‌లను కూడా అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని నిర్దేశించారు.

రాష్ట్రంలో రహదారి నెట్‌వర్క్ విస్తరణ..

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రహదారి నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేయాలని సీఎం రోడ్లు-భవనాల శాఖను ఆదేశించారు. రూ.2,500 కోట్లతో 6,054 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామని అధికారులు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ ద్వారా రహదారుల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. డేనిష్ ఫైబర్, వేస్ట్ ప్లాస్టిక్ బిటుమిన్, తిరుపతి ఐఐటీ రూపొందించిన నానో కాంక్రీట్ టెక్నాలజీ ద్వారా ప్రయోగాత్మకంగా రోడ్లను వేస్తున్నామని తెలిపారు. 45 వేల కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారుల్లో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రహదారుల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. రామ్స్ టెక్నాలజీ ద్వారా రోడ్ల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పీపీపీ కింద 709 కిలోమీటర్ల మేర 12 రహదారులను కూడా చేపట్టాలని చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పటిష్ఠంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుంటూరు, కుప్పంలో సీఎం పర్యటన

- కుప్పంలో 3 రోజులపాటు కార్యక్రమాలు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రేపటి నుంచి గుంటూరు, కుప్పంలో పర్యటించనున్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాతాశిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని సీఎం శుక్రవారం ప్రారంభిస్తారు. గుంటూరు మెడికల్ కాలేజీ అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా(జింకానా) పేరుతో ఈ కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఆదివారం సాయంత్రం వరకు కుప్పంలో సుమారు రూ.690 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. తొలి రోజు.. రూ.3కోట్లతో నిర్మించిన అగస్త్య విద్యాచల్ అకాడమీని ప్రారంభిస్తారు. రూ.10 కోట్లతో నిర్మించనున్న లెర్నర్స్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్‌ను, రూ.2కోట్లతో చేపట్టే ఓబరాయ్ విజిటర్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. రెండోరోజు.. 5,555 ఈ సైకిళ్ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం 7 కొత్త పరిశ్రమలతో ఎంవోయూలు కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొంటారు. వీటి ద్వారా రూ.675.24 కోట్ల పెట్టుబడులు, 12వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కుప్పం నియోజకవర్గాన్ని నెట్ జీరోగా మార్చే ప్రణాళికను ప్రారంభించడంతోపాటు సుర్బానా జురాంగ్ రూపొందించిన కుప్పం మాస్టర్ ప్లాన్, మోడల్ బస్‌స్టాండ్ డిజైన్లను సీఎం సమీక్షిస్తారు. చివరి రోజైన ఆదివారం.. పార్టీ క్యాడర్‌తో సమావేశమవుతారు. అదే రోజు తిరిగి అమరావతి చేరుకుంటారు.



అరకు ఉత్సవ్‌లో కొమ్ము కిరీటాలు ధరించిన మంత్రులు కందుల దుర్గేశ్, సంధ్యారాణి. చిత్రంలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు


ప్రపంచ పర్యాటక కేంద్రంగా తూర్పుతీరం

- పర్యాటక అభివృద్ధితో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు
- ప్రతి ఇంట్లో కనీసం ఒకరికి పర్యాటకంలో ఉపాధి
- అరకు ఉత్సవ్ ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేశ్

అరకులోయ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తూర్పు తీరాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. గురువారం ఆయన అల్లూరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంధ్యారాణితో కలిసి అరకు ఉత్సవ్-2026ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు వంటి ప్రాంతాలకు పర్యాటకంగా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, వాటిని ప్రపంచానికి చాటిచెప్పేందుకే మూడుచోట్ల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అరకు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అరకును పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అరకు కాఫీ తోటలు పర్యాటకులతో అనుసంధానం చేసి గిరిజన రైతులకు లాభం చేకూర్చేలా కాఫీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే పదేళ్లలో ప్రతిఇంట్లో కనీసం ఒకరికి పర్యాటక రంగంలో ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణను అమలు చేస్తామన్నారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, అరకు ఉత్సవ్‌తో గిరిజన ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు వస్తుందన్నారు.

'జూ'లలో జీవ వైవిధ్యం

- వన్యప్రాణుల సంరక్షణలో కార్పొరేట్లు భాగస్వామ్యం కావాలి
- విశాఖ జూను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- జూలోని రెండు జిరాఫీలను దత్తత తీసుకున్న పవన్



విశాఖ జూ పార్కులో జిరాఫీలకు ఆహారం అందిస్తున్న పవన్

విశాఖపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో జంతు ప్రదర్శనశాలలు కీలకపాత్ర పోషిస్తాయని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గురువారం ఆయన నగరంలోని జంతుప్రదర్శశాలను సందర్శించారు. ఏనుగులు, ఎలుగుబంట్లు, పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వాటి పేర్లు, ఆహార అలవాట్లు అడిగి తెలుసుకున్నారు. జిరాఫీలకు అరటిపండ్లు, రావి ఆకులు తినిపించారు. తన తల్లి అంజనాదేవి జన్మదినం సందర్భంగా రెండు జిరాఫీలను దత్తత తీసుకుంటున్నట్టు పవన్ ప్రకటించారు. సంవత్సరంపాటు వాటి ఖర్చు, సంరక్షణ బాధ్యత తీసుకుంటున్నట్టు చెప్పారు. 650 ఎకరాల్లో గల విశాఖ జూలో వందలాది వన్యప్రాణులు, పక్షులు జీవిస్తున్నాయని, వాటి సంరక్షణలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తమకు నచ్చిన జంతువును ఎంచుకుని, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. తొలుత ఆయన సీతాకోక చిలుకల పార్కును సందర్శించారు. టైగర్ రకానికి చెందిన సీతాకోక చిలుక తనచేతిపై వాలగా సున్నితంగా పట్టుకుని పూల మొక్కలపై విడిచిపెట్టారు. అనంతరం నీటి ఏనుగులను పరిశీలించారు. వాటికి ఇచ్చే ఆహారం, సంరక్షణకు తీసుకునే జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. జూలో నూతనంగా ఎలుగుబంట్ల కోసం ఏర్పాటుచేసిన ఎన్‌క్లోజర్‌ను పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. ఏనుగుల వద్దకు వెళ్లి వాటికి ఆహారాన్ని అందించారు. అనంతరం కంబాలకొండ ఎకోపార్కును సందర్శించారు. అక్కడ 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నగర వనాలను ప్రారంభించారు. ఎకోపార్కులోని శాంతివనంలో మహాగని మొక్కలు నాటారు. పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జ్యోతి, జేసీ విద్యాధరి పాల్గొన్నారు.

చేసేది హోంగార్డు ఉద్యోగం..
అక్రమాస్తులు 20 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధి పొందేవాడు. ఇలా దాదాపు రూ.20 కోట్లకుపైగా అక్రమాస్తులు పోగేశాడు. 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న అక్రమాలు ఇటీవల బయటపడడంతో ఏసీబీ అధికారులు ఆయన నివాసాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించి అక్రమాస్తుల వివరాలు సేకరించారు. నెట్టి శ్రీనివాసరావు 2010లో విజయనగరం పోలీస్‌శాఖలో హోంగార్డుగాచేరాడు. అప్పటి నుంచి 2025 వరకు విజయనగరం ఏసీబీ కార్యాలయంలో పనిచేశాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులకు అందే సమాచారం, లంచం తీసుకుని పట్టుబడే కేసులు, అక్రమాస్తుల వివరాలను తెలుసుకుని చేయబోయే దాడుల గురించి సంబంధిత అధికారులకు ముందే సమాచారం అందించేవాడు. దీనికి బదులుగా వారినుంచి భారీగా నగదు లేదా ఇళ్ల స్థలాల రూపంలో తీసుకునేవాడు. ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలకు వెళ్తున్నారనే కీలక సమచారాన్ని ముందుగానే సంబంధిత అధికారులు, సిబ్బందికి శ్రీనివాసరావు చేరవేశాడు. దీంతో వారు అక్రమాస్తులు పట్టుబడకుండా జాగ్రత్తపడ్డారు. ఏసీబీ అధికారులకు అనుమానం వచ్చి శ్రీనివాసరావు కదలికలపై నిఘాపెట్టారు. ఏడాది క్రితం అతన్ని జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపివేశారు. అప్పటి నుంచి శ్రీనివాసరావు గురించి పూర్తి సమాచారం సేకరించారు.

ఖరీదైన ఇళ్ల స్థలాలు.. డాక్యుమెంట్లు

విశాఖలోని పెందుర్తి, గోపాలపట్నంతో పాటు శ్రీనివాసరావు నివాసం ఉంటున్న విజయనగరం గోకపేట, స్వగ్రామం గుర్ల మండలం నడుపూరులో ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో గురువారం ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో స్థిరాస్తులకు సంబంధించి పలు కీలకమైన డాక్యుమెంట్లు, ఖరీదైన ఇళ్ల స్థలాల పత్రాలు, 23.50 సెంట్ల వ్యవసాయ భూమి, 166 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, రూ.60 వేల నగదు, రూ.7.07 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, కారు, ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.20 కోట్లు ఉంటుందని సమాచారం. ఏసీబీ డిఎస్పీ రమ్య మాట్లాడుతూ... హోంగోర్డు శ్రీనివాసరావుపై అనుమానం రావడంతో ఏసీబీ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేశామని, పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి గురువారం తనిఖీలు చేపట్టామని తెలిపారు. శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆఫీస్ సబార్డినేట్‌కు 50 కోట్ల ఆస్తులు..!

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఇళ్లలో ఏసీబీ సోదాలు



తిరుమలేశ్

తిరుపతి (నేరవిభాగం), మర్రిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన తిరుపతి జిల్లా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి నల్లిపోగు తిరుమలేశ్ ఇంట్లో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. గ్రేడ్-3 ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న తిరుమలేశ్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో తిరుపతిలోని ఆయన ఇంటితో పాటు మరో నాలుగు చోట్ల, నెల్లూరు జిల్లా డీసీపల్లెలోని బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 11 స్థిరాస్తులు, 1472 గ్రాముల బంగారం, 8.77 కిలోల వెండి, రూ.15.26 లక్షల నగదు, విలువైన గృహోపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు లభించిన ఆస్తుల మార్కెట్ విలువ రూ.50 కోట్లకు పైనే ఉంటుందని అంచనా.

ఏప్రిల్ నుంచి చేనేతకు ఉచిత విద్యుత్

- మగ్గాలకు 200, మర మగ్గాలకు 500 యూనిట్లు: మంత్రి సవిత



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉచిత విద్యుత్ హామీ అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఏప్రిల్ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు. మర మగ్గాలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్లు వరకు ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాతో కలిసి, మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'చేనేత పరిశ్రమకు ఉచిత విద్యుత్ పథకం అమలు వల్ల ఏడాదికి రూ.85 కోట్ల మేర ప్రభుత్వంపై భారం పడనుంది. ఉచిత విద్యుత్ వల్ల 93 వేల మగ్గాలు, 10,534 మర మగ్గాలతో కలిపి 1,03,534 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మగ్గానికి నెలకు రూ.720, ఏడాదికి రూ.8,640, మర మగ్గాలకు నెలకు రూ.1,800, ఏడాదికి రూ.21,600 లబ్ధి కలుగుతుంది' అని మంత్రి వివరించారు. గత రెండు నెలల్లో ఆప్కో ద్వారా చేనేత సహకార సంఘాలకు రూ.7కోట్ల బకాయిలు చెల్లించామని తెలిపారు. కాగా, ఆప్కోలో రెడీమేడ్ దుస్తుల అమ్మకాలతో నేతన్నలకు ఉపాధి పెరిగిందని, ఈ-కామర్స్ ద్వారా చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామని మంత్రి తెలిపారు.

5 లక్షల పీఎం ఆవాస్ ఇళ్లకు విద్యుత్ ఆదా

- ప్రతి ఇంటికీ ఎల్ఈడీ బల్బులు, బ్యాటన్లు, సీలింగ్ ఫ్యాన్లు
- దేశంలోనే అతిపెద్ద ఇంధన పొదుపు కార్యక్రమం
- లబ్ధిదారులకు కూటమి సర్కారు వరం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద ఇంధన పొదుపు కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద నిర్మిస్తున్న ఇళ్లకు విద్యుత్తును ఆదా చేసే ఎల్ఈడీ లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు ఇవ్వడం ద్వారా ఈ భారీ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈమేరకు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌హెచ్‌సీఎల్), ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్), ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఈఈడీసీఓ) ఓ త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నాయి. గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ అంతర్జాతీయ సదస్సు వేదికగా గురువారం ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఎండీ అరుణ్‌బాబు, ఈఈఎస్ఎల్ సీఈవో అఖిలేశ్ కుమార్ దీక్షిత్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా.. తొలి దశలో 5 లక్షల మంది పీఎంఏవై ఇళ్ల లబ్ధిదారులకు 4ఎల్ఈడీ బల్బులు, 2ఎల్ఈడీ బ్యాటన్ లైట్లు, 2 బీఎల్‌డీసీ(బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్) సీలింగ్ ఫ్యాన్లు ఇస్తారు. బీఎల్‌డీసీ ఫ్యాన్ల వినియోగం ద్వారా 80 శాతం వరకు విద్యుత్తును ఆదా చేయవచ్చు. ఎల్ఈడీ లైట్లు కూడా విద్యుత్తును గణనీయంగా ఆదా చేస్తాయి. వీటి వినియోగం ద్వారా ప్రతి కుటుంబానికీ ఏడాదికి సుమారు రూ.3,341 ఆదా అవుతుందని అంచనా. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా గత ఏడాది నవంబరులో రాయచోటిలో సీఎం చంద్రబాబు ప్రారంభించారు. 18వేల మంది లబ్ధిదారులకు ఎల్ఈడీ లైట్లు అందించారు.

నిర్మాణ దశలో రూ.6 వేల కోట్ల విద్యుత్తు ప్రాజెక్టులు

- 2 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.6వేల కోట్లతో వివిధ విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటన్నింటినీ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్తు ప్రాజెక్టుల పురోగతిపై సచివాలయంలో గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దాలని, ఇప్పటికే ట్రాన్స్‌మిషన్ ఇబ్బందులను అధిగమించేందుకు పలు జిల్లాల్లో నూతన సబ్‌స్టేషన్లను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ 2 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీఆర్డీయే పరిధిలో అమరావతి రాజధాని పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఆ పనులనూ ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్తు శాఖ అధికారులుముందుకు సాగాలన్నారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రాన్స్‌కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను ప్రజలకు చెబుదాం!

- లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా అత్యంత దుర్మార్గం
- జనసేన శాసనసభాపక్షం ఆగ్రహం
- పవన్ కల్యాణ్ నేతృత్వంలో వర్చువల్‌గా భేటీ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైసీపీ హయాంలో సాగించిన అరాచకాలు, కల్తీ నెయ్యి సరఫరా గురించి ప్రజలకు తెలియజెప్పాలని జనసేన శాసనసభా పక్షం నిర్ణయించింది. అసలు నెయ్యే లేకుండా రసాయనాలతో నెయ్యి సరఫరా చేయడం అత్యంత దుర్మార్గమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా, వారి ఆరోగ్యాలతో చెలగాటమాడడమే అవుతుందని స్పష్టం చేసింది. ఇంత అరాచకం చేసి, బుకాయింపులతో ప్రజల్ని మభ్యపెట్టే చర్యలకు వైసీపీ నేతలు దిగారని మండిపడ్డారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో జనసేన శాసనసభాపక్షం గురువారం మధ్యాహ్నం వర్చువల్‌గా జరిగింది. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, అసెంబ్లీ, మండలి విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో మొదలయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ వైఖరి, తదితర అంశాలు చర్చకు వచ్చాయి. తిరుపతి లడ్డూల విషయంలో గత ప్రభుత్వం చేసిన కల్తీ వ్యవహారంపై సభలో చర్చిద్దామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. ఎమ్మెల్సీ కె.నాగబాబు మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ నెయ్యిపై సభలోనే గాక మీడియా, సోషల్ మీడియాల్లోనూ లోతుగా చర్చ చేసి, ప్రజలకు వాస్తవాలు వివరించాల్సి ఉన్నదన్నారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలపైనా చర్చించారు. ఆరోపణలు వచ్చిన వెంటనే పార్టీ తరపున త్రిసభ్య కమిటీ వేసి, నిజనిజాలు విచారించాలని ఆదేశాలివ్వడం ద్వారా పార్టీ ఎంత నిబద్ధతతో ఉంటుందో పవన్ కల్యాణ్ అందరికీ తెలియజేశారని శాసనసభాపక్షం పేర్కొంది. బడ్జెట్ సమావేశాలకు ముందు మరోసారి శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి మనోహర్ మీడియాకు తెలిపారు.

కల్తీ నెయ్యితో 22 కోట్ల లడ్డూల తయారీ

- వైవీకి తెలిసే కల్తీ నెయ్యి సరఫరా: నీలాయపాలెం
- కల్తీనెయ్యిపై చర్చించేందుకు జగన్ అసెంబ్లీకి రావాలి: మంత్రి కొల్లు

అమరావతి, రాయదుర్గం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి, కోట్లాది మంది భక్తుల మనోభావాలను వైసీపీ గాయపరిచిందంటూ టీడీపీ నేతలు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ మాట్లాడుతూ... 'కల్తీ నెయ్యితో సుమారు 22 కోట్ల తిరుపతి లడ్డూలు తయారు చేసి భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. అసలు పాలే లేకుండా నెయ్యి తయారీ జరిగినట్లు సిట్ నివేదిక ఇవ్వడంతో జగన్ పని గోవింద" అని వ్యాఖ్యానించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ...జగన్‌కు ధైర్యం ఉంటే కల్తీ నెయ్యిపై చర్చించేందుకు ఫిబ్రవరి 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు కూడా దీనిపై స్పందించారు.

లడ్డూల్లో కల్తీ వాస్తవం: మంత్రి సవిత

గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూల్లో కల్తీ జరగడం వాస్తవమని మంత్రి సవిత అన్నారు. 'కల్తీకి కేరాఫ్ అడ్రస్ జగన్. మద్యం కల్తీతో పాటు వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు' అని ధ్వజమెత్తారు.

మహా పాపం నిజం

- రాజమహేంద్రవరంలో కూటమి నేతల ర్యాలీ


రాజమహేంద్రిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కూటమి నేతలు

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ వల్ల అంటుకున్న పాపాన్ని కడగడానికి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి నేతలు గురువారం ఆలయాలను శుద్ధి చేశారు. రాజమహేంద్రవరం సిటీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ నాయకత్వంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని గోదావరి జలాలతో శుద్ధి చేశారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలోని కన్నమ్మ గుడి వద్ద నూతన కమిటీ ప్రమాణస్వీకారానికి ముందు ఆలయం గడప కడిగి శుద్ధి చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ కేడర్ కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుద్ధి చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో బీమోలులోని అక్కదేవతల అమ్మవారి ఆలయంలో, దేవరపల్లిలోని ఇందిరమ్మ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గౌరీపట్నం శివాలయంలో శుద్ధి చేసి పూజలు చేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు గోష్పాద క్షేత్రం శివాలయంలో శుద్ధి చేశారు.

నెయ్యిలో కల్తీ జరిగిందనే సిట్ చెప్పింది

- జంతువుల కొవ్వు లేదని తేల్చింది: వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని మాత్రమే సిట్ తేల్చిందని వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అందులో జంతువుల కొవ్వు లేదని పేర్కొందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పడిన సిట్ నివేదికలో అసలు నిజం బహిర్గతమైందన్నారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు అసత్య ప్రచారం చేశారని, స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు.

కల్తీ కోసమే 'కుట్ర'!

(మొదటి పేజీ తరువాయి)

యథేచ్ఛగా కల్తీ నెయ్యిని సరఫరా చేశాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' గతంలోనే వెలుగులోకి తెచ్చింది. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు సీబీఐ నేతృత్వంలోని సిట్ కూడా అదే విషయం చెప్పింది.

కల్తీకి రాచమార్గం...


టీడీపీ పాలనలో 2019 ఏప్రిల్‌లోనే నెయ్యి కొనుగోలు టెండర్ల నిబంధనలను టీటీడీ కఠినతరం చేసే ప్రక్రియ మొదలుపెట్టింది. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేసిందని సిట్ తెలిపింది. "నెయ్యి కొనుగోలుకు జాతీయస్థాయి కేటగిరీ టెండర్లు పిలవాలి. టెండర్లలో పాల్గొనే కంపెనీల వార్షికాదాయం 250 కోట్లు ఉండాలి. రోజువారీగా కనీసం 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేస్తుండాలి. ఈ మేరకు భారత ఆహార ప్రమాణాల అథారిటీ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) నుంచి ధ్రువీకరణ పొంది ఉండాలి" అని కమిటీ సిఫారసు చేసింది. కమిటీ నివేదిక ఇచ్చేనాటికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. జగన్ 2019 మే నెలలో ముఖ్యమంత్రి అయ్యారు. వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యారు. కానీ, పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పాటు కాలేదు. దీంతో ఆ కమిటీ సిఫారసులను నాటి టీటీడీ ఈవో ఆమోదించారు. 2019 ఆగస్టు నుంచి కొత్త సిఫారసులు అమలులోకి వచ్చాయి.

వైవీ నాయకత్వంలో రూల్స్ రివర్స్

వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పడగానే... 'కథ' మారిపోయింది. 'ఇంత కఠినమైన నిబంధనలుంటే ఎలా? కల్తీకి ఆస్కారం కల్పించాలి కదా!?' అన్నట్లుగా ఆ నిబంధనలు మార్చాలని భావించారు. 2020 జనవరిలో ప్రొఫెషనల్ కమిటీని ఏర్పాటు చేశారు. 'టెండర్లలో పోటీ పెంచి అత్యధికులు పాల్గొనేలా చూడాలి' అనే పేరుతో, నిబంధనల సడలింపునకు తెరలేపారు. టెండర్లలో పాల్గొనే కంపెనీలు రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేస్తుండాలనే నిబంధన ఎత్తేశారు. డెయిరీ నిర్వహణ కాలపరిమితి మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. కంపెనీ వార్షికాదాయం 150 కోట్లు ఉంటే చాలని తేల్చేశారు. 'టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీ అసలు పాలు సమీకరించకున్నా ఫర్వాలేదు' అని తేల్చడం మొత్తం వ్యవహారానికి పరాకాష్ఠ. ప్రొఫెషనల్ కమిటీ సిఫారసులను బోర్డు ఫిబ్రవరి 2న ఆమోదించింది. తద్వారా 'కల్తీకి రాచమార్గం వేశారు' అని 'సిట్' స్పష్టం చేసింది.

నెయ్యి సరఫరా ఎలా?

సిట్ విచారణ ఓ మౌలికమైన, కీలకమైన అంశాన్ని లేవనెత్తింది. రోజుకు సగటున 4 లక్షల లీటర్ల పాలు సేకరించే డెయిరీలే టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలన్న నిబంధన ఉంటే, దాన్ని వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని బోర్డు ఎందుకు తీసేసింది? పాల సేకరణ చేయని డెయిరీలకు ఎందుకు అవకాశం కల్పించింది? అంటే, పాల సేకరణ చేయని డెయిరీ నెయ్యి ఎలా తయారు చేస్తుంది? టెండర్‌లో ఈ వెసులుబాటు అనేదే కల్తీ నెయ్యి కోసం జరిగిన తొలిప్రయత్నంలా ఉంది. పాలు సేకరించని డెయిరీ నెయ్యి ఎలా తయారు చేస్తుంది? సహజంగానే కల్తీనెయ్యిని తయారుచేస్తుంది. నె య్యి సరఫరాలో ఇదే జరిగింది కదా. అంటే, ఫక్తు కల్తీనెయ్యిని కొనాలన్న ముందస్తు కుట్రతోనే నిబంధనలను సడలించి, ఆ తర్వాత దిక్కుమాలిన కంపెనీలకే సరఫరా టెండర్ ఇచ్చారనేది ఇప్పుడు స్పష్టమైంది. నిబంధనల సడలింపు వల్ల ఏపీలోనే ప్రముఖమైన విజయా డెయిరీ, ఇతర కంపెనీలు పాల్గొనకుండా చేశారు. నిబంధనలకు గేట్లు ఎత్తివేయడంతో తాము కోరుకున్న కంపెనీలే టెండర్ దక్కించుకోవడం జరిగిందని ఈ నివేదికలోని అంశాలు తేటతెల్లం చేస్తున్నాయి.



నిబంధనల సడలింపే అసలు కారణం

సహకార డెయిరీలు రోజూ 4లక్షల లీటర్ల పాలను సేకరిస్తుంటాయి. సేకరించిన పాలతోనే నెయ్యిని తయారు చేస్తాయి. టీటీడీకి స్వచ్ఛమైన, నాణ్యతగల నెయ్యిని సరఫరా చేసిన చరిత్ర వాటిది. అలాంటి వాటిని టెండర్‌నుంచి దూరం పెట్టాలనే కుట్రతోనే... నిబంధనలను సడలించినట్లు 'సిట్' స్పష్టం చేసింది. దీని వెనుక కుట్రను నిగ్గుతేల్చింది. పాత్రధారులనూ గుర్తించారు. మరి... సూత్రధారుల సంగతేమిటి? అంతిమ లబ్ధి పొందింది ఎవరు? కల్తీనెయ్యి టెండర్లలో నాటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సహాయకుడిగా ఉన్న చిన్న అప్పన్న (ఏ24) పాత్ర కీలకమని సిట్ తేల్చింది. ఆయనకు భారీగా డబ్బులు ముట్టాయని నిర్ధారించింది. పీఏను పట్టుకోగలిగిన సిట్, వారి వెనక ఉన్న పెద్దలను ఎందుకు పట్టించుకోవడం లేదు? పీఏ ఖాతాలోనే భారీగా ముడుపులు పడితే, ఆయనను నడిపించిన వారికి ఎంత అంది ఉంటుందో!

కల్తీ నెయ్యి కథ ఇదీ

2019 వైసీపీ సర్కారులో బీజం.. నెయ్యి కొనుగోలు నిబంధనలు సడలింపు.. 2022లోనే కల్తీ వ్యవహారం వెలుగులోకి

- నెయ్యి సరఫరా డెయిరీలతో లంచం డిమాండ్ చేసిన వైవీ పీఏ
- కూటమి వచ్చాక వ్యవహారం వెలుగులోకి
- కల్తీ జరిగినట్టు ల్యాబ్‌లో నిర్ధారణ
- సీబీఐ సిట్ విచారణ.. చార్జిషీట్
- 2019-24 మధ్య టీటీడీకి రూ.250 కోట్ల నెయ్యి సరఫరా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలిపి అపవిత్రం చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆటలాడుకున్నారు. టీటీడీ నిబంధనలను అడ్డగోలుగా మార్చేసి టన్నుల కొద్దీ కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ప్రసాదాల్లో కలిపేశారు. కాసులకు కక్కుర్తి పడి తిరుమలలో అపచారం చేశారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు దొంగ అరుపులు అరుస్తున్నారు. తమకేమీ తెలియదన్నట్లు అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ టీటీడీ నెయ్యి కొనుగోలులో ఏం జరిగింది? ఏయే నిబంధనలను ఎప్పుడు సవరించారు? ఏ ఉద్దేశంతో నిబంధనలు మార్చారు? కల్తీ ఎలా జరిగింది. వంటి వివరాలు మొత్తం వెలుగులోకి వచ్చాయి.

2019లో వైసీపీ ప్రభుత్వంలో

నెయ్యి కొనుగోలు నిబంధనలు మార్చేశారు.

2022 ఆగస్టు 3-కల్తీ వెలుగులోకి

సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ టీటీడీకి వచ్చే నెయ్యిని టెస్ట్ చేయగా నూనెలతో కల్తీ చేసినట్లు తేలింది. బకానీ అప్పటి టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం వీటిని పట్టించుకోలేదు. పైగా 2022 అక్టోబరులో మళ్లీ అవే డెయిరీలకు కొత్త ఆర్డర్లు ఇచ్చారు.

2022-వైవీ పీఏ పాత్ర

నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఆయన పీఏ చిన్నప్పన్న ప్రొక్యూర్‌మెంట్ జీఎంను కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కంపెనీల వివరాలు తీసుకున్నారు.

2022-లంచం డిమాండ్

చిన్నప్పన్న భోలే బాబా డెయిరీని సంప్రదించి ప్రతి కిలో నెయ్యికి రూ.25 లంచంగా ఇవ్వాలని కోరారు. సదరు కంపెనీ దీనికి అంగీకరించలేదు. దీంతో ప్రొక్యూర్‌మెంట్ జీఎం ద్వారా టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా రెండో తనిఖీలు నిర్వహించాలని, త్వరలో పిలిచే నెయ్యి టెండర్లలో సదరు కంపెనీకి అర్హత లేకుండా చేయాలని ఒత్తిడి తెచ్చారు.

2022-భోలే బాబా డిస్‌క్వాలిఫై

చిన్నప్పన్న ప్రీమియర్ అగ్రి ఫుడ్ కంపెనీలతో పరిచయం పెంచుకుని, కొత్త టెండర్లలో భోలే బాబా డెయిరీని డిస్‌క్వాలిఫై చేయించారు.

2022-రంగంలోకి కొత్త డెయిరీలు

భోలే బాబా డెయిరీ 2022 వరకూ టీటీడీకి నేరుగా నెయ్యి సరఫరా చేసింది. తర్వాత ఆ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. అధికారుల అండతో వైష్ణవీ డెయిరీ, ఏఆర్‌డెయిరీ, మాల్ గంగా వంటి డెయిరీలు షెల్ కంపెనీల ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేశాయి.

2024 జూలై 17-నెయ్యి ట్యాంకర్ల రిజెక్ట్

కొత్త టెండర్ల ద్వారా ఎంపికైన డెయిరీల నుంచి వచ్చే నెయ్యి ట్యాంకర్లను అనేకసార్లు టీటీడీ తిరస్కరించింది. అది కూడా సాధారణ తనిఖీల్లోనే ఆ ట్యాంకర్లను తిరస్కరించింది. కల్తీ నెయ్యి కేసులో తొలిసారి ఇక్కడే వెలుగులోకి వచ్చింది.

2024 జూలై 20-ముఖ్యమంత్రి సూచన

టీటీడీ వ్యవస్థలో లోపాలు సరి చేయాలని, లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాలని, నాణ్యమైన నెయ్యి టీటీడీకి వచ్చేలా చూడాలని, ఆన్‌లైన్ దర్శనం టికెట్ల వ్యవహారాన్ని సరి చేయాలని, అన్నప్రసాదాల్లో నాణ్యత పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లు ఈవో ప్రకటన విడుదల చేశారు.

2024 జూలై 22-నెయ్యి శాంపిల్స్ సేకరణ

టీటీడీ తిరస్కరించిన ట్యాంకర్ల నుంచి సేకరించిన నెయ్యిని పరీక్షల కోసం అధికారులు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు పంపించారు.

2024 జూలై 23- కల్తీ వ్యవహారం

లడ్డూ నాణ్యత తగ్గిందని, నాణ్యమైన నెయ్యి వాడితేనే నాణ్యమైన లడ్డూ వస్తుందని నిపుణులు చెప్పినట్లు ఈవో వెల్లడించారు. టీటీడీలో ప్రొక్యూర్‌మెంట్ విభాగం చాలా బలహీనంగా ఉందని, టీటీడీలో నెయ్యిని టెస్ట్ చేసే పరిస్థితి లేదన్నారు. నెయ్యిలో నూనెతో పాటు ఏదో తెలియని పదార్థాలు కలిసినట్లు గుర్తించామని ఈవో ప్రకటించారు.

2024 ఆగస్టు 21-కల్తీ నిర్ధారణ

నెయ్యిలో కల్తీ జరిగిందని నిర్ధారిస్తూ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు నివేదిక ఇచ్చింది.

2024 సెప్టెంబరు 18-సీఎం ప్రకటన

టీటీడీ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని మంగళగిరిలో జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించారు.

2024 సెప్టెంబరు 19-సుబ్బారెడ్డి పిటిషన్

కల్తీ నెయ్యి, కల్తీ లడ్డూ వ్యవహారంపై జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

2024 సెప్టెంబర్25-క్రిమినల్ కేసు

వైసీపీ ప్రభుత్వ సమయంలో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణపై కేసు నమోదైంది.

2024 అక్టోబరు 4-సీబీఐ నేతృత్వంలో సిట్

సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

2025 డిసెంబరు వరకు సిట్ విచారణ

సీబీఐ బృందం గత ఏడాది డిసెంబరు వరకు 14 నెలలు 12 రాష్ట్రాల్లో దర్యాప్తు చేపట్టింది. మరికొన్ని ప్రదేశాల్లో సోదాలూ నిర్వహించింది.

2025 ఫిబ్రవరి 9-తొలి అరెస్టులు

భోలే బాబా డెయిరీకి చెందిన పోమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవీ డెయిరీకి చెందిన అపూర్వ చావ్లా ఏఆర్ డెయిరీకి చెందిన డా.రాజు రాజశేఖరన్‌తో పాటు అజయ్‌కుమార్ సుగంద్, ఆశీష్ అగర్వాల్, హర్మోహన్‌రాణాలను అరెస్ట్ చేశారు.

2025 మే-తొలి చార్జిషీట్

సీబీఐ తొలి చార్జిషీట్ దాఖలు చేసింది. 24 మందిని నిందితులుగా చేర్చింది.

2025 నవంబరు 28-టీటీడీ జీఎం అరెస్ట్

టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యంను సిట్ అరెస్ట్ చేసింది.

2026 జనవరి 23-చివరి చార్జిషీట్

2019-24 మధ్య 68 లక్షల కిలోల నెయ్యి అంటే దాదాపు రూ.250 కోట్ల విలువైన నెయ్యి సరఫరా అయినట్లు సిట్ విచారణలో గుర్తించింది. ఆవు నెయ్యిని పోలి ఉండేలా వివిధ రకాల కెమికల్స్, నూనెలు, ఇతర వస్తువులు కలిపినట్లు గుర్తించింది. 36 మందిని నిందితులుగా చేర్చింది.

వైవీ పీఏ ఖాతాలో నగదు

చిన్నప్పన్న బ్యాంక్ ఖాతాలో రూ.4.69 కోట్లు జమ అయినట్టు గుర్తించారు. ఈ డబ్బును వివిధ ఖాతాల్లోకి మళ్లించారు.

రాజ్ కసిరెడ్డికి షాక్

- మద్యం స్కామ్‌లో బెయిల్ పిటిషన్ తిరస్కృతి
- ఆర్థిక నేరాల్లో నిందితుల పట్ల కఠిన వైఖరి అవసరం: హైకోర్టు



అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి (ఏ1) హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. మరో నిందితుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సైతం కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. "కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రికి ఐటీ సలహాదారుగా ఉన్నారనేది కాదనలేని వాస్తవం. ఇతర నిందితులతో కలిసి పన్నిన కుట్రలో భాగంగా రాజ్ కసిరెడ్డి తన కార్యాలయంలో అనేక సమావేశాలు నిర్వహించినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. కసిరెడ్డి, ఆయన సిండికేట్‌కు ముడుపులు చెల్లించిన మద్యం బ్రాండ్‌లకు మాత్రమే ఆర్డర్స్ ఫర్ సప్లై ఇచ్చినట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. కొత్తమద్యం పాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే 2020లో అదన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించారు. నిందితుడు ముప్పిడి అవినాశ్(ఏ7) ద్వారా కసిరెడ్డి దీనిని నియంత్రించినట్లు తెలుస్తోంది. ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) నుండి కసిరెడ్డి, అవినాశ్‌రెడ్డిలకు రూ.750కోట్లు అందాయని ఆరోపణలు ఉన్నాయి. వాటిని ఉనికిలో లేని షెల్ కంపెనీలకు మళ్లించారు. షెల్ కంపెనీల నుండి రూ.135కోట్లు వివిధ ఖాతాలకు బదిలీ చేసినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయి. వాట్సప్ చాట్, కాల్‌డేటా, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు పరిశీలిస్తే ఈ అక్రమ లావాదేవీల్లో కసిరెడ్డి పాత్ర ఉన్నట్లు స్పష్టమౌతుంది. కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తే పరారీలో ఉన్న అవినాశ్‌రెడ్డిని చట్టం నుండి తప్పించే అవకాశం ఉంది. దర్యాప్తు నకు కూడా ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. కసిరెడ్డి గతంలో విదేశాలకు వెళ్లి దర్యాప్తు నుండి తప్పించుకొనేందుకు ప్రయత్నించినట్లు గుర్తించాం. భారీ స్థాయిలో ప్రజా సొమ్మును దారి మళ్లించారు. ఇలాంటి ఆర్థిక నేరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన నిందితుల పట్ల కఠిన వైఖరి అవసరం" అని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి పేర్కొన్నారు.

జైలునుంచి చెవిరెడ్డి విడుదల

- మద్యం స్కామ్ కేసులో షరతులతో బెయిల్ మంజూరు
- సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడికి కూడా..

అమరావతి, విజయవాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన అనుచరుడు చెరుకూరి వెంకటేశ్ నాయుడు, ఎస్పీ డిస్టిలరీస్ అధినేత సజ్జల శ్రీధర్‌రెడ్డిలకు హైకోర్టు గురువారం కఠినమైన షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సాయంత్రం వారంతా విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. చెవిరెడ్డికి స్వాగతం పలకడానికి వచ్చిన వైసీపీ శ్రేణులు జైలు వద్ద నానా హడావుడి చేశారు. పెద్దపెద్దగా నినాదాలు చేశారు. అనంతరం చెవిరెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా తనకు అరెస్టులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 72 కేసులు పెట్టారని, తనను అన్ని జైళ్లకు తిప్పారన్నారు.

ఇవీ బెయిల్ షరతులు..

ఒక్కొక్కరూ రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. పాస్‌పోర్టులను ట్రయల్ కోర్టుకు స్వాధీనపరచాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదు. దర్యాప్తు అధికారికి సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర హద్దులు దాటి వెళ్లడానికి వీల్లేదు. బెయిల్ పై విడుదలైన రెండు వారాల్లో తమకు వ్యక్తిగతంగా, ఉమ్మడిగా ఉన్న స్థిర-చరాస్తులు, బ్యాంక్ ఖాతా, డీమ్యాట్ ఖాతా, వ్యాపార ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ట్రయల్ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి.

కనువిందుగా పుష్ప ప్రదర్శన


పుష్పాలతో అప్పన్న రూపం.. ఎదురుగా కాలీ ఫ్లవర్‌తో మొసలి రూపం

విశాఖ ఉత్సవ్‌లో భాగంగా సిటీ సెంట్రల్ పార్కులో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ) ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. బెంగళూరు, కోల్‌కతా, కడియం నుంచి తెప్పించిన అరుదైన పుష్పాలతో, వివిధ రకాల ఆకృతుల్లో ప్రదర్శన ఏర్పాటుచేశారు. సైకత శిల్పాలు, కూరగాయాలతో వింతైన ఆకృతులు, సందర్శకులు ఫొటోలు తీసుకోవడానికి వీలుగా సెల్ఫీ పాయింట్లు పెట్టడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శిస్తున్నారు. గురువారం ప్రారంభమైన ఈ ప్రదర్శన శనివారం వరకు ఉంటుంది.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం


కాకరకాయలతో డ్రాగన్

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.